జూన్
2015

110

సంపుటి : 10 సంచిక : 2

వెల రు. 10/-

## ఈ సంచికలో........

ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతి కోసం ఉద్యమించాలి
అంబేద్కర్ వారసత్వం
ఈనాటికీ తరగని మార్క్స్ ప్రాధాన్యత
బేసెల్ ప్రమాణాల అడకత్తెరలో భారత జాతీయ బ్యాంకులు
వ్యవసాయేతర పనులకు మళ్లుతున్న వ్యవసాయ కార్మికులు
చైనాపై యుద్ధానికి అమెరికా వ్యూహం
రాజరికంపై గిరిజనుల తిరుగుబాటు బావుటా కామ్రేడ్ దశరథ దేవ్

**శతజయంతి నివాళి**


## రాజరికంపై గిరిజనుల తిరుగుబాటు బావుటా

# కామ్రేడ్ దశరథ దేవ్

**హరిపదదాస్**

సిపియం కేంద్రకమిటి సభ్యులు, త్రిపుర రాష్ట్ర మాజీముఖ్యమంత్రి దశరథ్‌దేవ్ శతజయంతి ఈ సంవత్సరం ఫిబ్రవరి రెండవతేదీ నుండి ప్రారంభమైంది. ఫిబ్రవరి రెండవతేదీన అగర్తలాలోని రవీంద్ర శతవార్షిక భవన్‌లో జరిగిన సభలో త్రిపుర రాష్ట్ర ముఖ్యమంత్రి, సిపియం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ దశరథ్‌దేవ్ శతజయంతి ఉత్సవాలను ప్రారంభించారు. 'రాజా దశరథ్' అని గిరిజనులు ముద్దుగా పిలుచుకొనే దశరథ్ దేవ్ ఖోవాయ్ సబ్‌డివిజన్‌లోని సుదూర గ్రామమైన అంపురాలో 1916 ఫిబ్రవరి రెండవ తేదీన పేదగిరిజన రైతు కుటుంబంలో జన్మించాడు. ఆయన 1943లో అగర్తలాలోని ఉమాకాంత స్కూల్‌లో మెట్రిక్యులేషన్‌లో మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోగల హబీగంజ్‌లోని బృందావన్ కాలేజీలో 1945లో డిగ్రీ పాసయ్యాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవటానికి కోల్‌కతాలోని కాలేజిలో చేరాడు. త్రిపురలోని గిరిజనులు తరతరాలుగా విద్యకు దూరమై రాజు, ఆయన అనుచరులు, గ్రామీణ పెత్తందార్ల, భూస్వాముల దోపిడీకి గురవుతున్నారు. అమాయకులైన గిరిజనులలోని నిరక్షరాస్యతను పారద్రోలటానికి త్రిపురలోని గిరిజన ప్రాంతాల్లో ఆయన మిత్రులు కొందరు గిరిజనులను విద్యావంతులను చేసే ఉద్యమాన్ని చేపట్టారు. వారి పిలుపునందుకొని ఆయన వెంటనే త్రిపురకు తిరిగివచ్చాడు.

1945 డిసెంబరు ఏడవ తేదీన జనశిక్షా సమితిని దశరథదేవ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సుధన్వ దేబ్బర్మ, అఘోర్ దేబ్బర్మ, హేమంత్ దేబ్బర్మ తదితరులు ఇతర సభ్యులుగా ఉన్నారు. ఒక సంవత్సర కాలంలోనే త్రిపుర రాష్ట్రవ్యాపితంగా 488 స్కూళ్ళను ఏర్పాటు చేశారు. దీనివలన రాచరికానికి రాగల ప్రమాదాన్ని ఊహించిన రాజు అనుయాయులు ఈ ఉద్యమాన్ని మొగ్గలోనే తుంచివేయటానికి పూనుకున్నారు. కాని దృఢనిశ్చయంతో ఉద్యమిస్తున్న



జనశిక్షాసమితి నాయకులు రాజు నిరంకుశచర్యలను ఎదుర్కొంటూ తమ ఉద్యమాన్ని కొనసాగించారు.

జనశిక్షాసమితి నాయకులు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం కావాలనే నినాదాన్ని క్రమంగా ముందుకు తీసుకువచ్చారు. సహజంగానే ఈ నినాదం రాజుకు ఆగ్రహం కలిగించింది. ఈ ఉద్యమాన్ని అణచివేయటానికి రాజు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించాడు. గిరిజన ప్రాంతాలలోకి వేలాదిమంది పోలీసులను, సైనికులను పంపారు. జనశిక్షాసమితి నాయకుల కొరకు వెదకుతూ గ్రామం తర్వాత గ్రామాన్ని తగులబెడుతూ వారి ఆహారధాన్యాలను కూడా తగులబెట్టారు. ఈ ఉద్యమం ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చేయటానికి పోలీసులు గ్రామాలను చుట్టుముట్టారు. పురుషులు అడవులలోకి తప్పుకున్నారు. పోలీసులు, సైనికులు మహిళలపై అత్యాచారాలు, దాడులు చేయటం కొనసాగించారు. ఇటువంటి భయంకర పరిస్థితులలో రాజరికం గ్రామీణులపై సాగిస్తున్న అకృత్యాలను, అణచివేతను ప్రతిఘటించటానికి 1948లో గణముక్తి పరిషత్‌ను ఏర్పాటుచేశారు. 1950లో చట్టపరంగా త్రిపురను భారతదేశంలో భాగంగా చేసి, త్రిపుర ప్రాంతీయకౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో కాంగ్రెస్ మెజారిటి సాధించింది. ఆ విధంగా రాజు స్థానంలో కాంగ్రెస్ పాలన ఏర్పడింది. కాని అది గణముక్తి పరిషత్ పట్ల రాజు పాలనలో అనుసరించిన విధానానికి భిన్నంగా వ్యవహరించలేదు. గిరిజన గ్రామాల లోని ప్రజలకు రాజు పాలనలో కొనసాగిన హింసాకాండ నుండి కాంగ్రెస్ పాలనలో కూడా ఏమాత్రం విరామం లభించలేదు. అంతే కాకుండా గ్రామీణ ప్రజలపై మరింత తీవ్రంగా ఆటవికదాడులను కొనసాగించారు. దశరథ్ దేవ్‌తో పాటు గణముక్తి పరిషత్ నాయకుల ఆచూకి తెలిపిన వారికి 10,000 రూపాయల పారితోషికం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

రహస్య జీవితం గడుపుతూనే 1952 జనరల్ ఎన్నికలలో దశరథ్‌దేవ్ తూర్పు త్రిపుర నియోజకవర్గం నుండి పార్లమెంటుకు పోటీచేశాడు. పెద్ద మెజారిటీతో పార్లమెంటుకు ఎన్నికైన తర్వాత రహస్యంగా ఢిల్లీవెళ్ళి, పార్లమెంటులో ప్రత్యక్షమై, స్వతంత్ర భారతదేశంలో తాను స్వేచ్ఛగా సంచరించటానికి ఎందుకు అవకాశంలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు. అపుడు ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కలగజేసుకొని దశరథ్‌దేవ్‌తో పాటు గణముక్తి పరిషత్ నాయకులందరిపైనా ఉన్న అరెస్ట్ వారెంట్‌లను రద్దు చేయమని ఆదేశించాడు. అపుడుమాత్రమే దశరథ్‌దేవ్, గణముక్తి పరిషత్ నాయకులపై ఉన్న అరెస్ట్ వారెంట్లను రద్దుచేశారు. పోలీసులను, సైన్యాన్ని త్రిపురలోని గిరిజన ప్రాంతాల నుండి ఉపసంహరించారు. గణముక్తి పరిషత్ నాయకులు స్వేచ్ఛగా సంచరించగలిగారు.

ఆయన 1952, 1957, 1962, 1967లలో తూర్పు త్రిపుర లోక్‌సభ నియోజక వర్గం నుండి పార్లమెంటుకు ఎన్నికైనాడు. 1978లో రామచంద్రఘాట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి మొదటిసారిగా అసెంబ్లీకి ఎన్నికయాడు.

దశరథదేవ్ 1950లో భారత కమ్యూనిస్టుపార్టిలో చేరాడు. 1951లో జరిగిన మొదటి రాష్ట్ర మహాసభలో

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. రాజరికంపై గిరిజనుల తిరుగుబాటు బావుటా కామ్రేడ్ దశరథ దేవ్

– హరిపదదాస్ 2

2. ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతి కోసం ఉద్యమించాలి

– వి. శ్రీనివాసరావు 4

3. అంబేద్కర్ వారసత్వం

– ఎన్. రామ్ 12

4. ఈనాటికీ తరగని మార్క్స్ ప్రాధాన్యత

– ఎరిక్ హాబ్స్ బామ్ 16

5. బేసెల్ ప్రమాణాల అడకత్తెరలో భారత జాతీయ బ్యాంకులు

– కొండముది లక్ష్మీప్రసాద్ 23

6. వ్యవసాయేతర పనులకు మళ్లుతున్న వ్యవసాయ కార్మికులు

– వై. సిద్దయ్య 29

7. చైనాపై యుద్ధానికి అమెరికా వ్యూహం

– నిక్‌బీమ్స్ 33



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్–20
**ఫోన్: ఎడిటోరియల్ 0866–2573822**
**మేనేజర్: 040–27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# భారత్ - చైనా

**భా**రత్, చైనాల మధ్య అభివృద్ధిలో పోలికలు ఈనాటివి కావు. రెండు దేశాలూ రెండేళ్ల తేడాతో విముక్తి పొందడం, జనాభాలో, ఆర్థికాభివృద్ధిలో దాదాపు ఒకే విధంగా ఉండడం వల్ల ఈ పోలికలు నాటి నుండి నేటివరకు కొనసాగుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్య పూర్వం చైనా భారత కన్నా వెనుకబడి ఉండేది. సోషలిస్టు నిర్మాణం తరువాత, 1980 దశకంలోనూ చైనా అప్రతిహత అభివృద్ధి సాధించడంతో భారత్‌ను అధిగమించి ముందుకు పోయింది. గత 20 ఏళ్లకు పైగా రెండంకెల అభివృద్ధితో నడుస్తున్న చైనా వేగం మందగించిందనీ, భారత్ వచ్చే ఏడాది అభివృద్ధిలో దాన్ని భారత్ అధిగమిస్తుందనీ ఆర్థిక పండితులు, సంస్థలు చెబుతున్నాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికంలోనే అధిగమించిందని కూడా కొన్ని లెక్కలు చెబుతున్నాయి. దాంతో భారత్‌లో నయా–ఉదారవాద ఆర్థిక పండితులు ఇదంతా మోడీ ప్రభుత్వ ఆర్థిక సంస్కరణల ఘనత అని ప్రచారం చేస్తున్నారు.

అభివృద్ధి లెక్కలతో వచ్చిన చిక్కేమంటే ఆర్థికాభివృద్ధికీ– మానవాభివృద్ధికీ– మానవుడు సంతోషంగా జీవించడానికీ సంబంధంలేకుండా ఉంటుంది. ఆర్థికాన్ని రాజకీయాలు శాసిస్తున్నాయా, రాజకీయాలను ఆర్థికం శాసిస్తున్నదా అనేది ఆర్థికాభివృద్ధి ఫలాలు ఎవరికి అందుతాయో చెప్పడానికి కీలకం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థికాంశాలు రాజకీయాలను శాసిస్తాయి. మన దేశంలో స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు ఇక్కడ రాజకీయాలను శాసిస్తున్నాయి. మన్మోహన్ అధికారంలో ఉండాలన్నా, ఆయన దిగి మోడీ రావాలన్నా అంతా వారనుసరించే ఆర్థిక విధానాలమీద ఆధారపడి ఉంటుంది. కార్పొరేట్‌లకు ఊడిగం చేయకపోతే మోడీ కూడా గద్దె మీద నిలవలేడు.

సోషలిజంలో ఆర్థికాన్ని రాజకీయాలు శాసిస్తాయి. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా సోషలిస్టు ఆర్థిక విధానాలు నడుస్తాయి. సోషలిస్టు చైనాలో ఉన్నది ప్రజా ప్రభుత్వం. ఆర్థిక సంస్కరణలు అమలు పరచాలన్నా, వద్దనుకున్నా, ఆర్థికాభివృద్ధిని వేగంగా పరుగుతీయించాలన్నా, బ్రేకులు వేయాలనుకున్నా అంతటినీ ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం నడిపిస్తుంది. గత రెండున్నర దశాబ్దాలుగా రెండంకెల స్థాయిలో శరవేగంగా పరుగెత్తించిన ఆర్థికాభివృద్ధికి కాస్తా బ్రేకులు వేయాలనుకుంది చైనా ప్రభుత్వం. శీఘ్ర ఆర్థికాభివృద్ధి సంపదను పెంచుతుందేగాని ప్రజలకు పంచదు. పెరిగే సంపదను సామాన్య ప్రజలకు పంచే బాధ్యతను ప్రభుత్వాలు చేపట్టాలి. చైనా ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని చేపట్టింది గనుకనే ఆర్థికాభివృద్ధిని తగ్గించదలుచుకుంది. ఆర్థికాభివృద్ధిని 7 శాతం వద్ద ఉంచాలనీ, ప్రస్తుత పంచవర్ష ప్రణాళికలో దేశ ప్రజల ఆదాయాలను మూడు రెట్లు పెంచాలనీ కమ్యూనిస్టు ప్రభుత్వం నిర్ణయించింది. దానికనుగుణంగానే అది చర్యలు తీసుకుంటోంది. అందువల్ల చైనాలో ఆర్థికాభివృద్ధి ప్రస్తుతం 7 శాతం దగ్గర ఉండడం అనేది ఆ ప్రభుత్వం తీసుకున్న ప్రణాళికా బద్ధమైన చర్యల్లో ఒకటి. దాన్నీ, భారత దేశంలోని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థనూ పోలిక పెట్టి ప్రచారం చేయడం, ఇదంతా మోడీ ప్రభుత్వ ప్రతాపమేనని చెప్పడం ప్రజలను మోసం చేయడానికే. ఇక్కడ ఆర్థికాభివృద్ధి 7 శాతం కాదుగదా 10 శాతం పెరిగినా పేదల బతుకుల్లో మార్పురాదు. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి ఫలాలన్నీ కొద్దిమంది శతకోటీశ్వరులైన పెట్టుబడిదారుల వద్ద కేంద్రీకృతమవుతాయి. అందుకే మన దేశం ఒకవైపు ఆర్థికాభివృద్ధిలో ఉరకలు పెడుతుంటే, మరోవైపు అన్నార్తుల ఆకలి కేకలూ పెరుగుతున్నాయి. అందువల్ల మోడీలూ, చంద్రబాబులూ చెబుతున్న జిడిపి సంఖ్యలు సామాన్య ప్రజలకు ఎండమావుల్లాంటివే.


**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**


పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్** (ప్రజాశక్తి కార్యాలయం),
**అజామాబాద్, హైదరాబాద్- 20**

ఈ మాసం ముఖ్యాంశం

# ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతి కోసం ఉద్యమించాలి



రచయిత సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

**వి. శ్రీనివాసరావు**

కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య గారి శత జయంతి సందర్భంగా ఈరోజు సాంస్కృతిక, సామాజిక ఉద్యమాల గురించి మాట్లాడమని కోరారు. ఇంతకుముందు భాషా వికాసం గురించి మాట్లాడిన కొత్తపల్లి రవిబాబుగారు నాకో కరపత్రం ఇచ్చారు. మాతృభాష ప్రాధాన్యత గురించి ఛాయారాజ్‌గారు రాసిన మంచి కవిత్వం దానిలో ఉంది. అందులోని చివరి చరణాలు.

"అమ్మా నీ భాష కావాలి.
నిప్పులు చెరగటానికి..
చెమటను జల్లెడ పట్టి సంపదలను తీయడానికి..
తెలుగు పౌరుషాగ్నిని రాజేయడానికి..
మాతృభాష కావాలి.."

అలాంటి తెలుగు పౌరుషాగ్నిని రాజేయడంలో దిట్ట కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య. ఎక్కడకు వెళ్లి ఏ అంశం మీద మాట్లాడినా ప్రజలను ఉగ్రూతలూగించి, నిప్పులు కురిపించి, వారిని కదన రంగానికి కదిలించడంలో వీర సారథిలా పనిచేసేవారు బసవపున్నయ్య. ఆరోజుల్లో ఆయన ఉపన్యాసాలంటే చెవులు కోసుకునేవారు. ఒకసారి ఆయన ప్రసంగం విన్న తరువాత 'పోరాటంలో దుమికి తాడో పేడో తేల్చుకుందాం. ఈ దోపిడీ సమాజాన్ని తుత్తునియలు చేసేదాకా వదలకూడదు' అన్నంత పట్టుదల ఆయన ఉపన్యాసాలద్వారా కలిగేది. అదే భాషా పటుత్వమంటే. ఏ సామాజిక, సాంస్కృతిక ఉద్యమానికైనా ఓ లక్ష్యం ఉంటుంది. అది వ్యక్తి వికాసానికీ, సామాజిక వికాసానికీ తోడ్పడాలి. ఇక్కడో చర్చ నడుస్తోంది. వ్యక్తి వికాసం అంటే ఏమిటీ, సామాజిక వికాసం అంటే ఏమిటీ అని? 'వ్యక్తులు మారితే సమాజం మారుతుంది. ముందు నువ్వు మారు' అని చాలామంది చెబుతుంటారు. ఇంకొంతమంది 'సమాజం మారేదాకా వ్యక్తి మార్పును చూడలేము' అంటారు. వాస్తవం ఈ రెండింటి మధ్యా ఉంది. రెండూ పరస్పర సంబంధమూ, అనుబంధమూ కలిగినవి. వ్యక్తి దేనికి మారాలి? సమాజాన్ని మార్చడానికి మారాలి. సమాజ చోదకుడుగా మారాలి. ఆ వ్యక్తి తనను తాను మార్చుకొని సమాజాన్ని మార్చడానికి ఉద్యుక్తుడయితే మొత్తం సమాజం మారుతుంది. సమాజం మారితే సమాజంలోని వ్యక్తులూ మారతారు. అలా చౌరవ చేసేవారూ, నడుంకట్టేవారూ ముందు తమను తాము తీర్చిదిద్దుకోవాలి.

బసవపున్నయ్య, సుందరయ్య, రాజేశ్వరరావుగారలు ఎవరయినా ముందు తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకొని ఆ విధంగా సమాజాన్ని ప్రభావితం చేసి, ప్రజల్లో తిరుగుబాటు భావాలను రగిల్చి, అనేక ఉద్యమాలకు నాంది పలికారు. ఆ ప్రభావం సమాజంపై పడి అనేక మంది మారారు. ఈ రకమైన పరస్పర సంబంధం వ్యక్తి వికాసానికీ సామాజిక వికాసానికీ మధ్య ఉంది. నేడు సమాజంలో లంచగొండితనం ఉంది. ఈ వ్యవస్థలో ఒక భాగం అయ్యింది. సమాజం మారకుండా లంచగొండితనం పోదని కొందరి అభిప్రాయం. ఎవరు లంచమిచ్చినా, తీసుకున్నా చూస్తుండాలి. సమాజం మారిందాకా మనమేం చేయలేం అనుకుంటే మనకు తెలియకుండానే మనలో నిష్క్రియాపరత్వం ఏర్పడుతుంది. లంచగొండితనంతో సమాజం బాధపడుతున్నా మనకేం సంబంధం లేదు. లేదా వ్యక్తి మారాలంటే లంచం ఇచ్చేవారినీ, తీసుకునేవారినీ నిర్మూలించాలని ఒక తహశీలుదారు ఆఫీసు గుమాస్తానో, గేటు దగ్గర ఉండే అటెండరో వదో వరకో తీసుకుంటేనో లేదా బస్సు కండెక్టరు చిల్లర ఇవ్వలేదనో అవినీతిపై పోరాడే పేరుతో వారిమీద తిరుగుబాటు చేస్తే అది గందరగోళమూ, అరాచకమూ అవుతుంది. అలా అని భూరికార్డులు తారుమారు చేసే అధికారులను చూస్తూ వదిలేయలేం. మరి ఈ రెంటికీ మధ్యన ఏమిటి? గుడినీ, గుడిలో లింగాన్నీ, దేశాన్నీ మింగేస్తున్న అవినీతిపరులపైనా, ప్రజల సంపదను మెక్కేస్తున్నవారిపైనా పోరాడాలి. అదే సందర్భంలో అవినీతికి మూలమైన వ్యవస్థనూ మార్చడానికి కృషి చేయాలి. వ్యక్తికీ సమాజానికీ మధ్య సంబంధం లాంటిదే ఇది కూడా. అలా అయినప్పుడే మొత్తం సాంస్కృతిక, సామాజికోద్యమాలు, వ్యక్తి వికాసం ముందుకుపోతాయి.

సంస్కృతి అనేది ప్రజల మధ్య భావ సమైక్యతను సృష్టిస్తుంది. అది భావాల్లోనూ, భాషలోను, ఆచార, సంప్రదాయాల్లోనూ కనిపిస్తుంది. పండుగలు, ఉత్సవాలు, పెండ్లిండ్లు, శవసంస్కారాలు-ఇలా సందర్భం ఏదైనా ప్రజలు ఒక వర్గంగానో, తరగతిగానో, జాతిగానో, తెగగానో భాగస్వాములవుతారు. ఇది ఒక ఉమ్మడి తత్వాన్ని తీసుకొస్తుంది. వివిధ చారిత్రక దశల్లో ఈ సంస్కృతి విభిన్నంగా పనిచేస్తుంది. అది నిరంతరం చలనంలో ఉంటుంది. మారుతుంటుంది. సంపర్కం చెందుతుంది. ప్రగతిశీలంగా ఉంటుంది. ప్రగతి నిరోధకంగానూ ఉంటుంది. నేడు మంచిగా ఉన్నదే రేపు చెడుగా మారుతుంది. చారిత్రక, తార్కిక దృష్టితో ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలి. మన సౌలభ్యం కోసం నేను వీటిని మూడు భాగాలుగా చెప్పదలుచుకున్నాను. ఒకటి : స్వాతంత్ర్యోద్యమ ప్రభావం. రెండోది : కమ్యూనిస్టుల ప్రభావం. మూడోది : ఈనాటి ప్రపంచీకరణ ప్రభావం.

ప్రజలమీదా, సమాజం మీద ప్రగాఢముద్ర వేసిన ప్రభావాలివి.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో చాలా ఉద్యమాలు నడిచాయి. బ్రిటీష్‌వారు దేశం నుంచి వెళ్లిపోవాలి, స్వతంత్రం కావాలీ అన్నది ప్రధానమైన అంశమే అయినా ప్రజలను కదిలించడానికీ, ప్రభావితం చేయడానికీ కాంగ్రెస్, కమ్యూనిస్టుల నాయకత్వంలో కావచ్చు, గాంధీ ప్రభావంతో కావచ్చు చాలా ఉద్యమాలు కొనసాగాయి. ప్రత్యేకించి అంటరానితనానికి వ్యతిరేకంగానూ నడిచాయి. దళితులనూ, మైనారిటీలను, ఇతర వెనుకబడిన తరగతులనూ భాగస్వాములను చేయడానికి ఉద్యమాలు నడిచాయి. మహిళల అక్షరాస్యత కోసమూ, మద్యపానానికి వ్యతిరేకంగానూ ఉద్యమాలు నడిచాయి. శ్రమదాన, సేవా కార్యక్రమాల కోసం ఉద్యమాలు నడిచాయి. కలరా వంటి అంటు వ్యాధులు వచ్చినప్పుడు వాటిని నిర్మూలించడానికి కార్యకర్తలే నేరుగా రంగంలో దిగేవారు. అందరూ భయపడి పారిపోయి ఊళ్ల నుంచే వారిని వెలివేసే పరిస్థితుల్లో వారి దగ్గరకు పోయి సేవ చేశారు. ఆఖరికి కుష్టు వ్యాధిగ్రస్తులను సైతం చేరదీసి మనుషులందరూ ఒకటే అనే నిరూపించడానికి ప్రయత్నించారు. ఇలాంటి అనేక ఉద్యమాలు స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రభావితం చేశాయి. వాటిని చూసి ప్రభావితమైన అనేకమంది స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములయ్యారు..

స్వాతంత్ర్యోద్యమంలో ఖద్దరు ధరించడమే పెద్ద ఉద్యమంగా సాగింది . ఇది బ్రిటీషువారికి ప్రతిఘటన. ఖద్దరు వేసుకొని కాలేజీకి వెళ్లారంటే ప్రత్యక్షంగా తిరుగుబాటు జెండా ఎగురవేసినట్లే. ప్రిన్సిపాల్ వెంటనే ఆ విద్యార్థిని పిలిపించి కళాశాల నుంచి సస్పెండ్ చేసేవారు. అప్పుడు ఖద్దరు చొక్కా ధరించడమే తిరుగుబాటుకూ, ప్రతిఘటనకూ చిహ్నంగా మారింది. ఇది సామాజిక సాంస్కృతికోద్యమ ప్రభావమే. గాంధీ ఉప్పు మీద పన్ను వేసినందుకు సత్యాగ్రహం నడిపారు. ఉప్పు మీద పన్ను ఇప్పుడూ మనం కడుతూనే ఉన్నాం. పన్నుల మీద పన్నులు పెంచేస్తున్నారు. నిన్న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సర్వీసు టాక్స్ 14 శాతం పెంచారు. చివరికి శిరోముండనం చేయించుకోవాలన్నా టాక్స్ కట్టాల్సిందే. తిరుపతి వెళ్లి క్యూలో నుంచున్నా సర్వీసు టాక్స్ కట్టాల్సిందే. కాని ఆ రోజుల్లో ఉప్పు మీద పన్ను వేస్తే ప్రజలను కదిలించగలిగారు. దండి సత్యాగ్రహంలో మనుషుల తలలు పగులగొడుతున్నా ఖద్దరు ధరించి, సంచి

❝ ఆ రోజు అతి పెద్ద ఉద్యమం, కమ్యూనిస్టులు శాసించిన ఉద్యమం సామాజికోద్యమం. తెలుగువాళ్లంతా ఒకటిగా ఉండాలని, జాతినీ భాషనూ ఏకం చేసి విశాలాంధ్రలో ప్రజారాజ్యం కోసం పోరాడాలనే నినాదానికి అక్షర రూపం ఇచ్చి, మద్రాసు రాష్ట్రంలో ఉన్నా, నైజాంలో ఉన్నా ఎక్కడున్నా తెలుగువాళ్లు ఒకటి కావాలనే ఉద్యమానికి శ్రీకారం చుట్టి దాన్ని సాధించిన ఘనత కమ్యూనిస్టు పార్టీది. ❞

తగిలించుకొని ముందుకు పోయారు. ఇదొక ఉద్యమ సంస్కృతి. ప్రతి ఒక్కరినీ కదిలించి తిరుగుబాటుకు పురికొల్పిన సంస్కృతి ఆరోజు సాతంత్ర్యోద్యమంలో అంతర్భాగంగా నడిచింది.


అంటరానితనానికి వ్యతిరేకంగా కూడా గాంధీ, అంబేద్కర్ ఉద్యమాలు నడిపారు. కమ్యూనిస్టులు దానిలో అగ్రభాగాన ఉన్నారు. కమ్యూనిస్టులంటే మాలమాదిగల పార్టీ అనేవారు. సున్నితంగా చెప్పేవారయితే లేబరోళ్లనీ, లేబర్‌పార్టీ అనీ అనేవారు. అగ్రకులాల నుంచీ, ధనిక రైతు కుటుంబాలను నుంచీ వచ్చినవారు కూడా బసవపున్నయ్య, సుందరయ్య వంటి నాయకులతో కలిసి దళితవాడల్లో పడుకొని వారు పెట్టింది తిని, వారిని కదిలించడానికి చేసిన కృషి అసమాన్యం. ఈ మధ్య స్వచ్ఛ భారత్ కార్యక్రమం చూస్తున్నాం. ఈ రోజు బడ్జెట్‌లో స్వచ్ఛ భారత్ తాము సాధించిన ఘనవిజయాల్లో గొప్పదని అరుణ్‌జైట్లీ చెప్పాడు. ఏమిటీ స్వచ్ఛ భారత్ అంటే? వీధుల్లోకి వెళ్లి చీపురు పట్టుకొని ఒక ఫొటో దిగడంతో స్వచ్ఛ భారత్ అయిపోతుంది. ఆ రోజుల్లో చూసుకోవడానికి ఏ ఫొటోలూ లేవు. అంటరానితనమే అతి పెద్ద సాంఘిక దురాచారం. అంటరానితనాన్ని నిర్మూలించకుండా, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడకుండా స్వచ్ఛ భారత్‌కు అర్థమేమిటి? నీ తోటివాడినే అంటరానివాడిగా చూస్తుంటే, వీధుల్లో నడవనివ్వకుండా, నీళ్లు తాగనివ్వకుండా చేస్తుంటే దాన్ని పట్టించుకోకుండా నేను వీధులను శుభ్రం చేస్తాను, మరుగుదొడ్లు కడతాను అంటున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు అశుద్ధం ఎత్తివేయడానికి కూడా సిద్ధపడ్డారు. సాంస్కృతిక సామాజికోద్యమాలకు స్వాతంత్ర్యోద్యమం ఒక నమూనాగా నిలబడింది. అయితే స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్ అనుసరించిన రాజీ పద్ధతులు యువతరాన్ని స్ఫూర్తివంతంగా, ఉత్సాహంగా కదిలించలేకపోయాయి. భగత్‌సింగ్ వంటివారిని ఉరితీస్తున్నా మాట్లాడలేకపోవడం వంటి అనేక అంశాలు యువతరాన్ని ప్రభావితం చేశాయి. ఇది మార్గం కాదు, కమ్యూనిస్టు పార్టీ అయితేనే సమాజం మారుతుంది. కొత్త మార్గాన్ని ఎంచుకోవాలని అనేకమంది కాంగ్రెస్‌ను వదిలేసి కమ్యూనిస్టుపార్టీలో చేరిపోయారు.

1940, 50, 60ల్లో మూడు దశాబ్దాలపాటు తెలుగు రాష్ట్రాలను అత్యంత ప్రభావితం చేసింది కమ్యూనిస్టు ఉద్యమం. వారు చెప్పిన భాషా వికాసం, జాతి వికాసం, సామాజిక న్యాయం, సామాజిక వికాసం. ఒక అంశం కాదు. అన్ని అంశాల్లోనూ కమ్యూనిస్టు పార్టీ ప్రభావం చూపింది. 1950 నాటి సినిమాలు చూడండి. అది ప్రేమ, క్రైం, పౌరాణిక సినిమా ఏదైనా కావచ్చు. అందులో ఒక అభ్యుదయ గీతం లేకుండా, అందులో కుల మతతత్వాలను చీల్చి చెండాడకుండా, అందులో అవినీతినీ, అన్యాయాలనూ, అక్రమాలనూ ప్రశ్నించకుండా ఏ సినిమా ఉండదు. అటువంటి ప్రభావం రచయితలమీదా, నిర్మాతల మీద ఉంది. ఈ మాటలు ఇలా చెబితేనే ప్రజలు స్వీకరిస్తారనే అంతటి తీవ్రమైన ప్రభావం ఉండేది. ప్రజానాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘం, ఆరోజు ప్రతిఒక్కరూ, కమ్యూనిస్టులనే కాదు భావావేశం ఉన్న ప్రతి ఒక్కరూ అభ్యుదయ ఉద్యమాల వైపు చూశారు. ఆ రోజు అతి పెద్ద ఉద్యమం, కమ్యూనిస్టులు శాసించిన ఉద్యమం సామాజికోద్యమం. తెలుగువాళ్లంతా ఒకటిగా ఉండాలని, జాతినీ భాషనూ ఏకం చేసి విశాలాంధ్రలో ప్రజారాజ్యం కోసం పోరాడాలనే నినాదానికి అక్షర రూపం ఇచ్చి, మద్రాసు రాష్ట్రంలో ఉన్నా, నైజాంలో ఉన్నా ఎక్కడున్నా తెలుగువాళ్లు ఒకటి కావాలని ఉద్యమానికి శ్రీకారం చుట్టి దాన్ని సాధించిన ఘనత కమ్యూనిస్టు పార్టీది. మిగతా అన్ని పార్టీలూ ఉండొచ్చు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారు. కొంతమంది కాంగ్రెస్‌వారు

**"చదువుకొని ఊళ్లేలతారా? ఎందుకు బడికి పంపడం? అనుకునే రోజుల్లో చొరవ చేసి, పిల్లలను చదివించడానికి రాత్రిబడులు పెట్టి, లాంతర్ల కింద చదువు చెప్పిన ఘనత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలది. మహిళలకు చదువేంట నుకునేకునే రోజుల్లో చదువుకు ప్రోత్సహించి, వారిని విద్యా లయాలకు పంపిన ఘనత కమ్యూనిస్టు పార్టీది."**

కూడా పాల్గొన్నారు. కానీ దానికి ఊపిరిపోసి నడిపించింది మాత్రం కమ్యూనిస్టు పార్టీయే. అంతకుముందు ఎప్పట్నించో తెలుగువారు చీలిపోయారనే భావన ఉంది. అప్పటికే తెలుగు భాషా వికాసానికి తోడ్పడినవారున్నారు. ఛాంతసత్వంపై ఎదురుదాడి చేసినవారున్నారు. కాని వారి కృషంతా వ్యక్తులకు సంబంధించినదిగానే మిగిలిపోయింది. దానికి ఉద్యమ రూపం ఇచ్చినవారు లేరు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఉద్యమం మొత్తం దేశ భౌతిక స్వరూపాన్నే మార్చేసింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఎవరి భాషలో వారు చదువుకోవచ్చు. ఎవరి భాషలో వారు మాట్లాడుకోవచ్చు. ఎవరి భాషలో వారు చట్టాలు చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రం ఏర్పడక ముందు ఢిల్లీ వెళితే అక్కడ తెలుగువారిని మదరాసీలనేవారు. తెలుగువారికి ఒక అస్తిత్వం కల్పించింది కమ్యూనిస్టు పార్టీ. ఇది అతి పెద్ద సామాజిక ఉద్యమం.

సామాజికోద్యమాల్లో ముందుకొచ్చిన రెండో అతి పెద్ద ఉద్యమం దళితవాదం. 1980లో ఇది ఒక వాదం కింద పుట్టుకొచ్చింది. దళితులు మొత్తం ఒక ప్రజాస్వామ్య స్రవంతిలో 1940, 50ల్లో ఒక భాగంగా ఉన్నారు. దళితులంటే కమ్యూనిస్టులూ, కమ్యూనిస్టులంటే దళితులూ అన్న పద్ధతిలో ఆనాడు కలిసిపోయారు. వారికోసం కమ్యూనిస్టులు తప్ప మరెవరూ కృషి చేయలేదు. ఇది కమ్యూనిస్టు కార్యకర్తలకు ఒక గుర్తింపునిచ్చింది. అమెరికాలో, బ్రిటన్‌లో, రష్యాలో ఏం జరుగుతోందీ అన్నది, ప్రపంచంలోని విషయాలన్నీ కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు మాట్లాడేవారు అని ఊళ్లలోకి పోతే పెద్దవాళ్లు చెప్పేవారు. అసలు వీళ్లకీ జ్ఞానం ఎక్కణ్నుంచి వచ్చింది అనే ప్రశ్న వచ్చింది. కమ్యూనిస్టులు కాబట్టే వచ్చింది. కమ్యూనిస్టులం అయితే మనం వికాసవంతులమవుతాం. ప్రశ్నించగలుగుతాం అనే భావాలు



విస్తరించాయి. మామూలు వ్యవసాయ కూలి అమెరికా గురించో, రష్యా గురించో, రెండో ప్రపంచ యుద్ధం గురించో, సామ్రాజ్యవాదం గురించో మాట్లాడుతుంటే, వీళ్లకు ఇన్ని విషయాలెలా తెలుసు అని ఆ ఊళ్లో తలనెరిసిన మోతుబరి రైతులు నోళ్లు వెళ్లబెట్టుకొని వింటుండేవారు. అంటే విజ్ఞానంలో ఒక మామూలు మనిషిని, ఒక మట్టి మనిషి, రాతి మనిషినుకున్నవాణ్ణి కమ్యూనిస్టు పార్టీ ఒక చైతన్యవంతమైన ఆయుధం కింద మలిచింది. ఇదేం చిన్న విషయం కాదు. ఈ మధ్య విజ్ఞాన్ రత్తయ్యగారు రాసిన ఓ పుస్తకం చదివాను. మిగతా విషయలెలా ఉన్నా ఒక విషయం మాత్రం ఆయన స్పష్టంగా రాశారు. తెలుగునాట విద్యాభివృద్ధికి మొట్టమొదట పునాది వేసింది కమ్యూనిస్టులు అని. అది వాస్తవం. ఊళ్లో చదువు అనేది ఒక హక్కుగా ఉండేది. ఎందుకురా మట్టి పిసుక్కునేవాడికి చదువు? చదువుకొని ఊళ్లేలతారా? ఎందుకు బడికి పంపడం? అనుకునే రోజుల్లో చొరవ చేసి, పిల్లలను చదివించడానికి రాత్రిబడులు పెట్టి, లాంతర్ల కింద చదువు చెప్పిన ఘనత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలది. మహిళలకు చదువేంటనుకునేకునే రోజుల్లో చదువుకు ప్రోత్సహించి, వారిని విద్యాలయాలకు పంపిన ఘనత కమ్యూనిస్టు పార్టీది. కమ్యూనిస్టుపార్టీ మహిళలను వీధుల్లోకి తీసుకొచ్చి పోరాటాల్లో భాగస్వాములను చేసింది. మోటూరు ఉదయం గారి నాయకత్వంలో ఒక బుర్రకథ దళం ఏర్పడింది. బహిరంగ ప్రదర్శనలివ్వడంపై భూస్వాములు అసహ్యంగా మాట్లాడేవారు. దాన్నెదుర్కొనే ధైర్యాన్నీ, తెగువనూ మహిళల్లో కల్పించింది కమ్యూనిస్టు పార్టీ. అందుకని భాషా వికాసంలో, జాతీయ వికాసంలో, సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటాల్లో కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన ఉంది. రెండున్నర దశాబ్దాల పాటు తెలుగు ప్రజల చరిత్రను అత్యంత తీవ్రంగా ప్రభావితం చేసింది. అధికారంలోకి రాకపోవచ్చు. మామూలుగా అయితే భావాల గురించి చెప్పుకున్నప్పుడు ఎవరయితే అధికారంలో ఉంటారో వారి భావాలే ప్రజలందరినీ ప్రభావితం చేస్తాయని చెప్పుకుంటాం. స్థూలంగా అది సరైనది. కానీ అధికారంలో లేకుండానే కమ్యూనిస్టు పార్టీ తన భావాలతో ప్రజలందరినీ ప్రభావితం చేసింది. కాంగ్రెస్ వాళ్లు భూస్వామ్య వ్యవస్థను బలపరిస్తే, ఆ వ్యవస్థకు, దాని కుళ్లు సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులే.

ఈ రోజు రాజకీయ సంస్కృతి గురించి చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ వారు ఎలా ఉంటారు. ఓ రాజకీయ నాయకుడు ఎలా ఉంటాడు. ఖరీదైన ఖద్దరు ధరించాలి. లెదర్ చెప్పులేసుకోవాలి. ఆధునికమైన కారు, హంగూఆర్భాటం, మందీ మార్బలం, గన్‌మెన్‌లు...అదో ప్రత్యేకమైన స్టయిల్ లేదా బ్రాండ్. ఒక రాజకీయ నాయకుడు అంటే ఇలా ఉంటాడనే భావన ఉంది. అలా ఉంటేనే రాజకీయ నాయకుడి కింద లెక్క. కానీ మామూలుగా నిరాడంబరంగా ఉండి, చేతిలో సంచి పట్టుకుని, అందులో ఓ పేపరు పెట్టుకొని, ఎక్కడబడితే అక్కడ పేపరు పరుచుకొని పడుకోవడం వంటి ఒక నూతన రాజకీయ సంస్కృతిని 1950లో కమ్యూనిస్టుపార్టీ ప్రవేశపెట్టింది. దాని ప్రభావం కూడా ఇతర పార్టీల మీద ఉంది. కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉన్నచోట్ల ఆ ప్రభావం కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉంది. కేరళలో కాంగ్రెస్ వాళ్లు కూడా కమ్యూనిస్టులు మాట్లాడే భాష మాట్లాడేవాళ్లు. కమ్యూనిస్టుల్లాగానే మేమూ ఉన్నాం అని చెప్పుకోవడానికీ, పోటీ పడటానికీ

ప్రయత్నిస్తుండేవాళ్లు. ఇతర పార్టీలను కూడా ప్రభావితం చేయగలిగింది కమ్యూనిస్టు జీవన విధానం. అది నీతి, నిజాయితీ, నిరాడంబరత్వంతో కూడిన జీవన విధానం.

అలాగే సంస్కరణోద్యమాలు కూడా. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు ఆ రోజు బాల్య వివాహాలను వ్యతిరేకించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడం వంటి ఉద్యమాలు నడిపారు. వాటి ప్రభావం ప్రజల్లో ఒక భాగానికే పరిమితమయింది. దాన్ని సాధారణ ప్రజల్లోకి తెచ్చింది కమ్యూనిస్టుపార్టీ. వివాహ పద్ధతిలోనే ఒక ప్రత్యామ్నాయాన్ని చూపింది. అదర్శ వివాహం అంటే అది కమ్యూనిస్టు పార్టీ పెళ్లి అనీ, మీటింగుల పెళ్లనీ, దండలు మార్చుకుంటే పెళ్లయిపోయినట్లేననీ అనేవారు. ఇప్పుడంటే రిజిస్ట్రేషన్లు కావాలి. అప్పుడు రిజిస్ట్రేషన్లు అవసరం లేదు. దండలు మార్చుకుంటే పెళ్లియిపోయినట్లే అనే సాదాసీదా పద్ధతిలో ఖర్చు లేకుండా వివాహం జరిపించేవారు. ఆడపిల్లల పెళ్లంటే సగం ఆస్తి అమ్ముకోవాలనేటువంటి రోజుల్లో పెళ్ళంటే చాలా సులభంగా చేసే ప్రక్రియగా మార్చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, అభ్యుదయవాదులు కూడా హంగూఆర్భాటం లేని వివాహ వేడుకల్ని ప్రోత్సహించారు. కమ్యూనిస్టుపార్టీ ఆ రోజు నుంచి ఈ రోజుదాకా ఒక ప్రత్యామ్నాయ వివాహ పద్ధతిని ప్రోత్సహిస్తున్నది. తన సొంత కుటుంబంలో కమ్యూనిస్టులు విభిన్నంగా వ్యవహరిస్తారు. ఒకళ్లకొకళ్లు తోడ్పడటం అందరూ చేయకపోవచ్చు. కానీ ఆ సంస్కృతిని మాత్రం ప్రవేశపెట్టింది కమ్యూనిస్టు పార్టీయే. వంటలో సహాయపడటం, పిల్లల పెంపకంలో సహాయం చేయడం వంటివి. వారిని ఎడ్యుకేట్ చేయడానికీ, వారు కూడా జెండా పట్టుకొని ఉద్యమాల్లోకి రావడానికీ, కుటుంబం కుటుంబాన్నే పిల్లలతోసహా వీధుల్లోకి తీసుకురావడానికీ తోడ్పడింది. బహుశా ఆనాడున్న ఫ్యూడల్ విశ్వాసాలు కూడా దీనికి దోహదపడి ఉండొచ్చు. అన్నిటికన్నా మించి స్వాతంత్ర్యోద్యమం తరువాత అధికారంలోకి వచ్చి పదవీలాలస పెరిగిన రోజుల్లో సమాజం కోసం త్యాగం చేయాలి. ఈ ఆస్తులూ ఆదాయాలూ, సంపదా ఇవి కాదు. ఉద్యమమే ప్రధానం అని ఎవరికి వారు తెగించి ఇంట్లో ఉన్న తల్లులు, అక్కలు, అమ్మలు వాళ్లందరూ ఉమ్మడిగా అనుకొని సుందరయ్యను చూసో, ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ను చూసో స్ఫూర్తి తెచ్చుకొని ఉద్యమాల కోసం త్యాగం

**“ వివాహ పద్ధతిలోనే ఒక ప్రత్యామ్నాయాన్ని చూపింది. అదర్శ వివాహం అంటే అది కమ్యూనిస్టు పార్టీ పెళ్లి అనీ, మీటింగుల పెళ్లనీ, దండలు మార్చుకుంటే పెళ్లయిపోయినట్లేననీ అనేవారు. ఇప్పుడంటే రిజిస్ట్రేషన్లు కావాలి. అప్పుడు రిజిస్ట్రేషన్లు అవసరం లేదు. దండలు మార్చుకుంటే పెళ్లియిపోయినట్లే అనే సాదాసీదా పద్ధతిలో ఖర్చు లేకుండా వివాహం జరిపించేవారు. ”**

చేయడం ఒక సంస్కృతిగా మారింది. ఆ రకమైన ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతిని సృష్టించడంలో 1950లలోనే కమ్యూనిస్టు పార్టీ చరిత్ర సృష్టించింది.

దాని తరువాత మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా. ప్రజలకు హానిచేసే కొన్ని సంప్రదాయాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడమూ, కేవలం శాస్త్రీయంగా ప్రచారం చేయడమే కాదు. శాస్త్రబద్ధంగా ఆలోచించడమూ, జీవించడమూ అనే విధానానికి నాంది పలికింది కమ్యూనిస్టుపార్టీ. మూఢనమ్మకాలకు వ్యతిరేకమంటే ప్రజలకు హానిచేసేవాటికి వ్యతిరేకం. ముఖ్యంగా మూఢనమ్మకాలకు బలయ్యింది సామాన్య పేద ప్రజలు, దళితులు, గిరిజనులు, మహిళలే. వీరే ఎక్కువ భాగం నష్టపోయారు. వాటిని ప్రశ్నించి నిరోధించేందుకు కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది. మానవ పరిణామం నుంచి అనేక శాస్త్రీయ గ్రంథాల వరకూ ప్రచురించి ప్రచారంలో పెట్టేందుకు కృషి చేసింది. సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు పెద్దఎత్తున చేపట్టబడ్డాయి. తద్వారా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా యువతరాన్ని ఆకర్షించింది. ఒక శక్తిగా ముందుకొచ్చింది.

సమాజంలో ఫ్యూడలిజం బలంగా ఉన్న రోజుల్లో కూడా (కమ్యూనిటీ) ఉమ్మడితత్వం ఉండేది. 1950-60 కాలాల్లో పెళ్లి జరుగుతోందనుకోండి. పెళ్లి పందిళ్లు వేయడం, వంటలు చేయడం, ఇల్లిల్లూ తిరిగి పాలూ పెరుగూ తేవడం, ఒక విధంగా ఒకరింట్లో పెళ్లి అంటే ఊరు మొత్తం పెళ్లిలాగుండేది. ఎవరింట పెళ్లి జరిగినా ఇతర కులాల వాళ్లూ వెళ్లేవాళ్లు. కమ్యూనిస్టులు బలంగా ఉన్న గ్రామాల్లో సహపంక్తి భోజనాలు సాగేవి. భూస్వాములు బలంగా ఉన్న చోట దళితులకు విడిగా పెట్టేవారు. భోజనాల వడ్డింపులో అవమానాలు ఎదురయ్యేవి. అందుకే కమ్యూనిస్టులు విభిన్నంగా కనిపించేవారు.

1960-70ల తరువాత కమ్యూనిస్టు ఉద్యమం బలహీన పడ్డాక సాంస్కృతిక, సామాజికోద్యమాల రూపురేఖల్లో మార్పులు వచ్చాయి. అక్కణ్నుంచి సాహిత్యంలో మూఢ నమ్మకాలకు పెద్దపీట వేయడం ప్రారంభమైంది. అభ్యుదయకరపాత్ర పోషించిన సినిమాలు, మీడియా స్వభావమే మారిపోయింది. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన నేపథ్యంలో 1980 నాటికి కొన్ని కొత్త రకాల ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. అందులో దళితవాదం ఒకటి. ఒక ప్రజాస్వామిక స్ఫూర్తితో అది పుట్టుకొచ్చింది. భూస్వాముల ఆధిపత్యాన్ని సవాల్ చేసి దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెడతామనే ఉద్దేశంతో పుట్టుకొచ్చిన ఉద్యమం అది. దాన్ని కమ్యూనిస్టు పార్టీ గుర్తించిందీ, గౌరవించింది. దానికి సంఘీభావమూ తెలిపింది. కానీ దళితవాదం మొత్తం ప్రజాస్వామిక ఉద్యమ స్రవంతి నుంచి వేరుపడి మేం వేరు, మిగతావాళ్లు వేరు, మిగతా సెక్షన్లతోనూ, మిగతా ప్రజలతో కలవం అనే అస్తిత్వవాదం వారిలో పుట్టుకొచ్చింది. అలాగే మహిళల్లో ఫెమినిజం పేరుతో ఒక అస్తిత్వ వాదం ముందుకొచ్చింది. ప్రాంతీయత కూడా ఒక అస్తిత్వవాదం. మా ప్రాంతం వేరు, మేం వేరు అనే వాదం దానిది. మా గురించి మాకు అర్థం అవుతుంది తప్ప ఇతరులు అర్థం చేసుకోలేరు అనేది వివిధరకాల అస్థిత్వవాదాల సారాంశం.

దళితవాదం భూస్వామ్య సంస్కృతితో పోరాడటానికి బదులుగా సమస్య నుండి తప్పించుకునే (ఎస్కేప్) దారులు వెతికింది. గుడిలోకి అందరినీ అనుమతించాలనేదాని కన్నా, నీళ్ల బావిలో తోడుకోడానికి అవకాశం ఇవ్వాలనే దాని కన్నా, ప్రభుత్వాల మద్దతుతో ప్రత్యేకంగా గుడులు కట్టించుకోవడం, బోర్లు వేయించుకోవడం, విడిగా స్కూళ్లు పెట్టించుకోవడం ద్వారా వివక్షను అధిగమించాలన్న ఆలోచనకు వచ్చారు. వ్యవసాయ దోపిడీ నుండి బయటపడటానికి

> **❝ ఇలాంటి స్థితిలో మరలా 2000 సంవత్సరం నుంచి సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకొచ్చి నాయకత్వం వహిస్తున్నది కమ్యూనిస్టు పార్టీయే. ఎక్కడ అన్యాయం, అక్రమాలు జరుగుతున్నా, వివక్ష పాటిస్తున్నా, అక్కడ వాలి తెగబడి పోరాడుతున్నది కమ్యూనిస్టు కార్యకర్తలే. 1980ల్లో వెనకబడినా ఈ సంధి యుగంలో దాన్ని అంది పుచ్చుకొని నూతన అవగాహనతో కమ్యూనిస్టు పార్టీ ముందుకు తీసుకుపోతోంది. ❞**

సుదూర ప్రాంతాలకు వలసలు పోవడం ఆరంభమైంది. ఇలా భూస్వామ్య వ్యవస్థతో పోరాడటానికి బదులుగా దూరంగా పారిపోయే విధానాన్ని అనుసరించింది. అయినా మారిన సామాజిక పరిస్థితులలో దళితుల్లో వస్తున్న ప్రజాస్వామిక భావాలను సహించలేని భూస్వామ్యవర్గాలు దాడులకు తెగబడ్డాయి. కారంచేడు ఘటనతో దళిత ఉద్యమానికి కొత్త అస్థిత్వం వచ్చింది. అయితే ఈ అస్థిత్వవాదాల కారణంగా వర్గ ఐక్యత చెదిరిపోయింది. కమ్యూనిస్టుపార్టీ ప్రవేశపెట్టిన ఉమ్మడి సంస్కృతి దెబ్బతిన్నది. కులాలవారీ సాంస్కృతిక ఐక్యత ఏర్పడింది. అది ఉప కులాలకూ పాకింది. తద్వారా వర్గఐక్యతకు తూట్లు పడ్డాయి.

అస్థిత్వవాదం ప్రారంభకాలంలో ముందుకొచ్చిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని గుర్తించి, దాన్ని అందిపుచ్చుకొని లీడ్ చేయడంలో కమ్యూనిస్టు పార్టీ వెనుకబడిపోయింది. 1980ల్లో దళిత ఉద్యమం ఒక అభ్యుదయకరమైన పాత్ర పోషించింది. 1990-2000 మధ్య ప్రపంచీకరణ కారణంగా దాని రూపురేఖలు మారిపోయాయి. ప్రపంచీకరణతో దళిత ఉద్యమాలు సమ్మిళితం అయ్యే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ సహకారంతోనే సామాజికోద్యమాలు నడపాలి. ఏ ప్రభుత్వం అయితే సామాజిక వెనుకబాటుకు కారణమయ్యిందో, ఏ పాలకవర్గాలయితే భూస్వాములకు వత్తాసుగా నిలబడ్డారో వారి సహకారంతోనే సామాజికోద్యమాలు నడిపే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు వారు తమ అస్థిత్వాన్ని వెదుక్కునే పనిలో పడ్డారు. ఇలాంటి స్థితిలో తిరిగి మరలా 2000 సంవత్సరం నుంచి సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకొచ్చి నాయకత్వం వహిస్తున్నది కమ్యూనిస్టు పార్టీయే. ఎక్కడ అన్యాయం, అక్రమాలు జరుగుతున్నా, వివక్ష పాటిస్తున్నా, అక్కడ వాలి తెగబడి పోరాడుతున్నది కమ్యూనిస్టు కార్యకర్తలే. 1980ల్లో వెనకబడినా, ఈ సంధి యుగంలో దాన్ని అందిపుచ్చుకొని నూతన అవగాహనతో కమ్యూనిస్టు పార్టీ ముందుకు తీసుకుపోతోంది.

1980ల్లో తెలుగువారి ఆత్మగౌరవం పేరుతో ఎన్‌టి రామారావు ముందుకొచ్చారు. దానికి మూలం కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యమే. వారి పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను అవమానించడం, తెలుగువారిని గుర్తించకపోవడం వల్ల అప్పుడా అస్థిత్వం ముందుకొచ్చింది. ఇందులో రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి: కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని ప్రశ్నించే రాజకీయ చైతన్యం ఉంది. రెండోది తెలుగువారి ఆత్మగౌరవాన్ని గుర్తించాలనే సాంస్కృతిక, సామాజిక వాంఛా ఇమిడి ఉంది. నాటి ప్రజాస్వామ్య ఉద్యమ స్ఫూర్తిలో వెంటనే కలవకపోయినా ఆ తరువాత భాగసామ్యం వహించింది కమ్యూనిస్టు పార్టీ. తెలుగువారిని కేంద్ర గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా కదిలించడంలో కమ్యూనిస్టుపార్టీ ముందుకొచ్చింది. అయితే తెలుగువారిని రెండు రాష్ట్రాలుగా విడగొట్టడంలో టిడిపి అవకాశవాద పాత్ర పోషించింది. తెలుగుదేశం ప్రారంభ దశలో ఎన్టీఆర్ మొదట అభివృద్ధికరమైన పాత్ర నిర్వహించినా ఆ తరువాత అది అభివృద్ధి నిరోధక పాత్రకు మారిపోయింది. ఎన్టీఆర్ చనిపోయాక అదే చంద్రబాబు తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచబ్యాంక్‌కు తాకట్టుపెట్టాడు.

మూడోది ప్రపంచీకరణ. సామాజిక, సాంస్కృతికోద్యమాలను పూర్తిగా తిరోగమింప చేయడం, ప్రతిదాన్నీ వాణిజ్యీకరించటం దీని లక్షణం. సాహిత్యం, కళలు, మీడియా, సినిమా, పెళ్లి, చావు, ఆఖరికి అవి నైతిక విలువలైనా, ప్రతిదాన్నీ వ్యాపారసరుకుగా మార్చింది. 'కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా కాదేదీ కవిత కనర్హం' అని శ్రీశ్రీ అన్నట్లుగా అమ్మడానికీ కొనడానికీ ఈ ప్రపంచీకరణలో అనర్హమైనదేమీలేదు. సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు చాలా మార్పులకు గురవుతున్నాయి. భాషా వికాసం చెందాలంటే ఆ జాతి శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత పురోగమనం సాధిస్తుందో ఆ భాష అంత పురోభివృద్ధి సాధిస్తుంది. ఉదాహరణకు భాషా వికాసానికి 1980ల్లో ఈనాడు దినపత్రిక ముఖ్య పాత్ర నిర్వహించింది. జనం వాడుక భాషలో అది వార్తలనందించింది. ప్రత్యేకంగా స్థానిక వార్తలను ప్రవేశపెట్టింది. అంతకుముందు (1950-60ల్లో) అంతర్జాతీయ,జాతీయ వార్తల విషయంలో కమ్యూనిస్టులు మీడియాను ఎంతగానో ప్రభావితం చేశారు. అమెరికాలో ఏం జరుగుతోందో, రష్యాలో ఏంజరుగుతోందో మామూలు వ్యక్తి చెప్పగలిగాడంటే అది కమ్యూనిస్టు జర్నలిజం వల్లనే. వారి పత్రికల వల్లనే. కానీ ఈనాడు దినపత్రిక వార్తల్ని జాతీయ అంతర్జాతీయ స్థాయి నుంచి వీధుల్లోకి తెచ్చింది. అది మంచి పనే. మన సమస్యలు, మన వీధి, మన ఇరుగు పొరుగు ఇలా. దాన్నే కమ్యూనిస్టు జర్నలిస్టులు కూడా అనుసరించాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు పరిస్థితేమిటి? ప్రతిదీ ప్రపంచీకరణ గురించే. ప్రపంచంలో జరిగే ప్రతి మార్పూ మనల్ని ప్రభావితం చేస్తోంది. ప్రపంచం గురించీ, దేశం గురించీ చెప్పకుండా నీ గురించి నువ్వు ఆలోచించుకో. నీ ఊరి గురించి నువ్వాలోచించుకో, దేశం గురించి నువ్వాలోచించొద్దు అంటే కళ్లున్న కబోదులమైపోవడమే. ఆరోజు ప్రగతిశీల పాత్ర నిర్వహించిన 'ఈనాడు' ఈ ప్రపంచీకరణ యుగంలో స్థానిక వార్తలకు ప్రాధాన్యతనిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వస్తున్న మార్పుల నుండి ప్రజలను దూరంగా ఉంచుతోంది. తద్వారా సామాజిక పురోగమనానికి వ్యతిరేక దిశలో ప్రయాణిస్తోంది. సాధారణ భాషతో పిల్లలకు కూడా అర్థమయ్యే విధంగా భాషను ప్రజల దగ్గరకు తెచ్చిన ఈనాడు పాత్ర ఇప్పుడు ప్రతికూలంగా మారింది. ఈమధ్య కంప్యూటరును అంతర్జాలం అని రాస్తున్నారు. అంతర్జాలం అంటే అర్థమేమిటో తెలుసుకోవడానికి నిఘంటువును వెదకాలి. అంతర్జాలం అనే పదం సంస్కృతమా, పార్శీకమా, తమిళమా, మళయాలమా అని తెలుగువారు తెలుసుకోవడానికి చాలా కష్టపడాలి. అంతర్జాలం అనడం కన్నా కంప్యూటరు అంటే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. దీన్ని చాదస్తమందామా లేక వ్యవహారిక భాష అనాలా? గిడుగు రామ్మూర్తి పంతులు, కందుకూరి వీరేశలింగం పంతులు తెలుగు భాషా వికాసానికి ఎంతగానో పోరాడారు. వ్యవహారిక భాషా వ్యాప్తి కోసం వారు రాసిన పుస్తకాలు ఇప్పుడు చదివితే మనం

అర్థం చేసుకోవడం చాలా కష్టం. కందుకూరి రాజశేఖర చరిత్ర నవల, గురజాడ కన్యాశుల్కం నాటకం చదివితే అప్పటికీ ఇప్పటికీ భాష చాలా మారిపోయిందని అర్థమవుతుంది.

కంప్యూటరును మనవే కనుక్కున్నామనుకోండి. దానికి అంతర్జాలం అని పేరు పెట్టామనుకోండి. దాన్ని ప్రపంచమంతా అంతర్జాలం అనే అంటుంది. మన భాష ప్రపంచ భాషగా మారిపోతుంది. అందుకే భాషా వికాసాభివృద్ధికీ, శాస్త్ర సాంకేతికాభివృద్ధికీ సంబంధం ఉంది. మనం శాస్త్రసాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందకుండా అన్నీ అమెరికా నుంచో, యూరోపు నుంచో దిగుమతి చేసుకుంటూ మన భాషలో వాటికి పేర్లు పెడితే మన పిల్లలు ఎలా అభివృద్ధి చెందుతారు? పిల్లలు అభివృద్ధి కావాలన్నా, మాతృభాషాభివృద్ధి కావాలన్నా కచ్చితంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అభివృద్ధి కావాలి. ఇప్పుడు 'మేకిన్ ఇండియా' అంటే మన డబ్బు పెట్టి అమెరికా నుంచి విడిభాగాలు కొని, వాటిని ఇక్కడ అసెంబ్లింగ్ చేయడమే. కారు పార్టులన్నీ అక్కడ కొంటాం. వాటిని ఇక్కడ కూర్పుచేసి కారును తయారు చేస్తాం. అది 'మేకిన్ ఇండియా' అయిపోతుంది. దానివల్ల శాస్త్ర సాంకేతికాభివృద్ధి రాదు. మనందరి దగ్గరా సెల్ ఫోన్లు ఉన్నాయి. దానిలో ఉండే చిన్న చిప్‌ను మనం ఇక్కడ తయారు చేసుకోలేం. ఒక వెబ్‌సైట్‌కు అవసరమైన సర్వర్లను నిర్వహించలేం. దీనికోసం అమెరికా మీదనో, యూరోపు మీదనో ఆధారపడాలి. మనం సర్వర్ అని అంటున్నాం. దానికేం పేరు పెట్టాలి? ఆ సర్వర్ అమెరికాలో ఉంటుంది. అదే సర్వర్‌ను మనం ఇక్కడ తయారు చేసుకుంటే ఒక తెలుగు పేరు పెట్టుకుంటే? మన తెలుగువాళ్లే ఇంజనీర్లు. తెలుగు ఇంజనీర్లయినా ఇంగ్లీషు పేరు పెట్టాల్సిందే. లేకపోతే వాళ్లకు అమెరికా జీతం రాల్చదు. అదే మన ప్రభుత్వం వాళ్లను ప్రోత్సహించి అవే సర్వర్లను, చిప్‌లను ఇక్కడ తయారు చేయించుకొని తెలుగు పేర్లు పెట్టుకుంటే అవి ప్రపంచవ్యాప్తం అవుతాయి. అప్పుడు తెలుగువారి కీర్తి ఖండఖండాంతరాలకూ వ్యాపిస్తుంది. ఈ రెంటి మధ్య సంబంధాన్ని విడదీయలేము.

ఈ మధ్య హైదరాబాద్ వెళ్లినప్పుడు ఒక పాప టైం ఎంతయింది అని అడిగింది. పదయ్యిందని చెప్పా. అంటే ఎంతా అని అడిగింది. టెన్ అన్నా. ఓ అప్పుడే టెన్ ఓ క్లాక్ అయ్యిందా అన్నది. రాబోయే కాలంలో యువతరం తెలుగుభాష కోసం పోరాడాల్సిన పరిస్థితి వస్తుందనీ, దాన్ని కమ్యూనిస్టులే లీడ్

> **"కానీ ఈరోజు మన దేశంలో మతం ప్రతికూల పాత్ర పోషిస్తోంది. మతం పేరుతో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నారు. భారతీయులు అంటే హిందువులు మాత్రమే అంటున్నారు. మన పురాణాల్లో, రామాయణ, భారతాల్లో హిందూ అనే పదం ఎక్కడా కనపడదు. భరత వర్షే, భరత ఖండే అన్నారు తప్ప హిందూ దేశే, హిందూ ఖండే, హిందూ వర్షే అని ఎక్కడా అనలేదు. హిందూ అన్నది విదేశీయులు పెట్టిన పేరు."**



ప్రజానాట్యమండలి కళా ప్రదర్శనలు

చేస్తారనీ నాకనిపించింది. అలాంటి కొత్త పరిస్థితి ఈ రోజు తలెత్తుతోంది. ఇక భాషా వికాసంలోనూ ఛాందసత్వం ఉంది. కొన్ని సందర్భాల్లో కొత్త పదాలు పుట్టుకొని వస్తుంటాయి. ఉదాహరణకు జరీబు భూములంటున్నాం. ఇది ఉర్దూ పదం. మాగాణి అని అర్థం. ఉర్దూ పదాన్ని మన భాషలో భాగంగా చేసుకున్నాం. ఇటువంటివి వ్యవసాయ సంబంధమైన పదాలు ఉర్దూ నుండి తెలుగులోకి చాలానే వచ్చాయి. రెవెన్యూ పదజాలం కూడా ఎక్కువగా ఉర్దూలోనే ఉంటుంది. పహాణీ వంటి పదాలు అందుకు ఉదాహరణ. ఇలా భాషా వికాసంలో వస్తున్న మార్పులను కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

ప్రపంచీకరణలో వచ్చిన ముఖ్యమైన మార్పుల్లో జాతుల ప్రత్యేకతను గుర్తించకపోవడం ఒకటి. ఇంగ్లీషులో 'నేషనల్ స్టేట్' అంటారు. మన జాతీయోద్యమం కూడా దాని ఆధారంగానే నడిచింది. ఇప్పుడు సరిహద్దులు చెరిపేసి ప్రపంచం అంతా ఒకటే అంటున్నారు. ప్రపంచమంతా ఒకటి కావాలని కమ్యూనిస్టులు అందరికన్నా ముందు కోరుకున్నారు. కానీ కమ్యూనిస్టులు కోరుకున్నది వేరు, నేడు జరుగుతున్నది వేరు. ఇపుడు జరుగుతున్నది ప్రపంచ సరిహద్దులు చెరిపేసి అందరూ ఉమ్మడిగా ఒక ప్రపంచ రాజ్యాన్ని ఏలడం కాదు. అమెరికా ఆధిపత్యంలో ఉన్న సంపద్వంతమైన జాతులు కొన్ని ప్రపంచం మీద పెత్తనం చేస్తున్నాయి. వారు శాసిస్తారు. మనం అనుసరించాలి. ఆ రకంగా జాతుల నిర్మూలనకు దారితీసే ప్రమాదం కూడా ప్రపంచీకరణలో మనకు కనిపిస్తోంది. మతం పేరుతో పెద్ద అలజడి సృష్టిస్తున్నారు. మతాన్ని విషగుళికలుగా మార్చి, దానికి భక్తి అనే తీపి ముసుగు తొడిగి సమాజంపై చల్లారు. జనానికి మత్తెక్కించి చీలగొట్టారు. వారిలో వారికి తగాదాలు పెట్టారు. పెత్తందారీ వర్గాలను అందలమెక్కించారు. బలపరచారు. దేవుడు ఉద్యమాలకు కానీ, సమాజాభివృద్ధికిగానీ ఎప్పుడూ అడ్డం రాలేదు. దేవుని పేరు చెప్పుకునే మనుషులు అడ్డం వచ్చారు. లాటిన్ అమెరికాలోని పరిణామాలు చూస్తే, వారి సహజ సంపదను అమెరికా వాళ్లు దోచుకుపోతుంటే, వాళ్లను అణిచిపెట్టి బికారులను చేస్తుంటే దానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలతోపాటు

> **❝ కానీ జన్‌ధన్ యోజన ప్రజలను అప్పులపాలు చేసే పథకం. ఈ పథకాన్నిపెట్టి నాది ఘన విజయం అని చెబితే ఉపయోగమేమిటి? ఈ ఐదు వేలు దేనికి పనికి వస్తాయి? ఏమైనా ఒక వ్యాపారం పెట్టుకోవడానికి పనికి వస్తుందా? ఏదో ఒకటి కొనుక్కోవడానికి మాత్రమే పనికి వస్తుంది. కొనుకున్న తరువాత మరల ఆదాయం ఎలా వస్తుంది? వారు కట్టలేకపోతే ప్రభుత్వం ఏం చేస్తుంది? ❞**

క్యాథలిక్కులు, క్రిష్టియన్లు, థియాలజిస్టులు కూడా కలిసి వచ్చారు. మత పెద్దలు కలిసి వచ్చారు. ఈ రోజు వాటికన్ సిటీకి పోప్ ఫ్రాన్సిస్ అధినేతగా ఉన్నాడు. ఆయనీరోజు పేదల గురించి మాట్లాడుతున్న పాపానికి 'మార్క్సిస్ట్ పోప్' అంటున్నారు. ప్రజల ఒత్తిడి వల్ల కావచ్చు, అక్కడ ఉండే పరిస్థితుల వల్ల కావచ్చు, ఈనాడు మతం అక్కడ సానుకూల పాత్ర పోషిస్తోంది. కానీ ఈరోజు మన దేశంలో మతం ప్రతికూల పాత్ర పోషిస్తోంది. మతం పేరుతో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నారు. భారతీయులు అంటే హిందువులు మాత్రమే అంటున్నారు. మన పురాణాల్లో, రామాయణ, భారతాల్లో హిందూ అనే పదం ఎక్కడా కనపడదు. భరత వర్షే, భరత ఖండే అన్నారు తప్ప హిందూ దేశే, హిందూ ఖండే, హిందూ వర్షే అని ఎక్కడా అనలేదు . హిందూ అన్నది విదేశీయులు పెట్టిన పేరు. ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్, హిందువులు ప్రార్థన చేయడం ముస్లింలు వచ్చాకే నేర్చుకున్నారని చెబుతున్నాడు. ఇన్నాళ్లకు ఆయనకు రియలైజేషన్ వచ్చింది. దీనర్థం ప్రార్థన చేయడం అన్నదే మనకు తెలియదని అంగీకరించడమేగా కదా! కనీసం ముస్లింల నుంచి హిందువులు నేర్చుకున్నారనే సత్యాన్నయినా గ్రహించాడు. మోడీ కుర్తా, పైజామా, కోటు ధరిస్తున్నాడు. అది హిందువుల డ్రస్సా? పురాణాల్లో ఉందా? మొఘలాయిలు తెచ్చిన డ్రస్సు అది. మోడీ ఎలా ధరిస్తున్నాడు? దళితుల అంటరానితనాన్ని ముస్లింలు తీసుకువచ్చారట. అంతకుముందు అంటరానితనం లేదట. ఎవరైనా నవ్వుతారు. అంటే మొత్తం చరిత్రను వక్రీకరించి, చెడును ముస్లింలకు ఆపాదించి దళితులకూ, ముస్లింలకూ తగాదాలు పెడుతున్నారు. డిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో చాలా చోట్ల జరుగుతున్న మతఘర్షణలు మనం చూస్తున్నాం. ఈరోజు మత ఘర్షణలన్నింటిలో దళితులను ముస్లింల మీదకు మళ్లిస్తున్నారు. గుడి దగ్గరో, గోపురం దగ్గరో, ప్రేమ దగ్గరో, పెళ్లి దగ్గరో తగాదా సృష్టించి ముస్లింల మీదకు రెచ్చగొడుతున్నారు. ఆ రకంగా వారిని బలిపశువులను చేస్తున్నారు. మనవారి మధ్య తగాదా పెట్టి, ఒకగ్రూపును ఆయుధంగా మార్చి మనవారిమీదే ప్రయోగిస్తున్నారు. ఇదే గుజరాత్ నమూనా.

అనేక రకాల పండుగలు జరుగుతున్నాయి. ఈ పండుగల్లో కూడా జాతీయమైనవీ, మత సంబంధమైనవీ, స్థానికంగా ఉండేవీ, ప్రకృతి పరమైనవీ, పంటలు చేతికొచ్చే కాలంలో వచ్చేవీ ఉన్నాయి. పండుగలన్నీ మూఢనమ్మకాలని, పనికిరానివీ అని ఒకే గాటన కట్టలేం. ఒకప్పుడు 1950ల్లో పండగొస్తే కమ్యూనిస్టులు ప్రభలు కట్టి అభ్యుదయ పాటలు పాడుకుంటూ తిరునాళ్లు, జాతర్లలో పాల్గొనేవారు. ఆరోజు అభ్యుదయ గీతాలు కూడా పండుగల్లో భాగమై పోయాయి. సంక్రాంతి వస్తే ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఊరుఊరంతా పండుగ వాతావరణం వచ్చేది. అలాంటి ఒక ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని పండుగలతో మమేకం చేసి నిర్మించింది కమ్యూనిస్టు ఉద్యమం. మరలా అలాంటి సాంస్కృతికోద్యమాన్ని బీజం తొడిగి నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ రోజు మేడే ఉంది. అది కార్మికుల పండుగ. జెండా ఎగురవేసి డప్పుకొట్టి నినాదాలిస్తేనే పండుగకాదు. ప్రతి ఇంట్లో దీపం వెలిగించవచ్చు. జెండా ఎగురవేయవచ్చు. అదొక ఉమ్మడి పోరాట ప్రతిజ్ఞాదినం. ప్రజా పండుగ. కార్మికుల పర్వదినం. ఓ ప్రమాణం స్వీకరించే దినంగా భావించాలనుకుంటే అప్పుడు కొత్త వెల్లువ, కొత్త సంస్కృతి వచ్చేస్తుంది. ఈ రోజు ప్రపంచీకరణ వాణిజ్యీకరణగా మారింది. సాంస్కృతిక రంగంలో ప్రజలకుండే జాగా క్రమంగా తగ్గిపోతోంది. ఇంతకుముందు పిల్లలను పార్కులకు తీసుకొని వెళ్లి అలా తిప్పి తీసుకువచ్చేవాళ్లు. పార్కుల్లోకి పోవాలంటే అప్పుడు ఉచితం. కానీ ఇప్పుడు పార్కులకు పోవాలంటే ఫీజు కట్టాలి. ఫీజు కన్నా మించిన పెద్ద ఖర్చుంది. పార్కు మొత్తం ఇప్పుడో కమ్మర్షియల్ మాల్ అయిపోయింది. అన్నీ రకాల షాపులు ఉంటాయి. అక్కడ రకరకాల వస్తువులు అమ్ముతారు. అయితే పిల్లలను తీసుకుపోయినప్పుడు వెంట ఒక ఆటం బాంబును పట్టుకుపోయినట్లే. వెయ్యో, రెండు వేలో తీసుకుపోతేనే పిల్లలను సంతృప్తిపరచగలం. లేకుంటే లేదు. అటువంటి చోటకు పోయి ఏం చేస్తాం? కాబట్టి పార్కులకు పోయే సమస్య లేదు. మరి ఓ ఉయ్యాల లేకుండా, ఓ జారుడు బండ లేకుండా పిల్లల వికాసం ఏమిటి? గ్రామాల్లో కూడా కోతికొమ్మచ్చాటలు, బిళ్లంగోడులు కనిపించడం లేదు. వినోదాల కోసం పట్నాలకు పోతున్నారు. స్కూలు బస్సే పిల్లలకు ఆటస్థలంగా మారిపోయింది. 24 గంటలూ తోమి వారిని మర మనుషులుగా మార్చేస్తే భవిష్యత్తు ఎలా ఉంటుంది? అప్పుడు ఆ జాతి ఎలా ఉంటుంది? ఒక భౌతికపరమైన, మానసికపరమైన వికాసంలేని జాతి రాబోయే కాలంలో ఎలా ఉంటుంది? సాంస్కృతిక శూన్యం ఏర్పడుతుంది. ఇది భవిష్యత్తులో కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్ద సవాల్‌గా మారుతుంది. టర్కీలో పార్కుల కోసం పెద్ద ఉద్యమం నడిచింది. కమ్యూనిటీ హాలు కోసం కేటాయించిన స్థలంలో పెద్ద మాల్ కట్టబోతుంటే మాకు ఈమాల్ వద్దని ప్రజలు తిరుగుబాటుచేశారు. అది ప్రభుత్వాన్ని గడగడలాడించిన పెద్ద ఉద్యమంగా మారింది. ఇటువంటి ఉద్యమాలు ప్రపంచమంతా నడుస్తున్నాయి. మన దేశంలోనూ ప్రారంభమయ్యాయి. ఢిల్లీ, బొంబాయిల్లో ఇలాంటి ఉద్యమాలు నడుస్తున్నాయి. కాబట్టి రాబోయే కాలంలో ఇటువంటివి అనేకమైనవి ప్రతిదీ డబ్బుతో ముడిపడిపోతాయి. పార్కుకు పోయినా డబ్బు. సినిమాకు పోయినా డబ్బే. కానీ సినిమాకు పోయినట్లు ఉండదు. మాల్‌కు పోయినట్లు ఉంటుంది. ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లినా, రైల్వే స్టేషన్‌కు పోయినా కమ్మర్షియల్ మాల్స్‌కు పోయినట్లుంటుంది. దానికి డబ్బు కావాలి. అందుకే మోడీ ధన్‌జన్ యోజన ప్రవేశపెట్టాడు. జన్‌ధన్ యోజన కింద ఐదు వేల రూపాయలు ఓవర్‌డ్రాఫ్ట్ ఇస్తాడట. అంటే అప్పు తీసుకో. అనుభవించి, దివాళా ఎత్తు. ఎవరైనా ప్రజల ఆదాయాలు పెంచడానికి ప్రభుత్వం మార్గాలు చూపాలి. పథకాలు పెట్టాలి. కానీ జన్‌ధన్ యోజన ప్రజలను

అప్పులపాలు చేసే పథకం. ఈ పథకాన్నిపెట్టి నాది ఘన విజయం అని చెబితే ఉపయోగమేమిటి? ఈ ఐదు వేలు దేనికి పనికి వస్తాయి? ఏమైనా ఒక వ్యాపారం పెట్టుకోవడానికి పనికి వస్తుందా? ఏదో ఒకటి కొనుక్కోవడానికి మాత్రమే పనికి వస్తుంది. కొనుకున్న తరువాత మళ్లీ ఎలా తీర్చాలి? వారు కట్టలేకపోతే ప్రభుత్వం ఏం చేస్తుంది? అంటే పెద్ద వాళ్లు లక్షల కోట్లు ఎగవేశాక వీరి ఐదువేలు పోతే పోయిందిలే మాఫీ చేస్తామంటారు. ఎందుకంటే జనాన్ని అవినీతిపరుల్ని చేస్తేనే కదా వారి అవినీతి కూడా మూడుపువ్వులు,ఆరుకాయలుగా వర్ధిల్లేది. కాబట్టి ఈ రకమైన సాంస్కృతిక శూన్యత రాబోయే రోజుల్లో పెరగబోతున్నది.

ఇప్పుడు భాష గురించి చెప్పుకున్నాం. భాషల్లో చాలా భాషల గురించి చెప్పారు రవిబాబుగారు. ఓ కొత్త భాష వచ్చింది. అది రాజకీయ భాష. రాజకీయ సంస్కృతి మాదిరిగానే రాజకీయ భాష కూడా. ఈ రాజకీయ భాష ప్రత్యేకత ఏమిటంటే వారుచెప్పేది జనానికి అర్థమయినట్లే ఉంటుంది కానీ అర్థం కాదు. అంటే అస్పష్టంగా ఉంటుంది. ఇచ్చినట్లే ఉంటుంది. నేను చెప్పానా ఆమాట అంటాడు. అప్పులు రద్దు చేస్తానంటాడు. రూ.పదివేలు కూడా రద్దు కాలేదు అని రైతులు అడిగితే అప్పులన్నీ రద్దు చేస్తానని చెప్పానా అంటాడు. అదన్నమాట రాజకీయ భాష అంటే. తిమ్మిని బమ్మిని చేసి, బమ్మిని తిమ్మిని చేసి నెత్తిమీద పదిపైసలు పెట్టి నిన్ను పావలాకు అమ్మేస్తామని చెప్పే మాటలు ఇక్కడున్న భాషా పండితులు, సాహితీవేత్తలు రాజకీయ నాయకుల వద్ద, మోడీ దగ్గర, చంద్రబాబు దగ్గర నేర్చుకోవాలి. ప్రజలను మోసం చేసి, వంచన చేసే నయవంచక భాష ఒకటి రాజకీయ రంగంలో ప్రవేశపెట్టారు. సాహిత్య రంగంలో దీన్ని కూడా చీల్చి చెండాడాలి. ఒక కొత్త ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతి రావాల్సి ఉంది. కేజ్రీవాల్ కూడా అదే చెబుతున్నారు. విఐపి కల్చర్ వద్దు. అవినీతి లేని రాజ్యం రావాలి. గుడ్‌గవర్నెన్స్- అంటే మంచి పాలన కావాలి. అంటే కష్టం లేకుండా పైసా ఖర్చు లేకుండా ప్రజలకు సర్టిఫికెట్లు వచ్చేయాలి. ఆసుపత్రికి పోతే వెంటనే పనికావాలి. స్కూల్లో వెంటనే సీటు కావాలి. ఇవన్నీ మంచి ఆశయాలే. కమ్యూనిస్టులు కోరుకునేవి కూడా ఇవే. వామపక్షాలు అధికారంలో ఉన్నచోట ఎవరికన్నా బాగా వీటిని

> **❝ వామపక్షాలు అధికారంలో ఉన్నచోట ఎవరికన్నా బాగా వీటిని అమలు చేస్తున్నారు. కానీ ఒకటే తేడా. ఈ వ్యవస్థను ఇలా ఉంచి దీనినే సంస్కరించి అన్నీ సమృద్ధిగా సమకూర్చి పెడతానని కేజ్రీవాల్ అంటున్నారు. ఈ వ్యవస్థను ఇలాగే ఉంచి అన్నీ సమకూర్చాలంటే అసాధ్యం. అన్ని సౌకర్యాలూ సమకూరాలంటే వ్యవస్థను సమూలంగా పునర్నిర్మించితేనే సాధ్యమవుతుందని కమ్యూనిస్టులు చెబుతున్నారు. ❞**



అమలు చేస్తున్నారు. కానీ ఒకటే తేడా. ఈ వ్యవస్థను ఇలా ఉంచి దీనినే సంస్కరించి అన్నీ సమృద్ధిగా సమకూర్చి పెడతానని కేజ్రీవాల్ అంటున్నారు. ఈ వ్యవస్థను ఇలాగే ఉంచి అన్నీ సమకూర్చాలంటే అసాధ్యం. అన్ని సౌకర్యాలూ సమకూరాలంటే వ్యవస్థను సమూలంగా పునర్నిర్మించి కొత్త వ్యవస్థను నిర్మిస్తేనే సాధ్యమవుతుందని కమ్యూనిస్టులు చెబుతున్నారు. తక్షణం భారాలకు వ్యతిరేకంగానో, కాలేజీల్లో ఫీజుల పెంపుకు వ్యతిరేకంగానో, ఆసుపత్రిల్లో వైద్యం కోసమో, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు కల్పించాలనో, సబ్సిడీల కోసమో పోరాడుతూనే ప్రజలను కదిలించి, సమూల మార్పుల కోసం పెద్ద ఉద్యమాలు నిర్మిస్తే, దానికో రాజకీయ రూపమిస్తే అప్పుడు ఈ సమాజాన్ని మార్చొచ్చు.


ఈ మధ్య హైదరాబాద్‌లో పార్టీ ఇంటింటికీ వెళ్లి ఓ సర్వే నిర్వహించినప్పుడు 30 ఏళ్లలోపు యువకుల్లోలో ఒక ధోరణి కనిపించింది. అందులో మంచీ చెడూ రెండూ ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీ గురించి వారికి తెలియదు. అందులో రాజకీయాలు మాకనవసరం. అన్ని పార్టీలూ ఒకటే. కమ్యూనిస్టు పార్టీ కూడా అందులో ఒకటి. 40, 50 ఏళ్ల వాళ్లలో కమ్యూనిస్టు వ్యతిరేకత ఉంది. (సోవియట్ యూనియన్ కూలిపోయిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన దాని ప్రభావం వారి మీద ఉంటుంది). అందుకని కమ్యూనిస్టులంటే కొంత ద్వేషం ఉంటుంది. కానీ యువకుల్లో కమ్యూనిస్టులంటే ద్వేషం లేదు. రాజకీయాలంటేనే వ్యతిరేకం. రాజకీయాలకు వ్యతిరేకమంటే కమ్యూనిస్టు పార్టీ కూడా రాజకీయ పార్టీ కాబట్టి ఆ వ్యతిరేకత వచ్చింది. మీరేదన్నా మాకోసం పని చేయండి. నచ్చితే నిధులిస్తాం అన్నవాళ్లున్నారు. రాజకీయాలంటే తెలియకపోయినా, రాజకీయాలంటే వ్యతిరేకత ఉన్నా, కమ్యూనిస్టు పార్టీ ఈ కొత్త తరంలో పనిచేస్తే అభివృద్ధి అయితీరుతుంది. ఈ తరంలో కమ్యూనిస్టు వ్యతిరేకత లేదు. అలాగని సానుకూలత వుందని

(మిగతా 15వ పేజీలో)

**ఈ మాసం ప్రత్యేకం**

# అంబేద్కర్ వారసత్వం

**ఎన్. రామ్**



రచయిత హిందూ దినపత్రిక మాజీ సంపాదకులు

మేధావి మరియు సామాజిక విప్లవ కారుడు అయిన డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా మరీ ముఖ్యంగా హిందూ మితవాదులు ఆయనను సొంతం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్న సందర్భంలో ఆయన చేసిన కృషి, వారసత్వంపై ఒక అంచనా.

స్వతంత్ర భారతదేశం అంబేద్కర్ 125వ జయంతి జరుపుకోవటానికి సిద్ధమవుతున్న సందర్భంలో ఆయన ఎన్నడూలేనంత ఎత్తుకు ఎదిగినట్లు కనిపిస్తున్నది. అనేక ముఖ్య ఘట్టాలలో, ఉద్యమాలలో నవభారత నిర్మాణం కోసం, ప్రజాస్వామ్యంకోసం, సామాజిక రుగ్మతలు లేని దేశంకోసం అంబేద్కర్ కృషి చేశారు. ఎంతోమంది ఉద్దండులు, దేశవ్యాప్తంగా పేరొందిన ప్రముఖులు ఆయన సమకాలీనులు గానూ, ప్రత్యర్థులుగాను ఉన్నారు. అంబేద్కర్ జీవితానుభవంలో గుర్తించిన సామాజిక రుగ్మతలు, జరిపిన ఉద్యమాలు, అధ్యయనం, ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలి. భారత సమాజం గురించి ఆయన లోతుగా పరిశీలన చేసి లేవనెత్తిన అనేక ప్రశ్నలు నేటికీ సజీవంగా నిలిచి ఉండటం, ఆయన కృషిని, ప్రాధాన్యతని నేటికీ గుర్తుచేస్తున్నాయి.

1871 ఏప్రిల్ 14వ తేదీన మధ్య భారతదేశంలో మౌ అనే ప్రాంతంలో , మతభావాలను విశ్వసించే, పేద మెహర్ కుటుంబంలో భీమ్‌రావ్ అంబేద్కర్ జన్మించాడు. వీరి వంశంలో మిలటరీలో పనిచేసిన పరంపర ఉండటంతోపాటు, విద్యపట్ల అనూహ్యమైన ప్రీతి ఉన్నది. పాఠశాల విద్యాభ్యాసం సతారాలోను, ముంబైలోను, కళాశాల విద్యాభ్యాసం ముంబైలోను పూర్తిచేసిన అంబేద్కర్ 1913లోను మరియు 1917లో కొద్దికాలంపాటు బరోడా మహారాజుగారి దగ్గర సేవలుకూడా అందించాడు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో కొలంబియా విశ్వవిద్యాలయంలో, గ్రేస్ ఇన్ బాక్ విశ్వవిద్యాలయములో ఉన్నత విద్య అభ్యసించిన ఈ నవ యువకుడు ఆనాటి సమకాలీన రాజకీయనాయకులలో చాలా మందికి లేనటువంటి, అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించాడు. జీవితానికి సంబంధించిన అన్ని అంశాలలో లోతైన అవగాహనను ఆర్జించిన ఘనత అంబేద్కర్‌కి దక్కుతుంది.

అప్పుడప్పుడే అందివస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భీమ్‌రావ్ విశేష ప్రతిభను కనపరిచాడు. నిజానికి, తన కుటుంబంలో మరెవ్వరూ అందుకోలేనటువంటి, తన తోటి సమాజంలో అత్యధిక శాతం అందుకోలేనిది భీమ్‌రావ్ అందుకున్నాడు. అందులోకూడా ప్రతిఒక్క అంశం, అంటే పాండిత్యం, మేధస్సు, ప్రొఫెషనల్‌గా సాధించిన విజయాలన్నిటిలోను కష్టపడి, పోరాడి సాధించుకున్నవే తప్ప అప్పనంగా వచ్చినవికాదు. అందులోనూ ఆనాడు ఉన్నటువంటి సామాజిక అడ్డంకులు ముఖ్యంగా పక్షపాతవైఖరి, సామాజిక అణచివేతలు, కులపీడనలు వంటివి ఎదుర్కొని సాధించాడు. 1920లలో తొలి నాళ్ళకే అంబేద్కర్ ఎమ్.ఎ, పి.హెచ్.డి. ఎమ్.ఎస్.సి (అర్థశాస్త్రం), డి.ఎస్.సి (అర్థశాస్త్రం) మరియు బారిస్టర్ ఎట్ లా పూర్తిచేశాడు. తనకి 30 సంవత్సరాలు వచ్చే సరికే, ప్రముఖ విద్యావేత్తలు, అధ్యయన కారులు తమ జీవితకాలంలో సాధించలేనన్ని నిజ జీవిత అనుభవాలను అంబేద్కర్ గడించాడు.

నాలుగు దశాబ్దాల తన ప్రజా జీవితంలో అనేక వివాదాస్పద అంశాలలోనూ, అధిగమించటానికి వీలులేనటువంటి అనేక సామాజిక సమస్యలమీద అంబేద్కర్ ఒక హీరోలాగా వెలుగొందాడు. అలెగ్జాండర్ గొల్డెన్‌వైసర్ 1916 మే నెలలో సామాజిక శాస్త్రాలపై సెమినార్ జరిపినప్పుడు, మొట్టమొదటి సారిగా అంబేద్కర్ "భారతదేశంలో కులాల తీరు తెన్నులు, పుట్టుక మరియు అభివృద్ధి" అనే అంశంపై చాలా అద్భుతమైన పత్రాన్ని సమర్పించాడు. పారదర్శకత, నిజాయితీ, పట్టుదల వంటి అపూర్వ గుణాలు కలిగిన ఉదారవాది డా॥ అంబేద్కర్. తాత్వికంగా మొదట ఆదర్శవాదం (యుటిలిటేరియనిజం) వైపు మొగ్గినప్పటికీ, అంతిమంగా బుద్ధుని సిద్ధాంతంవైపు ఆకర్షితుడయ్యాడు. ఫ్రెంచ్ విప్లవ లక్ష్యాల నుండి స్ఫూర్తిని పొందాడు. భారతీయ ప్రజా సంస్కృతిలోని మానవీయ కోణాలు, నాగరికత, సామాజిక పురోగామి ఆలోచనలు ఆయనను ముందుకు నడిపించాయి. మార్క్సిజం పుస్తకాలను కూడా చాలా లోతుగా అధ్యయనం చేశాడు. అవి ఎంతగా అంటే 1938లో బాంబేలో చారిత్రాత్మక ఖాట్ వ్యతిరేక ఉద్యమం జరిగినప్పుడు "ఇక్కడ ఉన్న కమ్యూనిస్టు నాయకులకన్నా నేను కమ్యూనిస్టు సిద్ధాంతం గురించి లెక్కలేనన్ని ఎక్కువ పుస్తకాలను చదివాను'' అని ఆయన ప్రకటించాడు. అయినా ఆయన ఏప్పుడూ విప్లవ సిద్ధాంతమైన మార్క్సిజం-లెనినిజంతో ప్రభావితం చేయబడలేదు, సోషలిజాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయలేదు.

ఆయన కాంగ్రెస్ సిద్ధాంతాలను, గాంధీయిజాన్ని పూర్తిగా వ్యతిరేకించేవాడు. కాని కొన్ని సామాజిక అంశాలలో జవహర్‌లాల్ నెహ్రూ ఆలోచనలతో ఏకీభవించేవాడు. 1950ల్లో ఆయన న్యాయశాఖ మంత్రి గా ఉండి హిందూకోడ్ బిల్లు తెచ్చినప్పు డు, అదే జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా అంబేద్కర్‌ను ఘోరంగా దెబ్బతీశాడు.

**సాహసవంతమైన పరిశోధనాకారుడు అంబేద్కర్:**

చిన్ననాటి నుండి అంబేద్కర్ ఎప్పుడూ విశ్రాంతి లేకుండా సాహసోపేతమైన పరిశోధనలు చేస్తుండేవాడు. విలువల సమతుల్యం పాటించడంలో, పరిశీలించినవాటిలోని, ఆచరణాత్మక అంశాలలోని వ్యత్యాసాలను సరిచేయడంలో కొన్ని సందర్భాలలో విఫలమయ్యాడు. సామాజికంగా అణగారిన వర్గానికి చెందినప్పటికీ, వివక్షకు గురయిన విద్యార్థిగా ఉన్నప్పటికీ, బరోడా రాజకుటుంబంతో సహా ఎవరైనా తన మీద జాలి చూపించినా,

> భారతస్వాతంత్ర్య పోరాటంలో అతి ముఖ్యమైన బలహీనత అంబేద్కర్ లేవనెత్తిన సామాజిక అంశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం లేదా సర్దుబాటు ధోరణిని అనుసరించటం. ఈ అంశాలు ప్రభావితం చేయగలిగేవి కాదనే తప్పుడు అవగాహన, ముఖ్యంగా సనాతన ధర్మం అనే అంశంపై మౌనం వహించారు.

ఉద్ధరిస్తున్నట్లు ప్రవర్తించినా సహించేవాడు కాదు. బుద్ధిజం తీసుకున్న కొద్దికాలానికే వెళ్ళిపోయిన అంబేద్కర్ తన జీవితకాలంలో ఎప్పుడూ తనకంటూ ప్రత్యేకత, గుర్తింపు ఉండేలా జీవించారు. సతారాలో పాఠశాల విద్యార్థులు, వివక్షతో కూడిన అంటరాని తనంతో అంబేద్కర్‌ని క్రికెట్ ఆడనివ్వకుండా చేసినా, ఆయన ఎప్పుడు ఆటమీది నుండి దృష్టిమరల్చలేదు. ప్రజా జీవితంలో నితరంతరం సాధించగలిగేవి, ఆచరణలో సాధ్యమయ్యే లక్ష్యాలను మాత్రమే ఎంచుకున్నారు. సామాన్య ప్రజానీకం, ప్రత్యేకించి భారత సమాజంలోని అట్టడుగుస్థాయి ప్రజా సమస్యలపై స్పందించటానికి ఆయన స్థాయిగాని, లోతైన విశ్లేషణలుగాని, అధ్యయనం కాని, గ్రంథాలు కాని, పర్సనాలిటీగాని ఎన్నడూ ఆయనకి అడ్డంకిగా మారలేదు.

అంబేద్కర్ జీవించినంతకాలం, ఆయన ప్రత్యర్థులు, విమర్శకులు మరీ ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ఆయన ఆ యుగంలోని వ్యూహాత్మక లక్ష్యాన్ని గుర్తించలేని వ్యక్తిగా పదే పదే అభివర్ణించేవారు. ఆ ప్రచారం బాగా ప్రాచుర్యం పొంది, ఆఖరికి మీడియాకూడా ఆయనను ఒక రెండో తరగతి దేశనాయకుడిగానూ, షెడ్యూల్ కులాలకి పరిమితమైన నాయకుడిగా చిత్రీకరించింది. వస్తుగతంగా చూస్తే ఆయనంత మహోన్నతవ్యక్తి, సాహసోపేతమైన దేశనాయకులు చాలా తక్కువమంది ఉన్నారన్నది సుస్పష్టం. దురదృష్టవశాత్తు స్వాతంత్ర్య పోరాటంలోని కొంతమంది హీరోలు, సామాజిక విప్లవకారులు సైతం అంబేద్కర్ యొక్క లోతైన అధ్యయనం, దృఢచిత్తం, సామాజిక అంతరాలపై జరిపిన బలమైన పోరాటాలను పూర్తిగా విస్మరించారు. కొంతమందయితే ఆయన దేశభక్తిని కూడా శంకించి, నీచంగా మాట్లాడారు. కాని అలాంటివారిని ఈరోజు ఎవరు గుర్తుంచుకుంటారు? అందుకనే ఇంత వైవిధ్యభరితమైన, స్ఫూర్తివంతమైన స్వాతంత్ర పోరాట అనుభవాలను గమనిస్తే, అంబేద్కర్ సామాజిక అంశాలపై ఎంత ప్రశంసనీయమైన ప్రశ్నలు సంధించాడో కదా అని మనం అభినందించవచ్చు. అలాగే ఆయన విమర్శకులు, శత్రువులవి శుద్ధ అబద్ధపు వాదనలుగా మనం పరిగణించవచ్చు.

**అంబేద్కర్ లేవనెత్తిన ముఖ్యమైన సామాజిక అంశాలు :**

భారతస్వాతంత్ర్య పోరాటంలో అతి ముఖ్యమైన బలహీనత అంబేద్కర్ లేవనెత్తిన సామాజిక అంశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం లేదా సర్దుబాటు ధోరణిని అనుసరించటం. ఈ అంశాలు ప్రభావితం చేయగలిగేవి కాదనే తప్పుడు అవగాహన, ముఖ్యంగా సనాతన ధర్మం అనే అంశంపై మౌనం వహించారు.



డా॥ బి.ఆర్. అంబేద్కర్

సామాజిక అంశాలపై, పోరాటాలపై లోతైన పార్శ్వాలన్నీ తట్టిచూపిన అంబేద్కర్ ఆశయాన్ని ఇప్పుడన్నా గుర్తించాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటంలో దీనికి తగినంత ప్రాధాన్యత ఇవ్వబడలేదు. దేశరాజకీయ దృక్పథంలో ఎప్పుడూ నికరంగా కేంద్రస్థానం వహిస్తూ, తీవ్రవాదశైలితో, సామాజిక అంశాలలో ఎటువంటి సర్దుబాటు ధోరణి ప్రదర్శించకుండా ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారు అంబేద్కర్. సమాజంలోని అసమానతలు, మతాలలో ఇమిడిఉన్న అణచివేత ధోరణులు, సాంప్రదాయ వారసత్వాలు, మెజారిటీ సమాజం రుద్దిన విలువలను గమనించిన అంబేద్కర్ సామాజిక, ఆర్థిక న్యాయం కోసం తన సొంత ఆదర్శాలను రచించుకున్నాడు.

ఆయన తనకు నూతన అవగాహన ఇవ్వగలిగిన వర్గ విశ్లేషణను వదిలివేశాడు. భారతదేశంలో కులానికి వర్గానికి మధ్య ఉన్న సంబంధాన్ని ఒడిసిపట్టాడు. గుర్తింపదగిన అంశం ఏమిటంటే, సామాజిక న్యాయంకోసం, భయమెరుగని పోరాటం జరిపిన ఈ ధీరుడు తనఎప్పుడూ రాజకీయ ఉదారవాదిగానే భావించాడు కాని అతని ప్రత్యర్థులు మటుకు స్వాతంత్ర్య పోరాటంలోని కీలక ఘట్టాలన్నింటిలోను అతనిని పక్కన పెట్టే ప్రయత్నం చేశారు. ఆశ్చర్యకరమైన అంశమేమిటంటే, ఆయన తన రాజకీయ జీవితంలోనూ, ప్రజా జీవితంలో విరామం లేకుండా లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాల కోసం భారతదేశం అన్వేషిస్తుండగా, ఆయనను అనుసరించే అనేకమంది మద్దతుదారులు నేటికీ స్వతంత్ర భారత దేశంలో విస్తరించి ఉన్నారు.

సిద్ధాంత పరంగా అంబేద్కర్ మధ్యేవాద మితవాదిగా ఉన్నప్పటికీ కొన్ని సందర్భాలలో రెండోవైపుకు, తీవ్రవాదపక్షం వైపుకు బాగానే మొగ్గాడు. ప్రత్యేకించి, శక్తివంతమైన ప్రజా ఉద్యమాలు ఆయన భావాలకు, ఉద్యమాలకు, రాజకీయ నిర్మాణ కృషికి దన్నుగా సాగినప్పుడు, ఉదాహరణకు 1938లో బొంబాయిలో కార్మికులు సమ్మె వ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా నడిపిన పోరాటం వంటి సందర్భాలలో ఇది జరిగింది. ఆయన ఇండిపెండెంట్ లేబర్ పార్టీ నిర్మాత. ఈ పార్టీ అఖిలభారత స్థాయిలో వేళ్ళూనుకొనలేకపోయినప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలకు ప్రయోజనకరమైన రాజకీయ, సిద్ధాంత, నిర్మాణ పరమైన గుణపాఠాలను అందించింది.

అంబేద్కర్ రాజ్యాంగ సభలో, రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన కమిటీకి అధ్యక్షత వహించి, ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని కేంద్రకేబినెట్‌లో కొంతకాలం ఉండినప్పటికీ, భారత రాజకీయాలలో కాంగ్రెసేతర, కాంగ్రెస్ వ్యతిరేక భావధారకు ఆయననే ఆద్యుడిగా పరిగణించవచ్చు. ఒకవంక సామాజిక సమానత్వం, పౌరస్వేచ్ఛల కోసం ముందు పీటీన నిలబడి వత్తాసు పలుకుతూ, బడావ్యాపార వేత్తలు, భూస్వాముల పెత్తనాన్ని విమర్శిస్తూ, సామాజిక, ఆర్థికహక్కుల కోసం, ప్రజా స్వామ్యం కోసం ఉద్యమిస్తూనే, ఆయన మరోవైపు మార్క్సిజం లెనినిజానికి, కమ్యూని జానికి

> **❝ అంబేద్కర్ వారసత్వాన్ని స్వంతం చేసుకోవడానికై హిందూత్వవాదులు చరిత్రసారాన్ని వక్రీకరించి మరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో కుల వ్యవస్థపైనా, చాతుర్వర్ణ, సనాతన ధర్మాలపైనా, అంటరానితనాన్ని మార్పులేకుండా యథా తథంగా నిలిపి ఉంచే సామాజిక దొంతరలపైనా హిందూ ధర్మ శాస్త్రాల అధిపత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, వీటిపై రాజీకితావు లేకుండా సాగే ఆయన విశ్లేషణలను తప్పనిసరిగా చదవాలి. ❞**

చైతన్యపూరిత సిద్ధాంత, రాజకీయ ప్రత్యర్థిగానే ఉండిపోయాడు.

కాశ్మీరు, జాతీయత, భాషలు, పౌరసత్వం, జాతి మొదలయిన సంక్లిష్టమైన, చిక్కుముడులతో కూడుకొని ఉన్న జాతీయ సమస్యలపై ఆయన పలు ఆసక్తికరమైన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. భారతదేశంలో సహకార పూరిత ఫెడరలిజం, కేంద్ర రాష్ట్ర సంబంధాల విషయంలో ఆయన విశ్లేషణ ఆ రంగంలో ఒక సముచితమైన ప్రజాస్వామిక అవగాహనకు వెలుగుబాటను వేసింది. ఇక అంతర్జాతీయ సమస్యలపైన, విదేశాంగ విధానంపైన, ఆయన అలీనవాదం నుండి, నెహ్రూ భావజాలం నుండి, వామపక్ష ప్రాపంచిన దృక్పథం నుండి విభేదించే వైఖరిని తీసుకున్నారు.

ఆయన నాయకత్వంలో నడిచిన ఒక సమూహపు సామాజిక వర్గ పునాది, సమాజాన్ని గురించి ఆయన లేవనెత్తిన ప్రశ్నల తీవ్రవాద స్వభావము, ఆధునిక, శాస్త్రీయ హేతుబద్ధ భావాలను స్వీకరించడానికి ఆయన సంసిద్ధత, ఆయన ధృడమైన లౌకికవాదం, అనేక సమస్యలపట్ల, ప్రత్యేకించి మహిళల పరిస్థితి, భవిష్యత్తుపైనా, ఒక నాగరిక సమాజ నిర్మాణానికి కావాల్సిన దేమిటి వంటి సమస్యలపై ఆయునకు పురోగామి భావాలున్నాయి. అమోఘమైన ఆయన మేధాసంపత్తి, నిరంతర అన్వేషణాశీలత, విస్తృత రంగాలలో అభివృద్ధి కరమైన భావాలు, సాధించగల్గిన, ఆచరణాత్మక మైన లక్ష్యాలపై కేంద్రీకరించగలిగిన ఆయన సమర్ధత, వాస్తవాల పట్ల ఆయన నిర్మాణాత్మక దృష్టి, ఈ లక్షణాలు ఆయనను ఒక అసమాన నాయకునిగా నిలబెట్టాయి.

హిందూ మితవాదం, రాజకీయంగా, సామాజికంగా బాగా పైచేయి సాధించడం, మెజారిటీ మత మౌఢ్యం, సామాజిక అభివృద్ధి నిరోధకత్వాలు సాగిస్తోన్న రాజకీయ, సిద్ధాంత ఎదురుదాడి ప్రస్తుత దేశ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అంబేద్కర్ వారసత్వాన్ని స్వంతం చేసుకోవడానికై హిందూత్వవాదులు చరిత్రసారాన్ని వక్రీకరించి మరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో కులవ్యవస్థపైనా, చాతుర్వర్ణ, సనాతన ధర్మాలపైనా, అంటరానితనాన్ని మార్పులేకుండా యధాతథంగా నిలిపి ఉంచే సామాజిక దొంతరలపైనా హిందూ ధర్మశాస్త్రాల అధిపత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు, వీటిపై రాజీకి తావులేకుండా సాగే ఆయన విశ్లేషణలను తప్పనిసరిగా చదవాలి. పదేపదే అధ్యయనం చేయాలి. దేశవ్యాప్త వాదోపవాదాలలో అంతర్భాగం చేయాలి. ఈ పైన పేర్కొన్న సమస్యలపై ఆయన చేసిన ప్రముఖ సిద్ధాంత విశ్లేషణ 1936లో ఆయన చేసిన అధ్యక్షోపన్యాసంలో భాగమే. అది పెద్ద ఎత్తున వాదోపవాదాలకు, "కులానిర్మూలన" అనే ఆయన రచనకూ దారితీసింది. రచయిత అరుంధతీ రాయ్ ఇటీవలనే ఈ కులనిర్మూలనకు సుదీర్ఘమైన తన పరిచయ వ్యాసంలో తాజా భాష్యాన్ని, సమయ సందర్భాలను వివరించారు. రిపబ్లికన్ రాజ్యాంగ రూపకల్పనలో బాబా సాహెబ్ గారి అమోఘమైనట్టి, ధర్మబద్ధంగా కీర్తింపబడినట్టి కృషితో సమానస్థాయిలోనే ఆయన భారత నిర్మాణానికి చేసిన మేధోపరమైన కృషిని కూడా తప్పనిసరిగా గుర్తించాలి.

ఈ రచనలో అంబేద్కర్ అధర్మపూరితమైన ఈ సామాజిక వ్యవస్థయొక్క సమాజవ్యతిరేక, ప్రగతి నిరోధక స్వభావాన్ని, అలాగే దాని బలప్రయోగానికి, సిద్ధాంతానికి, రాజకీయ అధికార బలానికి ఉన్న అనుసంధానాన్ని బయటపెట్టాడు. ఆయన విశ్లేషణ ప్రకారం కులవ్యవస్థ సౌభ్రాతృత్వానికి వ్యతిరేకంగా ఉంటుంది. సంఘటితమవ్వడం, పరస్పర సహకారాన్ని అందించుకోవడం, దాతృత్వ భావనకు దారితీస్తుంది. విశాల ప్రాతిపదికగల నీతి, నైతిక ధృతులను సంభవాలుగా చేస్తుంది. కులపునాదిగా ఉన్న వ్యవస్థ స్థానంలో ఆయన చెప్పే "ఆదర్శ సమాజం" గురించి స్పష్టం చేయాలని ఆయన విమర్శకులు చేసిన సవాలుకు ఆయన ఇలా బదులిచ్చారు. ''స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రా తృత్వం పునాదిగా ఉండే సమాజమే నా ఆదర్శం." తన ఆదర్శ సమాజం చలనశీల మైనదని, సామాజిక సమానత్వం ఉంటుందని ఆయన నొక్కి చెప్పారు. సౌభ్రాతృత్వం ప్రజా స్వామానికి మరో పేరు తప్ప మరేమీకాదని, ప్రజాస్వామ్యం అంటే ప్రాథమికంగా కలగలిసి జీవించే ఒక విధానం, సరస్పరం అంది పుచ్చు కునే అనుభవాన్ని సంధానించి, తోటి మానవుల పట్ల గౌరవాభిమానాలు చూపే వైఖరిని పెంచి పోషించే ఒక విధానం అని అన్నారు.

ప్లాటో యొక్క రిపబ్లిక్ ఏకారణం వల్ల వైఫల్యాన్ని ఎదుర్కొందో, సరిగ్గా అదే కారణం మూలంగానే "చాతుర్వర్ణ వ్యవస్థ" తప్పని సరిగా వైఫల్యాన్ని ఎదుర్కొంటుంది అని సామాజిక తిరుగుబాటు దారుడైన, ఈ పీడిత వర్గ మేధావి హెచ్చరించారు. ఈ దుర్మార్గ వ్యవస్థ మూలంగా హిందువులలోని దిగువ వర్గాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులుగా చేయబడ్డారు అని ఆయన వేలెత్తిచూపారు. ''ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదు" అని చెప్పారు. ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వకుండా కుంటుపరిచి, వారిని నిస్సహాయులుగా, చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు. ఆయన సామాజిక, ఆర్థిక, ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయరంగంలో కలుగచేసే ప్రభావాలపై దృష్టి సారించి కృషిచేశారు. ధర్మశాస్త్రాల అనుంఘల్లనీయతపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం, వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేద్కర్ భావించారు.

ఇటువంటి విషయాలలో రాజీపడేవాడుగా పేరుమోసిన గాంధీ, అర్ధ శతాబ్దికి ముందే, "డాక్టర్ అంబేద్కర్ హిందూమతానికి ఓ సవాలు" అని ప్రకటించడంటే అందులో ఆశ్చర్య మేమీలేదు. ఆయన ఈనాటికీ ఒక సవాలుగానే నిలిచిఉన్నారు. అందువల్లనే హిందూత్వవాదులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమికి చెందిన కొన్ని శక్తులు నేడు ఆయనను నిర్లక్ష్యం చేయలేని స్థితిలో ఉన్నాయి.

సామాజిక పురోగతిని నిరోధించటానికి పూనుకున్నవారిని వ్యతిరేకిస్తూ, సామాజిక ఛాందసవాదం, అవకాశవాద రాజకీయాలపై సాగించిన యుద్ధాలు 1940 దశకం చివరినాళ్ళు, 1950 దశకం తొలినాళ్ళలో హిందూకోడ్ బిల్లుపై సాగించిన పోరాటం,

రాజ్యాంగ రూపకర్తలలో ఒక ముఖ్యుడై, ప్రగతిశీలకంగానూ, సమానత్వం ప్రాతిపదికన ఉండి, హిందూకోడ్ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలకు నాయకత్వం వహించాడు. కాని ఛాందసవాదశక్తులు ఈ ప్రయత్నానికి వెన్నుపోటు పొడిచాయి. హేతువాది, ప్రగతి కాముకుడిని అని చెప్పుకొనే నెహ్రూ ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడానికి నిరాకరించింది. పురోగామి దృష్టిగల ఈ చట్టానికి నీళ్ళొదలటం అంటే, అటువంటి కీలక సమస్యలపై అంబేద్కర్ దృక్పధానికి ద్రోహం చేయడమే.

రాజ్యాంగ రూప కల్పనలోనూ, సంస్థల నిర్మాణంలోను ఆయన ఘనమైన కృషి అలా ఉండగా, ఒక నిజమైన జీవన విధానంగా ప్రజాస్వామ్యం గురించి, పౌర హక్కుల గురించి, నిరంకుశ ధోరణుల గురించి, అంతేకాక ఆరోగ్యవంతమైన ప్రజాస్వామిక, రాజకీయ వ్యవస్థ గురించి కూడా ఆయన ఎంతో విలువైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. "వారసత్వం, వంశపారంపర్య పాలననూ, ఏకపార్టీ వ్యవస్థను ఆయన ద్వేషించారు" ఒకే పార్టీ ప్రజామోదమైన ప్రభుత్వాన్ని నడపటం అంటే, నిరంకుశత్వం తెరవెనుక నుండి పాలన సాగించే ఒక రూపంగా ప్రజాస్వామ్యం తయారవ్వడాన్ని అనుమతించడమే అన్నది అంబేద్కర్ ప్రముఖ సూత్రీకరణల్లో ఒకటి. "నిరంకుశత్వం ఎన్నికయినదయినప్పటికీ, అది నిరంకుశత్వం కాకమానదు. నిరంకుశత్వం కూలదోయబడే అవకాశం ఉండటం, దానినితోక ముడిచేటట్లు చేయగల అవకాశం ఉండటం, దాని ప్రత్యర్థిపార్టీ దాని స్థానంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉండటమే నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిజమైన గ్యారంటీ" అని ఆయన హెచ్చరించారు. ఏకపార్టీ పాలన ప్రాతిపదికన గాని, లేదా "నిద్రపోయే హక్కులని నిద్రపోనీ" అనే సామాజికతత్వ ప్రాతిపదికగా కాని ఉండే రాజకీయ సుస్థిరత అంబేద్కర్ గిట్టని విషయం.

> **"అంబేద్కర్ దూరదృష్టితో వెలిబుచ్చిన రాజకీయ భావాలలో రెండు నేటి కాలానికీ వర్తిస్తాయి. "రాజకీయ స్వేచ్ఛలను ఒక గొప్పవ్యక్తి పాదాల క్రింద ఉండనివ్వకండి," "రాజకీయా లలో భక్తి లేదా వీరాధన అంటే అథోపతనానికి దారి" అని చెప్పారు. రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దండి. వైరుధ్యాలను పరిష్కరించండి, లేకపోతే అవి ప్రజాస్వామ్య పునాదుల్ని నాశనం చేస్తాయి". అని గొప్పగా శెలవిచ్చారు అంబేద్కర్."**

అంబేద్కర్ దూరదృష్టితో వెలిబుచ్చిన రాజకీయ భావాలలో రెండు నేటి కాలానికీ వర్తిస్తాయి. "రాజకీయ స్వేచ్ఛలను ఒక గొప్పవ్యక్తి పాదాల క్రింద ఉండనివ్వకండి," "రాజకీయాలలో భక్తి లేదా వీరాధన అంటే అథోపతనానికి దారి" అని చెప్పారు. రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దండి. వైరుధ్యాలను పరిష్కరించండి, లేకపోతే అవి ప్రజాస్వామ్య పునాదుల్ని నాశనం చేస్తాయి". అని గొప్పగా శెలవిచ్చారు అంబేద్కర్.

**(అనువాదం. యల్.యన్. భారవి)**

# ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతి కోసం ఉద్యమించాలి

(11వ పేజీ తరువాయి)

కాదు. దాన్ని సృష్టించుకోవాలి.

రాబోయే కాలంలో నిరుద్యోగం విపరీతంగా పెరగబోతోంది. కంప్యూటర్ ఉద్యోగాలు వస్తాయి అని యువ ఇంజనీర్లు ఆశగా ఎదురు చూస్తుంటే నాస్‌కాం 16 శాతం ఉద్యోగాలు పడిపోతాయని ప్రకటించింది. ఇప్పటికే చాల కంపెనీల్లో రిట్రెంచ్‌మెంట్లు చేసేస్తున్నారు. 25 వేల ఉద్యోగులను తొలగించి 5 వేల కొత్త ఉద్యోగాలు మాత్రమే ఇస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరుద్యోగంవల్ల యువకుల్లో నిస్పృహ వస్తుంది. దానికి నమూనానే మోడీ వేవ్, ఢిల్లీలో కేజ్రీవాల్ వేవ్ వచ్చాయి. ఇది శాశ్వతం అనుకుంటే పొరబాటు. ఈ తరంలో ఉన్న ముఖ్యమైన లక్షణం ఏమిటంటే తక్షణ ఫలితాలను కోరుతున్నారు. వెంటనే మాకు ఫలితం కావాలి. ఎక్కడకు పోయినా అంతేకదా. ఇంతకుముందు కేథలాబ్‌కు వెళ్ళి బ్లడ్ ఇచ్చి వచ్చేవాళ్లమనుకోండి. మూడు రోజుల తరువాత రమ్మంటారు. ఈ రోజుల్లో కంప్యూటర్ ద్వారా గంటలో అయిపోతోంది. ఆ ప్రభావం యువకులపైన కూడా ఉంటుంది. అందుకని ఏడాదిలో రెండేళ్లలో వారు అనుకున్నది నెరవేర్చకపోతే, మోడీనీ, క్రేజీవాల్‌ను ఎంత ఎత్తుకు లేపారో అంత ఎత్తునుంచీ పడేస్తారు.

అప్పుడు ప్రజలకు ఒక రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం అవుతుంది. కేజ్రీవాల్ కొత్త ట్రెండ్‌ను సృష్టించాడు. క్షేత్రస్థాయిలో ప్రజలను కదిలించి వారిలో పనిచేశాడు. అవినీతిలేని రాజ్యాన్ని అందిస్తానన్నాడు. ఆశయం మంచిదే. అతడు నిజాయితీపరుడే. కానీ ప్రభుత్వ అధికారాలు చాలా తక్కువగా ఉన్న ఢిల్లీ వంటి చోట అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందా? సాధ్యం కానప్పుడు యువకులు ఎలా ఆలోచిస్తారు? ఆయనను ప్రశ్నిస్తే సమాధానం ఏమని చెబుతారు? రాబోయే కాలంలో ఇలాంటి ప్రశ్నలకు మోడీ అయినా, కేజ్రీవాల్ అయినా సమాధానాలు చెప్పాలి. రాబోయే కాలంలో ఓ రాజకీయ శూన్యత కూడా ఏర్పడబోతోంది. దీన్ని భర్తీ చేయడంపైనే భారతదేశ, ఆంధ్రరాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.


కొత్త రాజకీయ సంస్కృతిని కమ్యూనిస్టు పార్టీ ప్రజల ముందుకు తీసుకువచ్చి జాతి వికాసం కోసం, భాషా వికాసం కోసం, సామాజిక న్యాయం కోసం, సామాజిక వికాసం కోసం, సామాజిక మార్పు కోసం పోరాడేందుకు ఈ తరాన్ని ముందుకు నడిపించాలి. 1950ల్లో ఏ చరిత్రనయితే సృష్టించి మొత్తం ఆంధ్రదేశాన్ని ప్రభావితం చేసి, అధికారంలో లేకపోయినా ఒక ట్రెండ్‌ను సృష్టించిందో ఆ విధంగానే రాబోయే కాలంలో కూడా మరలా ఒక కొత్త ట్రెండ్‌ను సృష్టించడానికి కమ్యూనిస్టు ఉద్యమం పూనుకోవాలి.

**(ఈ ఉపన్యాసాన్ని వ్యాసరూపంలో రాసినవారు: యు.రామకృష్ణ)**

**విశ్లేషణ**

# ఈనాటికీ తరగని మార్క్స్ ప్రాధాన్యత

**ఎరిక్ హాబ్స్‌బామ్**



రచయిత ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు

**2007**లో లండన్‌లో యూదుల పుస్తక వారోత్సవం జరుగుతున్నది. అప్పటికి కారల్ మార్క్స్ వర్ధంతి (మార్చి14) మరి రెండు వారాలుంది. పుస్తక వారోత్సవం జరుగుతున్నది కూడా లండన్‌లో మార్క్స్‌తో బాగా ముడిపడిన బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీలోని వలయాకారపు పఠన మందిరం సమీపంలో. జాక్స్ అట్టాలీ, నేనూ ఆయనకు జోహార్లర్పించేందుకు అక్కడకు చేరాం. మేమిద్దరం చాలా భిన్నమైన తరహాలకు చెందిన సోషలిస్టులం. అయితే మీరు ఆ తేదీని సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే ఇది ఒకటికి రెండు రెట్లు ఊహించని విషయంగా కనిపిస్తుంది. 1883లో మార్క్స్ విఫలజీవిగా మరణించాడని ఎవరూ చెప్పడానికి లేదు. ఎందుకంటే ఆయన రచనలు అప్పటికే జర్మనీపై, మరీ ముఖ్యంగా రష్యాలోని మేధావులపై ప్రభావం చూపడం ప్రారంభమైంది. ఆయన శిష్యుల నాయకత్వంలో జర్మన్ కార్మికోద్యమాన్ని చేజిక్కించుకునేందుకు అప్పటికే ఒక ఉద్యమం నడుస్తున్నది. అయితే 1883 నాటికి ఆయన జీవిత కాలపు కృషిని చూపించేందుకు చాలా స్వల్పమే ఉంది. ఆయన కొన్ని ప్రతిభావంతమైన కరపత్రాలు రాశారు. అసంపూర్ణ ప్రధాన రచన దాస్ కాపిటల్ మొండెంలా ఉంది. ఆయన జీవితపు చివరి దశాబ్దంలో దానికి సంబంధించిన పని చాలా మందకొడిగా సాగింది. ఒక సందర్శకుడు ఆయనను తన రచనల గురించి ప్రశ్నించినపుడు ‘ ఏ రచనలు?’ అని మార్క్స్ కొంచెం నిష్టూరంగా స్పందించాడు. 1848 విప్లవ వైఫల్యం తర్వాత 1864-73 మొదటి ఇంటర్నేషనల్ అనబడేదాని కోసం ఆయన ప్రధానంగా జరిపిన రాజకీయ కృషి ఫలించలేదు. ఆయన తన ప్రవాస జీవితంలో సగానికి పైగా బ్రిటన్‌లోనే గడిపాడు గాని అక్కడి రాజకీయ మేధాజీవితంలో ఎలాటి ప్రముఖ స్థానం పొందలేకపోయాడు.

ఇవన్నీ నిజమే. కాని ఆయన మరణానంతరం సాధించిన విజయాలు ఎంత మహత్తరమైనవి! తన మరణం తర్వాత పాతికేళ్లలోనే యూరోపియన్ కార్మిక వర్గం ఆయన పేరిట రాజకీయ పార్టీలు స్థాపించుకుంది. పేరు మరొకటైనా సరే తాము మార్క్స్ నుంచి ఉత్తేజం పొందినట్లు ప్రకటించుకున్నవి ఉన్నాయి. ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగే దేశాలలో ఈ పార్టీలకు 15 నుంచి 47 శాతం వరకూ ఓట్లు వచ్చాయి. ఇందుకు బ్రిటన్ ఒక్కటే మినహాయింపు. 1918 తర్వాత ఈ పార్టీలలో అనేకం ప్రతిపక్షాలుగా ఉండటమే గాక అధికారంలోకి కూడా వచ్చాయి. ఫాసిజం తర్వాత కూడా వీటిలో అధిక భాగం అలాగే ఉన్నాయి. కాకుంటే తమకు మూల స్ఫూర్తి ఎవరనే విషయంలో అది వరకు చెప్పిందాన్ని వదులుకున్నాయి. ఆ పార్టీలన్నీ ఇప్పటికీ ఉనికిలో ఉన్నాయి. ఈ లోగా మార్క్స్ శిష్యులు తృతీయ ప్రపంచంలోని ప్రజాస్వామ్యేతర దేశాలలో విప్లవ బృందాలను ఏర్పరచారు. మార్క్స్ మరణానంతరం 70 ఏళ్లకు కూడా మానవ జాతిలో మూడో వంతు ఆయన భావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పే పార్టీల నాయకత్వంలోనే పాలించబడుతున్నాయి. ఆయన ఆకాంక్షలు నిజం చేస్తామని చెబుతున్నవి ఇప్పటికీ 20 శాతం ఉన్నాయి. కాకపోతేకొన్ని స్వల్ప మినహాయింపులున్నా ఆ దేశాల నాయకులు విధానాలను నాటకీయంగా మార్చేసుకున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే 20వ శతాబ్దంపై చెరిగిపోని ప్రధాన ముద్ర వేసిన ఒక ఆలోచనాపరుడు ఎవరైనా ఉన్నారంటే అది ఆయనే. ఇప్పుడు హై గేట్ శ్మశాన వాటికలోకి పదండి. అక్కడ పంధొమ్మిదవ శతాబ్దపు మార్క్స్‌నూ, హెర్బర్ట్ స్పెన్సర్‌నూ సమాధి చేశారు. చాలా విచిత్రంగా అవి దగ్గరదగ్గరగా ఉంటాయి. ఈ ఇద్దరూ బతికి వున్న కాలంలోకి వెళ్తే స్పెన్సర్‌ను తన కాలపు అరిస్టాటిల్ అన్నారు. కారల్ మార్క్స్ తన స్నేహితుడి డబ్బులతో హాంప్‌స్టెడ్ పల్లపు ప్రాంతాల్లో బతకాల్సి వచ్చింది. ఈ రోజున స్పెన్సర్ సమాధి ఎక్కడుందో కూడా ఎవరికీ తెలియదు. కాని జపాన్, ఇండియా వంటి దేశాల నుంచి వయోధికులైన పర్యాటకులు వచ్చి కారల్ మార్క్స్ సమాధిని సందర్శించి వెళుతుంటారు. బ్రిటన్‌లో ప్రవాస జీవితం గడిపి మరణించే ఇరాకీ, ఇరానీ కమ్యూనిస్టులు మరణానంతరం తమ దేహాలను మార్క్స్ సమాధి పక్కనే ఖననం చేయాలని గట్టిగా చెబుతుంటారు.

సోవియట్ యూనియన్ పతనంతో కమ్యూనిస్టు ప్రభుత్వాలూ, ప్రజా బాహుళ్య కమ్యూనిస్టుపార్టీల శకం అంతరించింది. చైనా, ఇండియా వంటి చోట్ల ఆ పార్టీలు మనుగడ సాగిస్తున్నా పాత లెనినిస్టు తరహా మార్క్సిజాన్ని వదలిపెట్టాయి. అది పతనమైనపుడు కారల్ మార్క్స్ మరోసారి నిర్జన ప్రదేశంలో మిగిలిపోయినట్టయింది. కమ్యూనిజం ఒక్కటే ఆయనకు నిజమైన వారసురాలుగా చెప్పబడింది. ఆయన భావాలు దానితోనే అధికారికంగా గుర్తించబడ్డాయి. 1956లో కృశ్చేవ్ నాయకత్వం స్టాలిన్‌ను తెగనాడిన తర్వాత కూడా అక్కడా ఇక్కడా చోటు సంపాదించుకున్న అసమ్మతివాద మార్క్సిస్టులు లేదా మార్క్సిస్టు లెనినిస్టులు కూడా దాదాపుగా మాజీ కమ్యూనిస్టుల నుంచి విడిపోయినవారే. కాబట్టి ఆయన శతవర్ధంతి తర్వాత మొదటి ఇరవయ్యేళ్లలోనూ ఆయన దాదాపుగా గత కాలపు వ్యక్తిగా మారిపోయాడు. తన గురించి పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదనే భావం వచ్చింది. ఈ రోజు రాత్రి జరుగుతున్న ఈచర్చ మార్క్స్‌ను ‘చరిత్ర చెత్తబుట్ట’ నుంచి పైకి లేపే ప్రయత్నమని

> ❝ 2008 అక్టోబరులో లండన్ ఫైనాన్షియల్ టైమ్స్ ' 'కంపిస్తున్నపెట్టుబడిదారీ విధానం' అనే పతాక శీర్షికనిచ్చింది. ప్రజా రంగంలో మార్క్స్ పునరాగమనం గురించి ఇంకా ఏమైనా సందేహాలుంటే దాంతో పటాపంచలై పోయి నట్టే. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం 1930ల తర్వాత ఎన్నడూ లేనంత ఘోర మైన విచ్ఛిన్నాన్ని ఎదుర్కొంటుంటే ఆయన దాన్నుంచి నిష్క్రమించ డమనే ప్రసక్తి ఉండదు. ❞

కూడా వ్యాఖ్యానించారు. అయినా సరే ఈ రోజున మార్క్స్ మరోసారి తన ప్రాధా న్యత నిలుపుకోగలిగాడు. 21వ శతాబ్దపు ఆలోచనా పరుడుగా ముందుకొచ్చాడు.

బిబిసి పోలింగులో బ్రిటిష్ రేడియో శ్రోతలు ఆయనను చరిత్రలోనే అతి గొప్ప తత్వవేత్తగా ఎన్నుకున్నారనే వార్తలకు ఏమంత గొప్ప ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదని నేననుకుం టాను. కాని మీరు గనక గూగుల్‌లో ఆయన పేరు కొడితే ఆయన మహత్తర మేధావంతుల కోవలో ఉంటాడు. డార్విన్, ఐన్‌స్టీన్ మాత్రమే ఆయన కన్నా ముందుంటారు. కాని మార్క్స్ ఆడం స్మిత్, ఫ్రాయిడ్‌ల కన్నా పైనే ఉంటాడు.

నా ఉద్దేశంలో ఇందుకు రెండు కారణాలు న్నాయి. మొదటిది సోవియట్ యూనియన్‌లో అధికార మార్క్సిజం ముగిసిపోవడం వల్ల మార్క్సును లెనినిజంతో కలిపి చూడవలసిన అవసరం లేకుండా పోయింది. లెనినిస్టు ప్రభుత్వాల ఆచరణ విధానంగా చూసే అవకాశమూ లేదు. ప్రపంచం గురించి మార్క్స్ చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకోవ డానికి ఇంకా అనేకానేక కారణాలున్నా యనేది బాగా స్పష్టమై పోయింది. మరొక కారణం కూడా ఉంది. బహుశా రెండవ కారణం ఇదే. 1990లలో ప్రపంచీ కరణ తర్వాత రూపుదాల్చిన పెట్టుబడిదారీ ప్రపంచం అనేక కీలకమైన విషయాలలో మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన దాన్ని పోలివుంది. 1998లో ఆ చిన్న కరపత్రం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచమంతటా వ్యక్తమైన ప్రతిస్పందన ఈ విషయాన్ని తేటతెల్లం చేసింది. యాదృచ్ఛికంగా ఆ ఏడాది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నాటకీయమైన కుదుపునకు గురైంది. చాలా విచిత్రమేమంటే ఈ సారి మార్క్సును గురించి కనుగొన్నది సోషలిస్టులు కాదు– క్యాపిటలిస్టులే! ఈ వార్షికోత్సవం జరపడానికి సోషలిస్టులు చాలా నిరుత్సాహంలో మునిగివున్నారు. యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమాన పత్రిక సంపాదకుడు నా వ్యాసం కావాలని అడిగినప్పుడు చాలా ఆశ్చర్యపోయిన సంగతి నాకు గుర్తుకు వస్తుంది. బహుశా ఆ విమాన ప్రయాణీకులలో నూటికి 80 మంది అమెరికన్లయి ఉంటారు. ఆ పాఠకులకు కమ్యూనిస్టు ప్రణాళిక గురించిన చర్చ ఆసక్తి కలిగిస్తుందని ఆయన భావించి ఉంటాడు. నా వ్యాసంలో ఏదైనా ఉపయోగించుకోవచ్చని భావించాడేమో. ఈ శతాబ్ది ముగింపు సమయంలో ఎప్పుడో ఒక విందులో మార్క్స్ గురించి నేను ఏమనుకుంటు న్నానని




ప్రపంచ కుబేరుడు జార్జ్ సోరోస్

జార్జిసోరెస్ అడగడం మరింత ఆశ్చర్యపోయేలా చేసింది. మా ఇద్దరి అభిప్రాయాల మధ్య ఎంత తేడా ఉంటుందో నాకు బాగా తెలుసు గనక అస్పష్టమైన సమాధానం ఇచ్చాను.' ఈ మనిషి పెట్టుబడిదారీ విధానం ఎలాటిదో నూట యాభై ఏళ్ల కిందటే కనిపెట్టాడని మనం గమనంలో ఉంచుకోవాలి' అని సోరెస్ అన్నాడు. నిజంగానే ఆయన ఆ పని చేశాడు. ఆ తర్వాత కొద్ది కాలానికే చాలా మంది రచయితలు కనీసం నాకు తెలిసినంతవరకూ వారెవరూ కమ్యూనిస్టులు కాదు– మార్క్సును మరోసారి నిశితంగా చదవడం మొదలుపెట్టారు. జేక్స్ అతాలీ మార్క్స్ జీవితంపైన, రచనలపైన కొత్తగా వెలువరించిన పుస్తకం అలాంటిదే. ఈ ప్రపంచం ఇప్పుడున్న దానికంటే మెరుగ్గా ఉండాలని కోరుకునేవారందరికీ మార్క్స్ చాలానే వదలివెళ్లాడని అట్టాలీ కూడా అభిప్రాయపడ్డాడు. ఈ కోణం నుంచి చూసినా ఈ రోజున మనం మార్క్సును పరిగణనలోకి తీసుకోకతప్పదు.

2008 అక్టోబరులో లండన్ ఫైనాన్షియల్ టైమ్స్ ' 'కంపిస్తున్నపెట్టుబడిదారీ విధానం' అనే పతాక శీర్షికనిచ్చింది. ప్రజా రంగంలో మార్క్స్ పునరాగమనం గురించి ఇంకా ఏమైనా సందేహాలుంటే దాంతో పటాపంచలై పోయి నట్టే. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం 1930ల తర్వాత ఎన్నడూ లేనంత ఘోరమైన విచ్ఛిన్నాన్ని ఎదుర్కొంటుంటే ఆయన దాన్నుంచి నిష్క్రమించ డమనే ప్రసక్తి ఉండదు. మరో వైపున చూస్తే 21వ శతాబ్ది మార్క్స్ 20 వ శతాబ్ది నాటి మార్క్స్ కన్నా చాలా భిన్నంగా ఉండటం తథ్యం.

గత శతాబ్దిలో ప్రజలు మార్క్స్ గురించి ఆలోచించడానికి మూడు వాస్తవాలు ప్రాతిపదిక అయ్యాయి. మొదటిది – విప్లవం ఎజెండాలోకి వచ్చిన దేశాలకు, రాని దేశాలకు మధ్యన ఒక తేడా. స్థూలంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన ఉత్తర అట్లాంటిక్, పసిఫిక్ ప్రాంతాలు, తక్కినవీ. ఇక రెండవ వాస్తవం మొదటి దాన్నుంచే ఉత్పన్నం అవుతుంది: మార్క్స్ వారసత్వం సహజంగానే సోషల్ డెమొక్రటిక్ సంస్కరణ వాద వారసత్వం గానూ, విప్లవ వారసత్వంగానూ విడి పోయింది. ఈ రెండవ తరహాలో రష్యా విప్లవం అత్యధిక ప్రాబల్యం వహిం చింది. 1917 తర్వాత ఇది మరింత స్పష్టం కావడానికి ఇప్పుడు చెప్పే మూడవ కారణం దారితీసింది: పందొమ్మిదవ శతాబ్ది పెట్టుబడి దారీ విధానం, బూర్జువా సమాజం కుప్ప కూలాయి. దీన్నే నేను 'ప్రళయాంతక యుగం' అని పిలిచాను. ఇది 1914–1940ల మధ్య దశ. ఈ సంక్షోభం ఎంత తీవ్రమైనదంటే అనేక మంది అసలు పెట్టుబడిదారీ విధానం మళ్లీ కోలుకుంటుందా అని సందేహంలో పడ్డారు. ఎంత మాత్రం మార్క్సిస్టు కాని జోసెఫ్ ష్కింప్టర్ కూడా 1940లలో ఈ వ్యవస్థ స్థానంలో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ వచ్చేస్తుందని జోస్యం చెప్పలేదా? వాస్తవంలో పెట్టుబడిదారీ విధానం తిరిగికోలుకున్నది. కాని పాతరూపంలో కాదు. అదే సమయంలో సోవియట్ యూనియన్‌లో ఒక సోషలిస్టు ప్రత్యామ్నాయం ప్రత్యక్షమై దుర్భేద్యంగా గోచరించింది. 1929–1960 మధ్య కాలంలో అలా భావించడం నిర్హేతుకంగా కనిపించలేదు. ఆ ప్రభుత్వాల రాజకీయాలతో ఏకీభవించని అనేక మంది సోషలిస్టేతరులకు

> **❝ పెట్టుబడిదారీ విధానపు గజిబిజి అధిక ఉత్పత్తికి సంబంధించి నిర్ణీత కాలంలో సంక్షోభాలు తీసుకొస్తుందని ఆయన చెప్పాడు. ఇవి కాస్త ముందో వెనకో ఇక పెట్టుబడిదారీ విధానంలో ఆర్థిక వ్యవస్థను నడపలేని స్థితిని తీసుకువస్తాయనీ, అది పరిష్కరించలేని సామాజిక ఘర్షణలు తలెత్తడానికి కారణమవు తాయని పేర్కొన్నాడు. ❞**


మార్క్స్, ఏంగెల్స్

కూడా పెట్టుబడిదారీ విధానపు సరుకు అయిపోతున్నదనీ సోవియట్ యూనియన్ అంతకన్నా అధిక ఉత్పత్తి సాధించవచ్చునని అనిపించింది. స్పుత్నిక్‌ను ప్రయోగించే సంవత్సరంలో ఇదేమీ అర్థరహితంగా కనిపించలేదు. 1960 తర్వాత అందులోని అసంబద్ధత బాగా తెలిసిపోయింది.

ఈ సంఘటనలు, వాటి పర్యవసానాలు చాలా ప్రభావం చూపించాయి. మార్క్స్ ఎంగెల్సుల మరణానంతర కాలపు సిద్ధాంతం ఆచరణలకు సంబంధించి ఆ ప్రభావం చూడవలసి ఉంటుంది. మార్క్స్ స్వీయానుభవాలు అంచనాల పరిధిని దాటి ఉండే విషయాలవి. 20వ శతాబ్దపు మార్క్సిజంపై మన తీర్పు మార్క్స్ తనుగా ఏమనుకున్నాడనే దానిపై ఆధారపడి ఉండదు. ఆయన రచనలకు మరణానంతర భాష్యాలు ఏమిటనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఒక విషయం మాత్రం మనం ఖచ్చితంగా చెప్పొచ్చు. 1890లలో మొదటి సారి మార్క్సిజం మేధోపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. వారు మొదటి తరం మార్క్సిస్టులు. ఆయనతో, అంతకంటే కూడా ఫ్రెడరిక్ ఎంగెల్సుతో వ్యక్తిగత సంబంధం గలవారు. ఇరవయ్యవ శతాబ్దంలో ముందుకు వచ్చిన కొన్ని సమస్యలను గురించి మరీ ముఖ్యంగా రివిజనిజం, సామ్రాజ్యవాదం, జాతీయవాదం వంటి వాటి గురించి చర్చించడం మొదలు పెట్టారు. తర్వాతి కాలంలో జరిగిన మార్క్సిస్టు చర్చలో చాలా భాగం ఇరవయ్యవ శతాబ్దికి నిర్దిష్టంగా వర్తించేది. కారల్ మార్క్స్‌లో అది కనిపించదు. ముఖ్యంగా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంటుంది ఎలా ఉండాలి అనే సంవాదం. అది 1914-18 యుద్ధ ఆర్థిక వ్యవస్థల అనుభవం నుంచి, యుద్ధానంతర కాలంలో ముందుకొచ్చిన విప్లవ తరహా లేక విప్లవ సంక్షోభాల నుంచి ప్రధానంగా రూపు దాల్చింది.

ఆ విధంగా చూస్తే సోషలిజం ఒక వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానం కన్నా శ్రేష్టమైందనీ, ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని అత్యంత వేగవంతం చేస్తుందని చెప్పుకోవడం మార్క్స్ నుంచి ఎంత మాత్రం జరిగివుండేది కాదు. యుద్ధాల మధ్యకాలంలో వచ్చిన పెట్టుబడిదారీ సంక్షోభం సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళికలను తాకినప్పుడు వచ్చిన అభిప్రాయమది. వాస్తవానికి మార్క్స్ చెప్పింది ఉత్పత్తిని పెంచడంలో పెట్టుబడిదారీ విధాన సామర్థ్యం దాని చివరి అంచులకు చేరుకున్నదని కాదు. పెట్టుబడిదారీ విధానపు గజిబిజి అధిక ఉత్పత్తికి సంబంధించి నిర్ణీత కాలంలో సంక్షోభాలు తీసుకొస్తుందని ఆయన చెప్పాడు. ఇవి కాస్త ముందో వెనకో ఇక పెట్టుబడిదారీ విధానంలో ఆర్థిక వ్యవస్థను నడపలేని స్థితిని తీసుకువస్తాయనీ, అది పరిష్కరించలేని సామాజిక ఘర్షణలు తలెత్తడానికి కారణమవు తాయని పేర్కొన్నాడు. తర్వాతి దశలో రావలసిన సామాజిక ఉత్పత్తి అనే విధానాన్ని తీసుకురాగల శక్తి స్వతస్సిద్ధంగానే పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉండదు. కనుక అది సోషలిస్టు వ్యవస్థగా ఉండటం అనివార్యం.

ఇలా చెప్పాడు గనక ఇరవయ్యవ శతాబ్దంలో కారల్ మార్క్స్ గురించిన చర్చలలో, అంచనా లలో సోషలిజం కీలకాంశంగా ఉండటం ఆశ్చర్యకరం కాదు. సోషలిజం గురించి చెప్పింది మార్క్స్ ఒక్కరే కావడం వల్ల కాదు ఇలా జరిగింది. అది నిజం కాదుకూడా. మార్క్స్ వల్ల ఉత్తేజం పొందిన పార్టీలు అలాటి కార్యక్రమాన్ని తమదిగా స్వీకరించాయి. కమ్యూనిస్టులైతే తాము సోషలిజాన్ని స్థాపించామని కూడా ప్రకటించారు. 20 వ శతాబ్దపు ఈ రూపంలోనైతే సోషలిజం మరణించింది. సోవియట్ యూనియన్‌లో గానీ, ఇతర కేంద్ర ప్రణాళికాయుత ఆర్థిక వ్యవస్థలలో గానీ వర్తింప చేసిన సోషలిజం- సైద్ధాంతికంగా చెప్పాలంటే మార్కెట్ రహిత, ప్రభుత్వ యాజమాన్య నియంత్రిత ఆదేశిత ఆర్థిక వ్యవస్థలు అంతరించాయి. అవి మళ్లీ పునరుద్ధరించబడవు. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలను నిర్మించాలనే సోషల్ డెమొక్రటిక్ ఆకాంక్షలు ఎప్పుడూ భవిష్యత్తుకు సంబంధించినవే. అయితే శుద్ధ ఆకాంక్షలుగా చూసినా అవి ఈ శతాబ్దాంతానికి వదలివేయబడ్డాయి.

సోషల్ డెమోక్రాట్ల మనసుల్లో ఉన్న లేదా కమ్యూనిస్టు ప్రభుత్వాలు స్థాపించిన సోషలిజం నమూనాలు ఎంత వరకూ మార్క్సు నమూనాలుగా చెప్పొచ్చు? ఇక్కడ ముఖ్యమైన విషయమేమంటే సోషలిజంలో ఆర్థిక వ్యవస్థల గురించి సంస్థలు ఎలా ఉండాలో చెప్పేపని మార్క్సు ఉద్దేశపూర్వకంగానే మానుకున్నాడు. ఇక కమ్యూనిస్టు సమాజ రూపు రేఖల గురించి అసలేమీ చెప్పలేదు. అది ఏదో ఒక పథకం ప్రకారం నిర్మించదగిన లేదా ముందుగా నిర్దేశించదగినది కాదని మాత్రం చెప్పాడు. అది సోషలిస్టు సమాజం నుంచి ఉద్భవిస్తుందని చెప్పి ఊరుకున్నాడు. జర్మన్ సోషల్ డెమొక్రాట్ల గోథా కార్యక్రమ విమర్శన వంటి రచనల్లో పేర్కొన్న ఇలాటి సాధారణ వ్యాఖ్యానాల ద్వారా మార్క్సు తన వారసులకు నిర్దిష్ట నిర్దేశకత్వం ఇచ్చింది లేదు. ఈ విషయాలపై లోతుగా ఆలోచించే పని పెట్టుకోలేదు. ఎందుకంటే విప్లవం జయప్రదమయ్యేలోగా వీటిని గురించి ఆలోచించడం కేవలం పండిత తతంగమో, ఊహాజనిత కసరత్తో అవుతుందని భావించారు. లేబర్ పార్టీ నిబంధనావళిలో చాలా ప్రసిద్ధమైన నాల్గవ అధికరణం ఇక్కడ ఉటంకించవచ్చు.' ఉత్పత్తి సాధనాలపై సమిష్టి యాజమాన్యం' పై ఇది ఆధారపడి ఉంటుందని మాత్రం చెప్పారు. అంటే దేశంలో పరిశ్రమలను జాతీయం చేయడం ద్వారా ఈ లక్ష్యం సాధించవచ్చునని సాధారణంగా అర్థం చేసుకున్నారు.

కేంద్రీకృత సోషలిస్టు నమూనాకు సంబంధించిన తొలి సిద్ధాంతం రూపొందించిన వారు సోషలిస్టులు కాక, సోషలిస్టేతరులు కావడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఇటాలియన్ ఆర్థిక వేత్త ఎన్రికో బరోన్ 1908లో దాన్ని రూపొందిచారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రైవేటు పరిశ్రమలను జాతీయం చేయడం అనే ప్రశ్న మొదటి సారిగా రాజకీయ పార్టీల ఎజెండాలోకి వచ్చే వరకూ ఎవరూ దాన్ని గురించి ఆలోచించివుండలేదు. ఆ సమయంలో సోషలిస్టులు గతం నుంచి ఎలాంటి నిర్దేశకత్వం లేకుండానే తమ ముందుకు వచ్చిన సమస్యలను ఎదుర్కోవలసిన స్థితిలో పడ్డారు.

సామాజిక నిర్వహణలో సాగే ఏ విధమైన ఆర్థిక వ్యవస్థలోనైనా 'ప్రణాళిక' అనేది భాగంగా ఉంటుంది. అయితే మార్క్సు దాని గురించి నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. విప్లవానంతర రష్యాలో దాని అమలు ప్రారంభించినపుడు అది చాలా మెరుగుపర్చాల్సిన స్థితిలో ఉంది.

> **“ సామాజిక నిర్వహణలో సాగే ఏ విధమైన ఆర్థిక వ్యవస్థలోనైనా 'ప్రణాళిక' అనేది భాగంగా ఉంటుంది. అయితే మార్క్స్ దాని గురించి నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. విప్లవానంతర రష్యాలో దాని అమలు ప్రారంభించినపుడు అది చాలా మెరుగుపర్చాల్సిన స్థితిలో ఉంది. ”**

సైద్ధాంతిక సాధనాలైన దృక్పథాల ద్వారా (లియాంటివ్ ఇన్‌పుట్ ఔట్‌పుట్ విశ్లేషణ వంటివి), అలాగే తగు గణాంకాలు అందించడం ద్వారా ఇది జరిగింది. ఈ పరికరాలను తర్వాత సోషలిస్టేతర దేశాలలో కూడా విస్తారంగా ఉపయోగించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం అదే స్థాయిలో దెబ్బతిన్న యుద్ధ ఆర్థిక వ్యవస్థలను అనుసరించడం ద్వారా ఇది జరిగింది. ముఖ్యంగా జర్మనీని, ప్రత్యేకంగా అక్కడున్న విద్యుత్ పరిశ్రమను అనుసరించారు. జర్మన్ అమెరికన్ విద్యుత్ సంస్థల నిర్వాహణాధికారులలోని రాజకీయ సానుభూతిపరులు లెనిన్‌కు వాటి గురించిన సమాచారం ఇచ్చారు. సోవియట్‌లో ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థకు ప్రాథమిక నమూనాగా నిలిచింది యుద్ధ ఆర్థిక వ్యవస్థే. అంటే దీని అర్థం అలాటి దానిలో ముందుగానే కొన్ని లక్ష్యాలు నిర్ణయించబడతాయి. కృత్రిమ వేగంతో పారిశ్రామికీకరణ, యుద్ధంలో గెలవడం, అణుబాంబు తయారీ లేదా మనిషిని చంద్రునిపైకి పంపడం వంటి లక్ష్యాలు పెట్టుకుని వాటి సాధన కోసం ప్రణాళికలు వేసి వనరులు కేటాయించడం జరుగుతుంది. దీనివల్ల తాత్కాలికంగా కలిగే నష్టం ఏమైనా కావచ్చు. ఇందులో ప్రత్యేకించి సోషలిస్టు తరహాగా చెప్పదగిందేమీ లేదు. ముందే నిర్ణయించుకున్న లక్ష్యాల సాధన కోసం కాస్త ఎక్కువ తక్కువ ఆధునీకరణతో కృషి చేయవచ్చు. అయితే సోవియట్ ఆర్థిక వ్యవస్థ ఈ దశను దాటి ముందుకు పోయింది లేదు. 1960ల తర్వాత అలాటి ప్రయత్నం జరిగింది గాని అదో విధమైన సంకట పరిస్థితి (క్యాచ్22 స్థితి) మార్కెట్లను నిరంకుశాధికార ఆదేశిత చట్రంలో ఇమిడ్చే పద్ధతి అమలైంది.

కనుక సోషల్ డెమోక్రసీ అనేది మార్క్సిజాన్ని భిన్నమైన పద్ధతిలోకి మార్చింది. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని వాయిదా వేయడమో లేక సానుకూల పద్ధతిలో చెప్పాలంటే భిన్న తరహాల మిశ్రమ ఆర్థిక వ్యవస్థలను ప్రయోగించడమో జరిగింది. పూర్తిగా సోషలిస్టు తరహా ఆర్థిక వ్యవస్థ నిర్మించాలని కోరుకున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు సంబంధించినంతవరకూ అవి ఒక విధంగా ఆలోచించుకోవలసిన అవసరాన్నిది కల్పించింది. చాలా ఆసక్తికరమైన అలాటి ఆలోచనలు చేసిన వారిని చెప్పుకోవాలంటే మార్క్సిస్టేతర చింతనాపరులైన ఫెబియన్ సిడ్నీ, బియాట్రిస్ వెబ్ వంటి వారు. పెట్టుబడిదారీ విధానం నుంచి సోషలిజానికి క్రమానుగత మార్పును వారు సూచించారు. దీనికోసం వారు తిరుగులేనివైన, పరస్పర సహాయకమైన అనేక సంస్కరణల పరంపర ప్రతిపాదించారు. అందువల్లనే సోషలిజంకు సంబంధించిన యంత్రాంగాల కల్పనపై కొన్ని రాజకీయ ఆలోచనలు చేశారు. అయితే ఇందులో ఆర్థిక సంబంధమైనవేమీ లేవు. ఇక ప్రధాన మార్క్సిస్టు 'రివిజనిస్టు' అయిన ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్ విషయానికి వస్తే ఆయన సంస్కరణ వాద ఉద్యమమే సర్వస్వమనీ, అంతిమ లక్ష్యం అనేదానికి వాస్తవికత లేదని ప్రకటించాడు. వాస్తవానికి మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత చాలా దేశాలలో ప్రభుత్వాధికారంలోకి వచ్చిన అనేక సోషల్ డెమోక్రటిక్ పార్టీలు రివిజనిస్టు విధానాన్నే చేపట్టాయి. అంటే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను దాని మానానికి దాన్ని వదలివేసి కార్మికులకు సంబంధించిన ఏవో కొన్ని కోర్కెలు నెరవేర్చడానికే పరిమితమైనారు. ఆంటోనీ క్రాస్‌లాండ్ రాసిన సోషలిజం భవిష్యత్తు (1956) అనే గ్రంథం ఇలాటి ధోరణులకు ప్రామాణిక ఉదాహరణగా చెప్పవచ్చు. 1945 తర్వాత పెట్టుబడిదారీ విధానం దేనికీ లోటు లేని సమాజాన్ని సృష్టించిందని ప్రకటించారు. కనుక ప్రభుత్వరంగ సంస్థలు(జాతీయకరణ తరహాలో గాని లేక మరో విధంగా గాని) అవసరమే

**❝ ఒక ఆర్థిక ఆలోచనాపరుడుగా, ఒక చారిత్రిక ఆలోచనాపరుడు, విశ్లేషకుడుగా, సమాజం గురించిన నూతన ఆలోచనా ధోరణికి ఒక వ్యవస్థాపక పితామహుడుగా (డర్క్‌హీం మాక్స్ వెబర్‌లతో పాటు) నిలిచిపోయాడు. ఒక తత్వవేత్తగా ఆయన కొనసాగుతున్నతీరుపైన, దాని ప్రాధాన్యతపైన అభిప్రాయం వ్యక్తం చేసే అర్హత నాకులేదు. ఎప్పటికీ సమకాలీన ప్రాధాన్యత కోల్పోని అంశం మార్క్స్ దార్శనికత. ❞**



**జి – 8 దేశాల నాయకులు**

లేదన్నారు. జాతీయ సంపద న్యాయంగా పంపిణీ అయ్యేట్టుచూడటమే సోషలిస్టుల బాధ్యత అని ఆయన భావించాడు. ఇది మార్క్స్ నుంచి బాగా దూరమైన భావన. సంప్రదాయ సోషలిజం భావించినట్టుగా మార్కెట్ రహిత సోషలిజం గురించిన ఆలోచనలకు కూడా ఇది చాలా భిన్నం. బహుశా ఈ సంప్రదాయభావననే మార్క్స్ కూడా భాగం పంచుకుని ఉండేవాడు.

దీనికి నేను ఇటీవలి మరొక వివాదాన్ని కూడా తోడు చేస్తాను. ఆర్థిక రంగంలో నయా ఉదార వాదులకూ వారి విమర్శకులకూ మధ్య ప్రభుత్వ రంగ సంస్థల పాత్రపై వివాదం నడుస్తున్నది. ఇది నిజానికి మార్క్సిస్టులకే పరిమితమైన చర్చ కాదు, అసలు సూత్రరీత్యా ఇది సోషలిస్టు చర్చ కానే కాదు. 1970ల నుంచి సమాన వాణిజ్యావకాశం అనే సూత్రం దారుణంగా దిగజారిపోయిన ఫలితంగానే ఈ చర్చ ముందుకు వచ్చింది. ఒక ఆర్థిక వాస్తవంగా మారిన ఈ సూత్రం చివరకు లాభార్జనా దాహం గల సంస్థలపై ఎలాంటి నియంత్రణలు లేదా అదుపు లేకుండా పోవడానికి కారణమైంది. మానవ సమాజాన్ని ఏదో స్వయం నియంత్రణ (గలదని చెప్పబడుతున్న), అంతులేని సంపద సృష్టించే మార్కెట్లకు అప్పగించడానికి ఇది దారి తీసింది. సంపదతో పాటు సంక్షేమం కూడా గరిష్టంగా ఉంటుందనే వాదనలు వచ్చాయి. తమ ప్రయోజనాల కోసం సంబంధిత పాత్రధారులు హేతుబద్ధంగా దీన్ని నడిపిస్తారని చెప్పబడుతున్నది. నిజానికి పెట్టుబడిదారీ విధానపు ఏ దశలో కూడా ఏ దేశంలో కూడా ఇలాటిది లేనేలేదు. ఆఖరుకు అమెరికాలో కూడా లేదు. ఇది అర్థం లేని వ్యవహారం. ఆడంస్మిత్‌కు సిద్ధాంత కారులు చెప్పిన విపరీత భాష్యం ఇది. అలాగే బోల్షివిక్కులు ఏ విధంగా మార్క్స్ అంటే నూరు శాతం ప్రభుత్వ ప్రణాళికాయుత ఆదేశిత ఆర్థిక వ్యవస్థ అని చెప్పారో ఇదీ అంతే. ఈ మార్కెట్ ఛాందసం ఆర్థిక వాస్తవం కన్నా అంధవిశ్వాసంగానే ఉంది గనక అదీ విఫలమైంది.

ఈ విధంగా కేంద్ర ప్రణాళికాబద్ధ, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలు అదృశ్యమై పోయాయి. నిరుత్సాహానికి గురైన సోషల్ డెమొక్రాట్ల ఆకాంక్షల నుంచి సమాజాన్ని మౌలికంగా పరివర్తన చేయడమనే లక్ష్యం మటుమాయమైంది. దీనివల్లనే 20వ శతాబ్దపు సోషలిజం వాదనలు చాలా వరకూ నిర్మూలనైపోయాయి. ఇవన్నీ మార్క్సు పేరిట జరిగినా, ఆయన ఉత్తేజం వీటి వెనక ఉన్నా వాటి సారాంశం మాత్రం ఆయనకు కొంచెం దూరంగా ఉంటుంది. అయితే మార్క్స్ మూడు విధాలుగా మహత్తర శక్తిగా మిగిలిపోయాడు: ఒక ఆర్థిక ఆలోచనాపరుడుగా, ఒక చారిత్రిక ఆలోచనాపరుడు, విశ్లేషకుడుగా, సమాజం గురించిన నూతన ఆలోచనా ధోరణికి ఒక వ్యవస్థాపక పితామహుడుగా (డర్క్‌హీం మాక్స్ వెబర్‌లతో పాటు) నిలిచిపోయాడు. ఒక తత్వవేత్తగా ఆయన కొనసాగుతున్నతీరుపైన, దాని ప్రాధాన్యతపైన అభిప్రాయం వ్యక్తం చేసే అర్హత నాకులేదు. ఎప్పటికీ సమకాలీన ప్రాధాన్యత కోల్పోని అంశం మార్క్స్ దార్శనికత. మానవ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో పెట్టుబడిదారీ విధానం ఒక తాత్కాలిక ఘట్టం మాత్రమేనని ఆయన చెప్పిన మాట యధార్థమైంది. అది ఏ విధంగా ఎప్పటికప్పుడు విస్తరిస్తూ, కేంద్రీకరిస్తూ, సంక్షోభాలు సృష్టిస్తూ, తనను తాను మార్పు చేసుకునే ప్రక్రియలపై ఆయన విశ్లేషణ నిలిచేవుంటుంది.

××

21వ శతాబ్దంలో మార్క్స్ ప్రాధాన్యత ఏమిటి? ఇప్పటి వరకూ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు జరిగిన ఒకే ఒక ప్రయత్నం సోవియట్ తరహాకు చెందిందే. అది ఇప్పుడు ఎంత మాత్రం ఉనికిలో లేదు. మరో వైపున ప్రపంచీకరణ అనేదాని ప్రగతి అపారంగా అమిత వేగంతో ముందుకు పోతున్నది. మానవుల సంపద సృష్టి సామర్థ్యం చెలరేగిపోతున్నది. జాతి రాజ్యాల ఆర్థిక, సామాజిక అధికార పరిధిని ఇది కుదించివేసింది. ఈ కారణంగా సోషల్ డెమోక్రాట్ల సంప్రదాయ విధానాలు కూడా దెబ్బతిన్నాయి. ఎందుకంటే ఆ పార్టీలు ప్రధానంగా తమ ప్రభుత్వాలపై సంస్కరణల కోసం ఒత్తిడి తేవడం ఆధారంగా పనిచేస్తాయి. మార్కెట్ ఛాందసం బాగా ప్రాబల్యం పొందింది గనక దేశాల మధ్య, ప్రాంతాల మధ్య విపరీతమైన ఆర్థిక వ్యత్యాసాలను సృష్టించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో పాతకాలపు వినాశకర ప్రళయ పరంపరకు మళ్లీ తెర తీసింది. ఇందులో భాగంగా 1930లలో వచ్చిన ప్రపంచపు అతి పెద్ద సంక్షోభ లక్షణాలు కూడా ఇందులో కనిపిస్తున్నాయి.

మన ఉత్పత్తి సామర్థ్యం వల్లనే ఈ పరిస్థితి సాధ్యమైంది. కనీసం అలాటి అవకాశాలు కనిపిస్తున్నాయనైనా చెప్పొచ్చు. మనుషులలో అత్యధికులు అవసరాల పరిధి నుంచి సంపద,

❝ అందువల్ల మనం ఈ రోజున కారల్ మార్క్స్‌ను ఎలా చూడాలి? మానవాళిలో ఒక భాగానికి గాక మొత్తం తరపున ఆలోచించిన వ్యక్తిగా చూడొద్దా? తప్పక అలాగే చూడాలి. ఒక తత్వవేత్తగానా? ఒక ఆర్థిక విశ్లేషకుడుగానా? ఒక ఆధునిక సామాజిక శాస్త్ర వ్యవస్థాపక పితామహుడుగా మానవ చరిత్రను అర్థం చేసుకోవడానికి మార్గం చూపిన వ్యక్తిగానా? ❞

చదువు, ఊహాతీతమైన జీవితపు ఎంపిక అవకాశాలు చూస్తున్నారు. ప్రపంచ జనాభాలో చాలా మంది ఇంకా ఈ స్థితిలోకి రావలసే ఉందన్న మాట కూడా నిజమే. అయినా ఇరవయ్యవ శతాబ్దిలో అత్యధిక కాలం సోషలిస్టు ఉద్యమాలూ, ప్రభుత్వాలూ అవసరాల పరిధిలోనే ప్రధానంగా పనిచేయవలసి వచ్చింది. పాశ్చాత్య ప్రపంచంలోని సంపన్నదేశాలు కూడా 1945 తర్వాతి ఇరవై ఏళ్లలో గాని సంపద్వంతమైన స్థితికి చేరుకోలేదు. ఏమైనా ఇప్పుడు సంపద సమృద్ధి కాలం గనక తగు తిండి, గుడ్డ, గృహం, ఆదాయం, ఉద్యోగం కోసం, ప్రజలను ఈతిబాధల నుంచి కాపాడే సంక్షేమ కార్యక్రమాలు వంటివి అవసరమే గాని అవే సోషలిస్టుల కార్యక్రమంగా సరిపోవు.

ఇక మూడో పరిణామం ప్రతికూలమైనది. బ్రహ్మాండమైన ప్రపంచీకరణ ఆర్థిక వ్యవస్థ పర్యావరణాన్ని దెబ్బతీసింది. ఈ హద్దూపద్దూలేని ఆర్థికాభివృద్ధికి పగ్గాలువేయడం తక్షణావసరంగా ముందుకొస్తున్నది. జీవావరణంపైన మన ఆర్థిక వ్యవస్థ ప్రభావాన్ని అదుపు చేసేందుకోసం ఈ వేగాన్ని నియంత్రించవలసిన అవసరం ఒకవైపు కనిపిస్తుంది. పెట్టుబడిదారీ మార్కెట్ అవసరాల కోసం ఈ పెరుగుదలను గరిష్ట స్థాయికి చేర్చవలసిన అవసరం మరో వైపు కనిపిస్తున్నది. ఈ రెంటి మధ్యనా ఘర్షణ వస్తుంది. ఇది పెట్టుబడిదారీ విధానపు ఆయువు పట్టు. దీన్ని ఏ బాణం కొడుతుందో మనకు ఇంకా తెలియదు.

అందువల్ల మనం ఈ రోజున కారల్ మార్క్స్‌ను ఎలా చూడాలి? మానవాళిలో ఒక భాగానికి గాక మొత్తం తరపున ఆలోచించిన వ్యక్తిగా చూడొద్దా? తప్పక అలాగే చూడాలి. ఒక తత్వవేత్తగానా? ఒక ఆర్థిక విశ్లేషకుడుగానా? ఒక ఆధునిక సామాజిక శాస్త్ర వ్యవస్థాపక పితామహుడుగా మానవ చరిత్రను అర్థం చేసుకోవడానికి మార్గం చూపిన వ్యక్తిగానా? నిజం. అయితే అట్టాలీ చెప్పినట్టుగా ఆయన ఆలోచనలకు విశ్వజనీన అన్వయం ఉంటుంది. మామూలుగా చెప్పేట్టు అది భిన్న శాఖల మధ్య సంధానం చేయడం కాదు, అన్ని విభాగాల సమాహారంగా పనిచేస్తుంది. 'ఆయనకు ముందు తత్వవేత్తలు మనిషిని మొత్తంగా చూశారు. అయితే ప్రపంచమంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక, తాత్విక అంశాలన్ని కలిగివున్నదని మొదటి సారి కనుగొన్న వ్యక్తి ఆయనే' అని అట్టాలి వివరిస్తారు.

ఆయన రాసిన దానిలో చాలా భాగం ఈ కాలానికి వర్తించదన్న మాట ఖచ్చితంగా నిజం. అందులో కొంతభాగం ఇప్పుడు ఆమోదయోగ్యం కాదు కూడా. పైగా ఆయన రచనలు సర్వ సంపూర్ణ రూపం తీసుకోలేదన్న మాట కూడా నిజం. కాని ఆయన పేరిట గల అలోచనలన్నీ కూడా అనంతమైన అభివృద్ధి వైపు సాగిపోతుంటాయి. వ్యవస్థాగతంగా పెంచిన ఛాందసాలను అలా ఉంచి మరెవరూ కూడా దాన్ని ఒక పిడివాదంగా మార్చడం కుదిరేపని కాదు. ఈ పరిస్థితి తప్పక మార్క్స్‌కే దిగ్భ్రాంతి కలిగించి ఉండేది. అయితే 'సరైన', 'సరైనది కాని' మార్క్సిజం ఉంటుందనే భావనను కూడా మనం తిరస్కరించాలి. ఆయన చెప్పిన విచారణ తరహా పద్ధతి భిన్నమైన ఫలితాలకు భిన్నమైన పద్ధతులకు అవకాశమిస్తుంది. అసలు మార్క్స్‌కే ఈ పరిస్థితి ఎదురైంది. బ్రిటన్‌లో, నెదర్లాండ్స్‌లో సోషలిజానికి శాంతియుత పరివర్తన జరగవచ్చని ఆయన అనుకున్నాడు. రష్యాలోనైతే గ్రామీణ సమాజం నుంచి సోషలిజంలోకి పరివర్తన జరగవచ్చని భావించాడు. కనుక ప్లెఖనోవ్, లెనిన్ ఆయన ఆలోచనలకు ఎంత వారసులో కాట్‌స్కీ, బెర్న్‌స్టీన్ కూడా అంతే ఎక్కువ (లేదా మీకు నచ్చకపోతే అంత తక్కువ) వారసులుగా ఉంటారు. కనుకనే అట్టాలీ నిజమైన మార్క్స్‌కూ తర్వాత ఆయన ఆలోచనలను సులభతరం చేసిన లేదా వక్రమార్గం పట్టించిన వారి జాబితాలో పేర్కొన్న ఎంగెల్సు, కాట్‌స్కీ,లెనిన్ తదితరులకూ మధ్యన పెద్ద తేడా చూపించడం పట్ల నాకు సందేహాలున్నాయి. పెట్టుబడిని మొదటి సారి తీవ్రంగా చదివి పశ్చిమ దేశాల తరహాలో తమ వెనుకబడిన తనం నుంచి ఆధునీకరణ వైపు వెళ్లవచ్చని రష్యన్లు కోరుకున్నారు. అది వారికి న్యాయం. అదే సమయంలో సాక్షాత్తూ మార్క్స్ రష్యా గ్రామీణ సమాజం నుంచి పెట్టుబడిదారీ విధానానికి నేరుగా వెళ్లిపోవడం సాధ్యమేనేమో అని భావించాడు. అది కూడా అంతే న్యాయం. నిజంగా ఏదైనా ఉందంటే అది సాధారణ మార్క్స్ ఆలోచనా ధోరణిలోనే ఉంది. ప్రపంచమంతా సోషలిజం వచ్చాకే రష్యాలో సోషలిజం నిర్మాణం చేపట్టివుండాల్సిందని ఆ విప్లవంపై విమర్శ చేయడం కుదరదు. మార్క్స్ అలా చెప్పలేదు. ఆయన అలా గట్టిగా నమ్మాడని కూడా అనుకోవడానికి ఆధారాలు లేవు. అది కేవలం ఉజ్జాయింపుగా చెప్పే అనుభవవాదం. రష్యా అప్పటికి చాలా వెనకబడిన దేశం గనక సోషలిస్టు తరహాను పోలిన వ్యంగ్యచిత్రం మాత్రమే అందించగల స్థితి. ప్లెఖనోవ్ అదే హెచ్చరిక చేశాడని చెబుతుంటారు. 1917లో రష్యన్ మార్క్సిస్టులలో అత్యధికులతో సహా మొత్తం మార్క్సిస్టుల ఏకాభిప్రాయం అలాగే ఉండేది. మరో వైపున 1890ల నాటి లిబరల్ మార్క్సిస్టులు అట్టాలీ అభిప్రాయం తీసుకున్నారు. అంటే మార్క్సిస్టులు రష్యాలో ప్రధానంగా

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> **“ 21వ శతాబ్దంలో ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాలేమిటో మనం జోస్యం చెప్ప లేము. కాని వాటిని ఎదుర్కోవడంలో విజయం సాధించే అవకాశం ఉండాలంటే మాత్రం అవి తప్పక మార్క్స్ లేవనెత్తిన ప్రశ్నలను ముందుకు తీసుకురా కుండా జరగదు. ”**

చేయవలసింది గొప్ప పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించడమనే వైఖరి వారిది. అది కూడా ఆధారరహితమే. జారిజం హయాంలో ఉదారవాద పెట్టుబడిదారీ రష్యా ఏర్పడ్డం అసంభవం.

ఇవన్నీ చెప్పుకున్నప్పటికీ మార్క్స్ విశ్లేషణలో అనేక ప్రధానాంశాలు ఇప్పటికి విలువైనవిగానే ఉంటాయి.

మొట్టమొదటిది పెట్టుబడిదారీ అభివృద్ధి విధానపు అంతర్జాతీయ చలన సూత్రాలకు సంబంధించిన తిరుగులేని విశ్లేషణ. ఈ విధానం తన ఎదురుగా వచ్చే ప్రతిదాన్నీ నాశనం చేస్తుంది. కుటుంబ వ్యవస్థలవంటివి ఏవైతే మానవ చరిత్రలో పెట్టుబడిదారీ విధానం పెరుగుదలకు కారణమైనాయెా ఆ వారసత్వాలను కూడా వదలకుండా ధ్వంసం చేస్తుంది.

రెండవది: పెట్టుబడిదారీ విధానపు పెరుగుదల క్రమంలో ఏర్పడే యంత్రాంగపు అంతర్గత వైరుధ్యాలు. నిరంతరాయమైన ఉద్రిక్తతలు, తాత్కాలిక పరిష్కారాలు. అభివృద్ధి సంక్షోభానికి మార్పునకూ దారితీయడం. ఇవన్నీ కలిసి ఒక ఆర్థిక కేంద్రీకరణకు దారి తీయడం. అది ఒక ప్రపంచీకరించబడిన ఆర్థిక వ్యవస్థగా మారడం.

నిర్విరామ విప్లవంతో నిరంతరం తనను తాను పునరుజ్జీవింపచేసుకునే ఒక సమాజం గురించి మావో కలలు కన్నాడు. పెట్టుబడిదారీ విధానం ఈ పథకాన్ని నిజం చేసింది. షుంప్టర్ (మార్క్స్‌ను అనుసరించి) సృజనాత్మక విధ్వంసం అని పిలిచింది దీన్నే. ఈ క్రమం అంతిమంగా అపారమైన కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ స్థాపనకు దారి తీస్తుందని మార్క్స్ భావించాడు. అలా కావలసిందే. ఈ రోజున ప్రపంచంలో ఏం జరగాలన్నది వెయ్యి మంది లేదా పదివేల మంది ఆదేశం ప్రకారం జరుగుతుందని అట్టాలీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పింది దీని గురించే. ఇది పెట్టుబడిదారీ విధానం అంతానికి దారి తీస్తుందని మార్క్స్ చెప్పిన మాట. ఈ అంచనా నాకు ఇప్పటికీ సాధ్యమయ్యేదిగా కనిపిస్తుంది. కాకపోతే ఆయన ఊహించినట్టగాక వేరే విధంగా జరగొచ్చు.

మరో వైపున ఆయన చెప్పిన జోస్యం మరొకటి ఉంది. దోపిడీ చేసే వారిని దోచుకోవటం అంటూ విస్తార శ్రామిక వర్గం సోషలిజానికి దారి తీస్తుందని ఆయన రాశారు. అయితే ఈ అంచనా చెప్పింది పెట్టుబడిదారీ విధాన యంత్రాంగంపై విశ్లేషణలో భాగంగా గాక మరో ప్రత్యేక అంచనాతో ఆ మాట చెప్పారు. పారిశ్రామికీకరణ కనీస వేతనాలపై ఆధారపడి కాయకష్టం చేసే కార్మికులను తయారు చేస్తుందనీ అప్పుడు ఇంగ్లాండులో జరుగుతున్న దాన్నిచూసి ఆయన చెప్పి ఉండొచ్చు. మధ్య తరహా ఉత్పత్తికి సంబంధించినంత వరకూ ఇది వాస్తవమే. కాని దీర్ఘ కాలంలో ఇది సరికాదని మనం ఇప్పుడు చూస్తున్నదాన్నిబట్టి చెప్పవచ్చు. అలాగే 1840ల తర్వాత మార్క్స్ ఎంగెల్సులు కూడా పారిశ్రామికీరణ వల్ల జనాలు దివాళా తీసి తాము కోరుకున్న విప్లవకర వాతావరణం వస్తుందని ఆశించలేదు. కార్మిక వర్గంలో విస్తార భాగాలు ఖచ్చితమైన లెక్కల ప్రకారం మరింత పేదలు కావడం లేదని వారు స్పష్టంగానే చూడగలిగారు. నిజంగానే నికరమైన కార్మిక వర్గం గల జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభకు 1900 లలో హాజరైన అమెరికన్ పరిశీలకుడు అక్కడ కామ్రేడ్స్ దారిద్ర్యానికి ఒకటి రెండు మెట్లు పైనే ఉన్నారని రాశాడు. మరోవైపున ప్రపంచం వివిధ ప్రాంతాల మధ్య, వర్గాల మధ్య ఆర్థిక అసమానత పెరగడం కూడా మార్క్స్ చెప్పిన ప్రకారం దోచుకొనే వాడిని దోచుకోవటం అన్నది అనివార్యమయ్యే పరిస్థితిని నివారించింది. క్లుప్తంగా చెప్పాలంటే ఆయన రచనలలో భవిష్యత్తుకు సంబంధించిన ఆశలు కనిపిస్తాయి గాని దాన్నుంచే అవి జరగవు. మూడవది–అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం పొందిన కీశే సర్ జాన్ హిక్స్ మాటల్లో చెప్పుకోవడం అత్యుత్తమంగా ఉంటుంది.‘ చరిత్ర సాధారణ గమనంలో ఏదో ఒక చోట ఉండాలని కోరుకునే వారంతా మార్క్సిస్టు వర్గీకరణను లేదా దాని మరో రూపాన్ని ఆశ్రయించవలసిందే. ఎందుకంటే అవి గాక అందుబాటులో ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలేవీ నిజంగా అక్కరకు వచ్చేవి కావు’ 21వ శతాబ్దంలో ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాలేమిటో మనం జోస్యం చెప్పలేము. కాని వాటిని ఎదుర్కోవడంలో విజయం సాధించే అవకాశం ఉండాలంటే మాత్రం అవి తప్పక మార్క్స్ లేవనెత్తిన ప్రశ్నలను ముందుకు తీసుకురాకుండా జరగదు. ఒక వేళ ఇష్టం లేకపోతే ఆయన రకరకాల శిష్యులు ఇచ్చిన జవాబులను అమోదించకుండా తోసివేయొచ్చునేమో గాని ఆయన ముందుకు తెచ్చిన ప్రశ్నలు మాత్రం నిలిచే ఉంటాయి.

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చిం చాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

ఆర్థికరంగం

# బేసెల్ ప్రమాణాల అడకత్తెరలో భారత జాతీయ బ్యాంకులు


ఎల్.ఐ.సి. ఉద్యోగుల సంఘం
మాజీ నాయకులు

**కొండముది లక్ష్మీప్రసాద్**

ప్రపంచ ఆర్థిక సంకోభ ధాటి నుండి ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థను రక్షించడం కోసం బాసెల్ 3 ప్రమాణాలు రూపకల్పన చేయబడ్డాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించిన కారణంగా భారత రిజర్వ్ బ్యాంక్ 1-4-2013 నుండి భారత దేశంలోని జాతీయ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు బేసెల్ 3 ప్రమాణాలను అమలుచేయాలని అదేశించింది. ఈ ప్రమాణాల అమలుతో బ్యాంకుల పరిరక్షణ ఎలాగున్నా, అదనపు మూలధన సమీకరణలో జాతీయ బ్యాంకులు జీవన్మరణ పోరాటం జరుపుతూ, అంతిమంగా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయాల్సిన దుర్భర పరిస్థితులను నరేంద్రమోడీ నాయకత్వంలోని యన్‌డిఎ ప్రభుత్వం కల్పిస్తున్నది.

**బేసెల్ ప్రమాణాల నేపథ్యం :**

నయా ఉదారవాద విధానాలు అమలౌతున్న దేశాలలో ద్రవ్య రంగంలో స్పెక్యులేషన్ ధోరణులు మితిమీరడంతో ఆర్థిక వ్యవస్థలలో ఒడుదుడుకులు సర్వసాధారణ మయ్యాయి. వీటి నీలినీడలు బ్యాకింగ్ రంగంపై పడి బ్యాంకుల మనుగడే ప్రశ్నార్థకమయ్యింది. ఈ క్లిష్ట పరిస్థితుల్ని సమర్థవంతంగా ఎదుర్కో వడం కోసం " అంతర్జాతీయ పరిష్కారాల బ్యాంకు" (బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్) పర్యవేక్షణలో, స్విడ్జర్లాండ్ నందలి బేసెల్ నగరంలో బ్యాంకింగ్ పర్యవేక్షణ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీయే తదనంతర కాలంలో బేసెల్ కమిటీగా ప్రాచుర్యం పొందింది. బ్యాంకుల పరిరక్షణకు బేసెల్ కమిటీ నిర్దేశించిన విధానాలు బేసెల్ నారమ్స్ లేదా బేసెల్ ప్రమాణాలుగా పిలువబడుతున్నాయి.

**బేసెల్-1 ప్రమాణాలు :**

1988 జులైలో అంతర్జాతీయ బ్యాంకులకు కావల్సిన కనీస స్థాయి మూలధన అవసరాలపై బేసెల్ కమిటి కొన్ని ప్రమాణాలను రూపొందించింది. బ్యాంకింగ్ రంగ సుస్థిరతపై మొట్టమొదటిగా రూపొందించిన ఈ ప్రమాణాలు బేసెల్-1 ప్రమాణాలుగా ప్రసిద్ధికెక్కాయి. ఈ ప్రమాణాల ప్రకారం బ్యాంకు మంజూరు చేసిన సమస్యలతో (రిస్క్) కూడిన రుణాల మొత్తంలో 8 శాతంతో సమాన మైన మూలధనాన్ని ఆ బ్యాంకు అదనంగా కలిగి ఉండాలి. దీన్నే సముచిత మూలధన నిష్పత్తి (క్యాపిటల్ ఎడిక్వసీ రేషియో) అని అంటారు. దీన్ని లెక్కించడం కోసం వివిధ రుణాలకు, వాటిలో ఇమిడివున్న సమస్యలను బట్టి వెయిటేజ్‌లను నిర్ణయించారు. రుణాల నాణ్యతను బట్టి, రుణ మొత్తంలో పేర్కొన్న వెయిటేజ్ శాతం మేరకు "సముచిత మూలధన నిష్పత్తి" ని బ్యాంకులు అమలు చేయాల్సి ఉంటుంది.

**బేసెల్-1 ప్రభావాలు :**

బ్యాంకులలో ''తగినంత మూలధన సమీకరణ"లో బేసెల్-1 ప్రమాణాలు విజయవంతమైనాయి. బేసెల్ - 1 ప్రమాణాలు ప్రధానంగా రుణాలలో ఇమిడి ఉన్న సమస్యల పరిమాణంపై కేంద్రీకరించాయి. రుణాలలోని సమస్యల విశ్లేషణ వర్గీకరణతో, ఇంతవరకు సామాజిక బాధ్యతగా అందించబడుతున్న రుణాలు అధిక సమస్యాత్మకమైనవిగా భావించబడ్డాయి. దీనితో వాటికి కేటాయింపులు తగ్గించడం మొదలైంది. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న వివిధ దేశాలలో ప్రాధాన్యత రుణాల కేటాయింపు తగ్గిపోయింది. వసూలు కాని రుణాలను నిరర్థక ఆస్తులు (నాన్‌పెర్ ఫార్మింగ్ ఎస్సెట్స్) గా పరిగణించారు. బ్యాంకుల మొత్తం రుణాలలో నిరర్థక ఆస్థుల నిష్పత్తిపై పరిమితి విధింపబడింది. ఈ పరిమితిని అమలు చేయటానికి అనేక బ్యాంకులు మొండి బకాయిలను తమ లాభాల్లో సర్దుబాటు చేసుకోవడంతో అవి నష్టాల బారిన పడి, మూలధన కొరతను ఎదుర్కొన్నాయి. బేసెల్-1 తదనంతర కాలంలో ద్రవ్యరంగంలో వచ్చిన మౌలిక మార్పుల కారణంగా ఉత్పన్నమైన సమస్యల్ని పరిష్కరించడంలో బేసెల్-1 ప్రమాణాలు వైఫల్యం చెందాయి. అందువల్ల వాటిని సవరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బేసెల్-2 ప్రమాణాలకు రూపకల్పన జరిగింది.

ప్రపంచీకరణ స్వరూప స్వభావాలలో నెలకొన్న మార్పులతో ద్రవ్య మార్కెట్‌లో వినూత్న ద్రవ్య ఉత్పత్తులు (ఫైనాన్షియల్ ఇన్నోవేషన్స్) రంగం మీదకొచ్చాయి. ఈ ద్రవ్య ఉత్పత్తుల్లో స్పెక్యులేషన్ తీవ్రత భారీగా ఉంది. రుణ రంగ ప్రాధాన్యత పెరిగి, రుణ డెరివేటివ్‌ల్లాంటి అత్యధిక సమస్యలతో కూడిన ద్రవ్య ఉత్పత్తుల ప్రవేశంతో మార్కెట్ సమస్యలు అపరిమితంగా పెరిగాయి. దీన్ని తట్టుకోగలిగే సమస్యాపరిష్కార యాజమాన్య పద్ధతులు బేసెల్-1 ప్రమాణాలలో లేకపోవడం బ్యాంకులకు పెను సవాలుగా మారింది. బేసెల్-1 ప్రమాణాలు అంచనా కట్టిన రుణ

> **"ఈ పరిణామంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టాలలో పడటం, వాటి ప్రయివేటీకరణకు పాలక వర్గాలు కసరత్తు చేయటం మొదలైంది. బ్యాంకుల రుణ, డిపాజిట్ నిష్పత్తి తగ్గుముఖం పట్టింది. ప్రాధాన్యతా రంగానికి రుణాలను ఇవ్వటానికి వాణిజ్య బ్యాంకులు విముఖతను చూపడంతో, వ్యవసాయ రుణాల మంజూరు తగ్గింది."**

సమస్యల పరిధికి మించిన పరిస్థితులు నెలకొన్నాయి. దీన్ని అదునుగా తీసుకున్న కొన్ని అంతర్జాతీయ బ్యాంకులు వారి వారి బ్యాలెన్స్ షీట్లను తిమ్మినిబమ్మిని చేశాయి. నూతన ద్రవ్య ఉత్పత్తుల మూలంగా నెలకొన్న అదనపు సమస్యలకు అనుగుణంగా అదనపు మూలధన సమీకరణకు ప్రమాణాలు లేకుండా పోయాయి. అధిక నాణ్యత కలిగిన రుణాలపై బ్యాంకు ఆర్జించే లాభాల కంటే నాసిరకం రుణాలు/ పెట్టుబడులు అత్యధిక లాభాల్ని ఆర్జించడంతో, అంతర్జాతీయ బ్యాంకులు నాణ్యత కలిగిన రుణాల మంజూరును నిర్లక్ష్యం చేయడం మొదలైంది. బ్యాంకులు అంతర్గతంగా అనుసరి స్తున్న పద్ధతుల్లో పారదర్శకత లోపించింది. 1990లలో బేసెల్–1 ప్రమాణాలను తు.చ. తప్పకుండా అమలు చేసిన థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా లాంటి ఆసియా దేశాలలోని ద్రవ్య వ్యవస్థలు ద్రవ్య సంక్షోభంతో తల్లక్రిందులైనాయి. అనేక బ్యాంకులు మూతబడ్డాయి. ఈ సవాళ్ళను అధిగమించడానికి బేసెల్ కమిటీ 2014 జూన్‌లో బేసెల్–2 ప్రమాణాల పేర నూతన మారదర్శకాల్ని రూపొందించింది. ఈ ప్రమాణాలు బేసెల్–1 ప్రమాణాల కంటే మెరుగ్గా ఉన్నా, సంక్లిష్టంగా ఉన్నాయి. కనీస మూలధన పరిమాణం, పర్యవేక్షణ సమీక్ష, మార్కెట్ క్రమశిక్షణ అనే మూడు స్తంభాలపై (పిల్లర్స్) బేసెల్–2 ప్రమాణాలు నిర్మింపబడ్డాయి. బ్యాంకులు ఎదుర్కొనే సమస్యలను బేసెల్–2 ప్రమాణాలు రుణాల సమస్య, మార్కెట్ సమస్య, నిర్వహణ సమస్యలుగా వర్గీకరించాయి.

**బేసెల్–2 ప్రభావాలు :**

1. బ్యాంకులు ఎదుర్కొనే సమస్యల ఆధారంగా వివిధ రుణాలపై వడ్డీరేట్లు నిర్ణయింపబడ్డాయి.
2. బేసెల్–2 ప్రమాణాల రూపకల్పనకు అత్యధిక స్థాయిలో గణాంక వివరాలు కావల్సివచ్చింది. వివిధ స్థాయిలలో సమస్యలను గణించటానికి ఉన్నతస్థాయి టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అవసరమైంది. దీనికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందటానికి పెద్ద మొత్తంలో నిధులు అవసరమయ్యాయి.
3. ఇంత భారీస్థాయి పెట్టుబడులు, సేకరించాల్సిన అదనపు మూలధనం పెద్ద బ్యాంకులకే సాధ్యమవటం వల్ల, చిన్న బ్యాంకులు ఈ రంగంలోకి అడుగుపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. బ్యాంకుల విలీనాలు, ఏకీకరణలకు బేసెల్–2 ప్రమాణాలు సారధులుగా పనిచేశాయి.
4. అత్యధిక మూలధన అవసరాలకోసం బ్యాంకులు విదేశీ పెట్టుబడులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.
5. ద్రవ్య సంక్షోభ సమయాలలో కార్పొరేట్ల రుణ రేటింగ్ పడిపోయింది. దీని కారణంగా బేసెల్–2 ప్రమాణాల ప్రభావంతో అవసరమైన కాలంలో రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. అదే సందర్భంలో ఆర్థిక వికాస (బూమ్) కాలంలో కార్పొరేట్ల రుణ రేటింగ్‌లు మెరుగై, బ్యాంకులకు అధిక నిధుల లభ్యతతో రుణాల మంజూరు వేగవంతమయ్యాయి. బ్యాంకుల సుస్థిరతకు పకడ్బందీగా బేసెల్–2 ప్రమాణాల రూపకల్పన జరిగిందనుకొన్నప్పటికీ, ఇవి రుణ సంక్షోభాలకు దారి తీశాయి. 2007/2008లో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని, బ్యాంకుల దివాళాలను అవి ఆపలేకపోయాయి.

**బేసెల్ ప్రమాణాలు – భారతదేశం :**

సరళీకరణ విధానాల నేపథ్యంలో 1992లో భారతదేశంలో ఈ ప్రమాణాల అమలుకు పూనుకున్న రిజర్వు బ్యాంక్, 1999 నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసింది. బేసెల్ కమిటీ ఈ ప్రమాణాలలో "సముచిత మూలధన నిష్పత్తి" ని 8 శాతంగా నిర్ణయించగా, రిజర్వు బ్యాంకు ఈ నిష్పత్తిని 9 శాతంగా ఖరారు చేసింది. బేసెల్–1 ప్రమాణాల ప్రకారం నిరర్థక ఆస్తులు పెరిగిన మేరకు బ్యాంకులు అదనపు మూలధనాన్ని పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బ్యాంకులు అనివార్యంగా నిరర్థక ఆస్తుల్ని తగ్గించాల్సి వచ్చింది. జాతీయ బ్యాంకులు ఆర్జించిన విశేష లాభాలను మొండిబాకీలకు సర్దుబాటు చేయడంతోను, ప్రభుత్వం అందించిన అదనపు మూలధనంతోనూ, నిరర్థక ఆస్తుల శాతం తగ్గింది. ఈ పరిణామంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టాలలో పడటం, వాటి ప్రయివేటీకరణకు పాలక వర్గాలు కసరత్తు చేయటం మొదలైంది. బ్యాంకుల రుణ, డిపాజిట్ నిష్పత్తి తగ్గుముఖం పట్టింది. ప్రాధాన్యతా రంగానికి రుణాలను ఇవ్వటానికి వాణిజ్య బ్యాంకులు విముఖతను చూపడంతో, వ్యవసాయ రుణాల మంజూరు తగ్గింది.

ఫిబ్రవరి 2005లో రిజర్వుబ్యాంక్ నియమించిన స్టీరింగ్ కమిటీ బేసెల్–2 ప్రమాణాల అమలుకు కావల్సిన మార్గదర్శకాల్ని విడుదల చేసింది. వీటి ప్రకారం భారత వాణిజ్య బ్యాంకులు బేసెల్–2 ప్రమాణాల్ని అనుసరించాల్సిన అవసరం లేదు. అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వివిధ దేశాలలో బేసెల్–2 ప్రమాణాల పూర్తి అమలుకు ప్రోత్సహించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ కూడా తమ సభ్య దేశాలు ద్రవ్య రంగ సుస్థిరత కోసం ఈ ప్రమాణాలను అమలు చేయాలని, విదేశీ బ్యాంకుల విస్తరణకు అంగీకరించాలని, వివిధ దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలలో పేర్కొంది. భారత్ కూడా అందులో ఒక సభ్యదేశం. ఈ నేపథ్యంలో భారతదేశంలో రిజర్వ్ బ్యాంక్ బేసెల్–2 ప్రమాణాల అమలుకు సిద్ధమైంది. బేసెల్ –2 ప్రమాణాల అమలుకు కావలసిన నిధుల పరిమాణం మరింతగా పెరిగింది. జాతీయ బ్యాంకులు వారి లాభాలను అంతకు ముందు నిరర్థక ఆస్తుల అదుపుకు సర్దుబాటు చేయడం, ప్రభుత్వం నుండి బాండ్ల రూపంలో రుణం పొందటంతో అదనపు మూలధన సమీకరణకు నూతన మార్గాలను అన్వేషించాల్సి వచ్చింది. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ బ్యాంకులు 51 శాతానికి మించిన ప్రభుత్వ వాటాలను రిటైల్ మార్కెట్లో అమ్మటానికి అనుమతించింది. ఈ చర్య ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణకు శ్రీకారం చుట్టింది. అనేక ప్రభుత్వ రంగ బ్యాంకులు బేసెల్–2 ప్రమాణాల అమలుకు,

ప్రభుత్వ వాటాల ఉపసంహరణకు పూనుకున్నాయి. ఈ ధోరణి వేగం పుంజుకొని ప్రభుత్వ ఆధీనంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటాలను 33 శాతానికి తగ్గించాలని ఒత్తిడి పెరిగింది. బ్యాంకు ఉద్యోగుల, అధికారుల సంఘాల వ్యతిరేకత, 2007/2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో ఈ ధోరణికి అడ్డుకట్ట పడింది. ప్రయివేట్ బ్యాంకులు సైతం అదనపు మూలధన సమీకరణకు పెట్టుబడి మార్కెట్‌ను ఆశ్రయించాయి. ఈ సమయంలో 2004 మార్చిలో ప్రయివేట్ రంగ బ్యాంకులలో ఆటోమేటిక్ మార్గంలో 74 శాతం వరకు విదేశీ పెట్టుబడిని అనుమతించటానికి ప్రభుత్వం అంగీకరించింది. కొన్ని ప్రయివేట్ బ్యాంకులు విదేశీ పెట్టుబడిని ఆహ్వానించి విదేశీ బ్యాంకులుగా మారాయి. ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు ఈ కోవలోనివే. ఈ రకంగా భారతదేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించటానికి, విదేశీ బ్యాంకుల విస్తరణను పెంచటానికి బేసెల్-2 ప్రమాణాలు సాధనాలయ్యాయి. బేసెల్-2 ప్రమాణాలు "సముచిత మూలధన నిష్పత్తి" 8 శాతంగా ఉండాలని నిర్దేశించగా, రిజర్వ్ బ్యాంకు 9 శాతంగా నిర్ణయించింది. కానీ భారత ప్రభుత్వం ఈ నిష్పత్తి 12 శాతం ఉండాలని ఆదేశించింది. దీంతో వాణిజ్య బ్యాంకులు సమీకరించాల్సిన మూలధన పరిమాణం అనూహ్యంగా పెరిగింది. బ్యాంకుల అదనపు మూలధన సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్యనిధి నుండి రెండు బిలియన్ డాలర్ల మొదటి విడత రుణాన్ని పొందింది.

> **❝ ఈ సమయంలో 2004 మార్చిలో ప్రయివేట్ రంగ బ్యాంకులలో ఆటోమేటిక్ మార్గంలో 74 శాతం వరకు విదేశీ పెట్టుబడిని అనుమతించటానికి ప్రభుత్వం అంగీకరించింది. కొన్ని ప్రయివేట్ బ్యాంకులు విదేశీ పెట్టుబడిని ఆహ్వానించి విదేశీ బ్యాంకులుగా మారాయి. ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు ఈ కోవలోనివే. ❞**

**బేసెల్-3 ప్రమాణాలు :**

అత్యధిక లాభాల వేటలో నిజ ఆర్థిక వ్యవస్థను లక్ష్య పెట్టకుండా ద్రవ్య పెట్టుబడి చేపట్టిన వికృత చేష్టలు 2007/2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి కారణభూతం కాగా, వాటిని అరికట్టే చర్యలేమీ చేపట్టకుండా, ఇటువంటి సంక్షోభాల నుండి బ్యాంకులను, ద్రవ్య వ్యవస్థలను పరిరక్షించే కర్తవ్యాన్ని బేసెల్-3 ప్రమాణాలు నెత్తికెత్తుకున్నాయి. అమితమైన నిధుల లభ్యత (లిక్విడిటి), అత్యధికమైన అప్పులు/మూలధన నిష్పత్తి (లివరేజ్ రేషియో), అతి తక్కువ మూలధనం, చాలీచాలని నిధుల లభ్యత 2008 ద్రవ్య సంక్షోభానికి ప్రధాన కారణాలుగా బేసెల్ కమిటీ భావించింది. వీటితో పాటు రిస్క్ యాజమాన్యం, కార్పొరేట్ పాలన, మార్కెట్ పారదర్శకత మరియు పర్యవేక్షణ నాణ్యతలు లోపభూయిష్టంగా ఉన్నట్లు అభిప్రాయపడింది. బ్యాంకుల సుస్థిరతే కాకుండా "మొత్తం ద్రవ్యవ్యవస్థ సుస్థిరత" ధ్యేయంగా బేసెల్-3 ప్రమాణాల ప్రతిపాదనలు తయారయ్యాయి. బేసెల్-2 ప్రమాణాల కంటే కనీస సముచిత మూలధనంలో మెరుగైన నాణ్యతను, గణనీయమైన పరిమాణాన్ని ఈ ప్రమాణాలు నిర్దేశిస్తున్నాయి. అలాగే నిధుల లభ్యత (లిక్విడిటీ) నిష్పత్తిపై విడివిడి దేశాలకు స్వేచ్ఛనివ్వకుండా విశ్వప్రామాణికమైన నిధుల లభ్యత నిష్పత్తిని ఖరారు చేయటానికి ఈ ప్రమాణాలు సిద్ధమయ్యాయి.

భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం కావడం, ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఒక ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారతదేశం పరిణామం చెందే దశలో ఉండటం ప్రధాన కారణాలుగా భారత రిజర్వ్ బ్యాంకు బేసెల్-3 ప్రమాణాల అమలుకు అంగీకరించింది. మొదట్లో ఈ ప్రమాణాలను భారత దేశంలో జనవరి - 1, 2013 నుండి అమలు చేయాలనుకున్నప్పటికి, ఏప్రియల్ 1, 2013 నుండి మొదలైన ఈ ప్రక్రియ 31 మార్చి 2019 నాటికి అన్ని విధాలుగా పూర్తి కావాలని రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించింది.

**బేసెల్-3 ప్రమాణాల ఖరీదెంత?**

ఈ ప్రమాణాల అమలుకు భారతీయ బ్యాంకులు, ప్రత్యేకించి జాతీయ బ్యాంకులు భారీ స్థాయిలో నిధుల్ని సేకరించాల్సి ఉంది. ఈ నిధుల్ని మొదటి అంచె (టైర్ 1) మూలధనం, రెండవ అంచె మూలధనంగా వర్గీకరించారు. మొదటి అంచె మూలధనం కింద బ్యాంకు వాటాదారుల నుండి సేకరించే అదనపు మూలధనం, బ్యాంకుల అంతర్గత నిధులైన మూలధనం, లాభాలు, బ్యాంకు వాటాలు అమ్మటం ద్వారా ఒనకూడే మూలధనం మరియు మొదటి అంచె హైబ్రిడ్ బాండ్ల అమ్మకం ద్వారా సేకరించిన నిధులు ఉన్నాయి. రెండవ అంచె మూలధనం కింద రెండవ అంచె బాండ్ల విక్రయం ద్వారా పొంద కలిగే నిధులు ఉన్నాయి. ఈ ప్రమాణాల ప్రకారం మొత్తం మూలధన నిష్పత్తి 31.3.2014 నాటికి 9 శాతంతో మొదలై, 31.3.2018 నాటికి 11.5 శాతానికి చేరుకోవాలి. వివిధ రేటింగ్ సంస్థల అంచనాలలో, భారత జాతీయ బ్యాంకుల్లో వచ్చే 4 సంవత్సరాల్లో అదనంగా కనీసం 4,60,120 కోట్ల రూపాయలు పెట్టుబడి సమీకరించవలసి ఉంది. ఇందులో మొదటి అంచె మూలధనం ఈక్విటీ రూపంలో 2,39,720 కోట్ల రూపాయలు, మొదటి అంచె మూలధన హైబ్రిడ్ బాండ్ల రూపంలో 1,55,900 కోట్ల రూపాయలు, రెండవ అంచె పెట్టుబడి బాండ్లరూపంలో 64,500ల కోట్ల రూపాయలు సమీకరించాలి. మొదటి అంచె, రెండవ అంచె పెట్టుబడి బాండ్లను సంస్థలు, వ్యక్తుల నుండి సమీకరించవచ్చును. కాని మొదటి అంచె మూలధనాన్ని జాతీయ బ్యాంకుల ఈక్విటీ వాటాల విక్రయం ద్వారా కాని, బ్యాంకుల అంతర్గత వనరులైన లాభాలు, రిజర్వ్ నిధుల ద్వారా కాని సమీకరించాలి.

**నిధుల సమీకరణలో కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ**

ఇంతటి భారీ నిధులు స్వంతంగా సమీకరించకలిగే శక్తి జాతీయ బ్యాంకులకు లేని కారణంగా, జాతీయ బ్యాంకుల అత్యధిక వాటాల హక్కుదారుడైన కేంద్ర ప్రభుత్వం ఈ నిధులను అందించవలసి ఉన్నది. గతంలో బేసెల్-1, బేసెల్-2, ప్రమాణాలు అమలు సందర్భంగా అవసరమైన మూలధనంలో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్ కేటాయింపుల ద్వారా సమకూర్చింది.

**“జాతీయ బ్యాంకులు మూలధన సమీకరణకు అవసరమైన నిధుల్ని వాటంతటవే వివిధ సృజనాత్మక పద్ధతులలో సమీకరించుకోవాలని, బ్యాంకుల మూలధన సమీకరణ కేంద్ర బడ్జెట్‌కు మరింత భారం కాకూడదన్న వాదనను మనం కూడా అంగీకరిస్తే, సృజనాత్మక ద్రవ్య సుస్థిరత చర్యలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకుల మూల ధన సమీకరణ బాధ్యత నుండి తప్పించుకుంటుంది.”**




2000-01 నుండి 2014-15 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం 80,200 కోట్ల రూపాయల పెట్టుబడిని జాతీయ బ్యాంకులకు సమకూర్చింది. ఇందులో 58,600 కోట్ల రూపాయలు 2010-11 నుండి 2013-14 మధ్య కాలంలో సమకూర్చినవే. కాని మోడీ నాయకత్వంలోని యన్‌డిఎ ప్రభుత్వం 2014-15 సంవత్సరంలో జాతీయ బ్యాంకుల మూలధన సమీకరణకు బడ్జెట్‌లో 11,200 కోట్ల రూపాయలు కేటాయించగా, వాస్తవంలో 6,900 కోట్ల రూపాయలు మాత్రమే అందించింది. కుదించిన ఈ మొత్తం కేవలం 9 జాతీయ బ్యాంకులకు వాటి పనితీరును బట్టి ప్రభుత్వం నిర్దిష్టంగా కేటాయించింది. మిగిలిన బ్యాంకులకు నిధుల కేటాయింపు శేష ప్రశ్నగానే మిగిలివుంది. దీనికి కొనసాగింపుగా 2015-16 సంవత్సరానికి బడ్జెట్ కేటాయిం పును 7940 కోట్ల రూపాయలకు తగ్గించింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ఒంటెత్తు పోకడలు జాతీయ బ్యాంకులకు మూలధనం అందించడానికి దాని వ్యతిరేకతను తెలియజేస్తున్నాయి.

**ముందస్తు వ్యూహంలో యన్‌డిఎ ప్రభుత్వం :**

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మూలధన సమీకరణ విషయంలో జాతీయ బ్యాంకులకిస్తున్న సందేశం సుస్పష్టంగానే ఉన్నది. ద్రవ్య సుస్థిరత (ఫిస్కల్ కన్సాలిడేషన్) మిషతో, జాతీయ బ్యాంకులకు మూలధనం కోసం జరిపే బడ్జెట్ కేటాయింపులు ద్రవ్య లోటును భారీగా పెంచుతుందని, భారత ఆర్థిక వ్యవస్థ లోటును భరించే స్థితిలో లేదని కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నది. పారిశ్రామిక ప్రగతి పేరుతో లక్షల కోట్ల రూపాయలను బడా పారిశ్రామిక వేత్తలకు రాయితీలు కట్టబెట్టినప్పుడు స్ఫురణకు రాని ద్రవ్యలోటు, ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలుగా ఆపార సేవలందించిన జాతీయ బ్యాంకుల మనుగడను నిలబెట్టేందుకు అందించాల్సిన నిధుల విషయానికి వచ్చేసరికి ప్రభుత్వానికి తలకు మించిన భారం అవుతుందని చెప్పటం కేంద్ర ప్రభుత్వ వర్గ దృక్పధాన్ని తేటతెల్లం చేస్తున్నది. జాతీయ బ్యాంకులు మూలధన సమీకరణకు అవసరమైన నిధుల్ని వాటంతటఅవే వివిధ సృజనాత్మక పద్ధతులలో సమీకరించుకోవాలని, బ్యాంకుల మూలధన సమీకరణ కేంద్ర బడ్జెట్‌కు మరింత భారం కాకూడదన్న వాదనను మనం కూడా అంగీకరిస్తే, సృజనాత్మక ద్రవ్య సుస్థిరత చర్యలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకుల మూలధన సమీకరణ బాధ్యత నుండి తప్పించుకుంటుంది. జాతీయ బ్యాంకులకు ప్రభుత్వ వాటాల విక్రయం ద్వారానే నిధులను సమీకరించుకోవటం అనివార్యమౌతుంది. 52 శాతానికి తగ్గకుండా జాతీయ బ్యాంకులు ప్రభుత్వ వాటాను తగ్గించుకోవచ్చునని 2015 మార్చిలో కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా పార్లమెంట్‌లో చేసిన ప్రకటనను ఈ పరిణామాలలో భాగంగా చూడాల్సివుంది.

**దొడ్డి దారిన జాతీయ బ్యాంకుల ప్రయివేటీకరణకు కుట్ర :**

రిజర్వ్ బ్యాంక్ బేసెల్-3 ప్రమాణాల అమలుకు నిర్ణయం తీసుకున్నప్పుడు ప్రభుత్వ అంచనాలు ఇలా ఉన్నాయి. వచ్చే నాలుగేళ్ళలో జాతీయ బ్యాంకులలో ప్రభుత్వ వాటా 52 శాతంకు తగ్గకుండా, ప్రభుత్వ వాటాల విక్రయం ద్వారా 1,60,825 కోట్ల రూపాయలు మొదటి అంచె, రెండవ అంచె మార్కెట్‌లో బాండ్ల విక్రయం ద్వారా 2,20,400 కోట్ల రూపాయలు, బడ్జెట్ కేటాయింపుల ద్వారా 78,895 కోట్ల రూపాయల మూలధనాన్ని సమీకరించాలి. ఈ కాలంలో జాతీయ బ్యాంకుల నుండి డివిడెండ్ల రూపంలో 34,500 కోట్ల రూపాయలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం నికరంగా భరించాల్సిన భారం రూ.44,395 కోట్లు అవుతుంది. అంటే సంవత్సరానికి 11000 కోట్ల రూపాయలు సరిపోతాయి. ఈ అంచనాలు చూడటానికి, వినడానికి సాధ్యమైనవిగా తోచినా, అచరణలో అవి అంత సులువుగా సుసాధ్యాలు కావని నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. జాతీయ బ్యాంకులలో ప్రభుత్వ ఈక్విటీ 43 శాతం బ్యాంకులలో 51-61 శాతంగా, 24శాతం బ్యాంకులలో 62-71 శాతంగా, 19 శాతం బ్యాంకులలో 72-81 శాతంగా, 14 శాతం బ్యాంకులలో 82 శాతంగా ఉన్నది. సెన్సెక్స్ గరిష్టంగా 29,000 పాయింట్ల స్థాయికి పెరిగిందనుకొని, ప్రస్తుత జాతీయ బ్యాంకుల వాటాలు బుక్ చేసే ధరకు, జాతీయ బ్యాంకులలోని 52 శాతానికి పైబడ్డ వాటాలన్నింటిని విక్రయించినా, 1,00,000 కోట్ల రూపాయలకు మించి మూలధన సమీకరణ సాధ్యం కాదని స్టాక్ మార్కెట్ నిపుణులు

అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ విధానం వలన జాతీయ బ్యాంకుల మూలధన సమీకరణలో ప్రభుత్వ ఈక్విటీని పెద్ద మొత్తంలో తగ్గించవలసి ఉంటుంది. దీని పర్యవసానంగా జాతీయ బ్యాంకులలో కేంద్ర ప్రభుత్వం తమ యాజమాన్యాన్నే వదలుకోవలసి వస్తుంది. ఈ అంచనాను రూఢీ చేస్తున్నట్లు, రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ ఆర్.గాంధీ కలకత్తాలో పత్రికా సమావేశంలో మాట్లా డుతూ జాతీయ బ్యాంకుల్లో 52 శాతానికి మించిన ప్రభుత్వ వాటాల విక్రయంతోనే బేసెల్-3 ప్రమాణాల అవసరాలు తీరవన్నారు.

> **“ కేంద్ర ప్రభుత్వం 2014 జనవరి 20న పి.జె.నాయక్ సారధ్యంలో ఒక కమిటీని వేసింది. ఈ కమిటీ 2014 మే 12న తన నివేదికను అందించింది. జాతీయ బ్యాంకుల పనితీరు లోపభూయిష్టంగా ఉందని, ఇవి ప్రభుత్వానికి గుదిబండలుగా ఉన్న కారణంగా జాతీయ బ్యాంకులలో ప్రభుత్వ వాటాలను 50 శాతం కంటే తక్కువకు కుదించి, వాటి పనితీరులో తీవ్ర మార్పుల్ని చేపట్టాలని సిఫార్సు చేసింది. ”**

**బ్యాంకులకు వినాశకారిగా మారిన ప్రగతి :**

మూలధన అవసరాలను అంచనా వేసేటప్పుడు, ఈ గణాంకాలు ఎలా వచ్చాయో కూడా అవగాహన చేసికొనవలసివుంది. జాతీయ బ్యాంకుల ఆర్థిక స్థాయిని బట్టి, భవిష్యత్తులో నిర్వహించబోయే వ్యాపారాన్ని బట్టి మూలధన పరిమాణం నిర్ణయించబడు తుంది. శీఘ్రంగా డిపాజిట్లు వసూలుచేసి, రుణాలు మంజూరు చేసినట్లయితే వాటిలో సమస్యలతో కూడిన ఆస్థులు పెరుగుతాయి. బేసెల్-3 ప్రమాణాల ప్రకారం సమస్యలతో కూడిన ఆస్థులు పెరిగితే, ఆస్థుల పరిమాణం పెరుగుతుంది. అందువలన సమస్యల మోతాదును బట్టి అవసరమైన మూలధన పరిమాణం పెరుగుతుంది. ఉదాహరణకు ఒక బ్యాంకు ఒక రంగంలో 1000 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే, కనీసం 90 కోట్ల రూపాయల మూలధనం సమకూర్చుకుంటే కాని రుణాల మంజూరుకు రిజర్వ్ బ్యాంకు అనుమతినివ్వదు. బేసెల్-3 ప్రమాణాలు ఐచ్ఛికమైనా, భారతదేశంలో ఒక బ్యాంకు ఈ ప్రమాణాల ప్రకారం మూలధన నిధుల్ని ఏర్పరచుకోకపోతే, ఆ బ్యాంకు కార్యకలాపాల నిర్వహణను రిజర్వ్ బ్యాంక్ అనుమతించదు. మూడీ స్ రేటింగు సంస్థ వాదనల ప్రకారం, భారతదేశంలో బ్యాంకుల వ్యాపారాభివృద్ధి ఒక మోస్తరుగా ఉండి, బ్యాంకుల నిరర్థక ఆస్థులు తగ్గుముఖంలో ఉంటే, బ్యాంకు ఋణ వితరణలో 62 శాతంగా ఉన్న 11 జాతీయ బ్యాంకులు 2015 నుండి 2019 ఆర్థిక సంవత్సరం వరకు కనీసం 1,50,000 కోట్ల రూపాయల నుండి 2,40,000 కోట్ల రూపాయల మూలధనం సమీకరించాల్సి ఉంటుంది. మూడీస్ రేటింగ్ సంస్థకు భారతదేశ అసోసియేట్ సంస్థ అయిన



రిజర్వు బ్యాంకు గవర్నర్ రఘురామ్ రాజన్

“ఇక్రా” 2010లో వేసిన అంచనా ప్రకారం 2019లోగా భారత దేశంలో జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు కలిసి 6 లక్షల కోట్ల రూపాయలు మూలధనం క్రింద సేకరించుకోవాల్సి ఉంటుంది. ఇంతటి భారీ నిధుల సమీకరణతో జాతీయ బ్యాంకులు బతికి బట్టకట్టేనా? పెట్టుబడులపై అధిక ఆదాయం (రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్) రావాలంటే అధికంగా వ్యాపారం చేయాలి. అధికంగా వ్యాపారం చేయాలంటే అధికంగా అదనపు మూలధనం సమీకరించాలి. ఈ మూలధనంలో మొదటి అంచె మూలధనం మార్కెట్లో బాండ్ల రూపంలో సమీకరిస్తే 5 సంవత్సరాలపాటు వడ్డీ, తర్వాత ఆ బాండు దారునికి ఈక్విటీ వాటాలు విక్రయించాలి. అంటే అధిక వ్యాపారం చేసి క్రమంగా ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడమే అవుతుంది. రెండవ అంచె బాండ్ల విక్రయం మొదటి అంచె బాండ్ల విక్రయాన్ని మించి ఉండకూడదు. రెండవ అంచె బాండ్ల విక్రయంతో మూలధనాన్ని సమీకరించాలంటే దాదాపు 11.5 శాతం వడ్డీ చెల్లించాలి. ఇది ఖర్చును పెంచి లాభాలను కుదిస్తుంది. ఇది ఈక్విటీపై ఆదాయాన్ని తగ్గిస్తుంది. ఫలితంగా వాటాల మార్కెట్ విలువ తగ్గుతుంది. 1వ అంచె మూలధన సమీకరణకు అధిక పరిమాణంలో బ్యాంకు వాటాలను అమ్మాల్సివస్తుంది. ఈ ప్రక్రియ కూడా జాతీయ బ్యాంకులలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచేదే. ప్రభుత్వం జాతీయ బ్యాంకులకు మూలధన వనరులను అందించకపోతే వాటి మనుగడ ప్రశ్నార్థకమౌతుందని పై అంశాలు స్పష్టం చేస్తున్నాయి.

**అంత్య క్రియలకు రంగం సిద్ధం :**

బేసెల్ ప్రమాణాల పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే, అవి ఆచరణలో అన్ని విధాలుగా జాతీయ బ్యాంకుల మనుగడకు విఘాతం కల్పించేవిగా ఉన్నాయి. దీనికి తోడు జాతీయ బ్యాంకుల పనితీరుపై కేంద్ర ప్రభుత్వం 2014 జనవరి 20న పి.జె.నాయక్ సారధ్యంలో ఒక కమిటీని వేసింది. ఈ కమిటీ 2014 మే 12న తన నివేదికను అందించింది. జాతీయ బ్యాంకుల పనితీరు లోపభూయిష్టంగా ఉందని, ఇవి ప్రభుత్వానికి గుదిబండలుగా ఉన్న కారణంగా జాతీయ బ్యాంకులలో ప్రభుత్వ వాటాలను 50 శాతం కంటే తక్కువకు కుదించి, వాటి పనితీరులో తీవ్ర మార్పుల్ని చేపట్టాలని సిఫార్సు చేసింది. బేసెల్-3 ప్రమాణాల అమలుతో ఉత్పన్నమయ్యే పరిణామాలను వినియోగించుకొని జాతీయ బ్యాంకులను ప్రైవేట్‌పరం చేయటానికి బాటలు వేయటమే ఈ సిఫార్సుల లక్ష్యంగా ఉంది. ఈ సిఫార్సులను సూత్రప్రాయంగా ప్రభుత్వం అంగీకరించినట్లు తెలుస్తున్నది. 2015 జనవరి 2, 3 తేదీలలో జ్ఞాన్ సంగం పేర పూనాలో జాతీయ బ్యాంకుల అధినేతలతో సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం జాతీయ

> **"పునర్నిర్మాణం చేయబడ్డ కార్పొరేట్ల బకాయిలలో 64 శాతం మౌలిక రంగాలకు సంబంధించిన సంస్థలవే. నయా ఉదారవాద విధానాలలో భాగంగా మౌలిక రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెంచాలనే ఉబలాటంలో ప్రభుత్వాలు జాతీయ బ్యాంకులను ఒత్తిడి చేసి ప్రైవేటు సంస్థలకు, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య సంస్థలకు ఇప్పించిన అప్పులు ఇవి."**


బ్యాంకులను ప్రైవేటు పరం చేసే మార్గదర్శకాలను (రోడ్ మ్యాప్) గురించి చర్చించినట్లు తెలుస్తున్నది.

**ప్రత్యామ్నాయం ఏమిటి :**

అదనపు మూలధన అవసర ప్రమాణాలు చాలా వింతగా ఉన్నాయి. బేసెల్-3 ప్రమాణాల రూపకల్పన ముందు అంతర్జాతీయ ప్రమాణాల కంటే భారతదేశ బ్యాంకింగ్ రంగంలో సముచిత మూలధన నిష్పత్తి చాలా ఆరోగ్యకరంగా ఉంది. బేసెల్-2 ప్రమాణాల ప్రకారం సాధారణ 1వ అంచె మూలధన నిష్పత్తి 2 శాతం ఉండాల్సి ఉండగా, భారతదేశ ప్రమాణం 3.6 శాతంగా ఉంది. బేసెల్-2 ప్రమాణాల ప్రకారం మొత్తం మూలధన నిష్పత్తి 8 శాతం కాగా, భారతదేశ ప్రమాణాలలో ఇది 9 శాతంగా ఉంది.

ప్రాథమికంగా ఇటువంటి అనుకూల పరిస్థితులున్నప్పటికీ, మూలధన అంచనాలు ఈ క్రింది కారణాల రీత్యా భారీగా ఉన్నాయని నిపుణులు భావిస్తూ, జాతీయ బ్యాంకుల పరిరక్షణకు కింది సూచనలు చేస్తున్నారు.

1) బ్యాంకింగ్ వ్యాపారంలో భారతదేశం భారీగా విస్తరింప బడుతుందని అంచనా వేయబడింది. 1990లలో స్థూల దేశీయోత్పత్తిలో షెడ్యూల్డ్ బ్యాంకుల రుణాలు 20-22 శాతం ఉండగా, 2003-04 నాటికి 55 శాతానికి చేరాయి. ఈ అనుభవంతో రుణాల విస్తరణ యధాతథంగా కొనసాగుతుందని అంచనా వేశారు. కాని 2000 సం॥లలో విదేశీ నిధులు భారీగా భారతదేశంలో ప్రవేశించి, తేలికగా నిధులు అందుబాటులోకి రావటంతో భారీగా ఋణాల విస్తరణ జరిగింది. బ్యాంకింగ్ రంగంలో చొరబడిన సరళీకరణ విధానాల మూలంగా విస్తారమైన రుణ గ్రహీతలతో పాటు అప్పులు చెల్లించని వారి సంఖ్యను కూడా పెరిగింది. ఫలితంగా స్థూల నిరర్థక ఆస్తులు పెరిగాయి.



కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ

అందువల్ల భారతదేశంలో అపరిమితంగా పెరిగిన బ్యాంకింగ్ వ్యాపార విస్తరణ ఆరోగ్య ఫలితాల్ని ఇవ్వనందున, అటువంటి వ్యాపారంపై ఆధారపడ్డ భవిష్యత్తు అంచనాలు సమంజసం కాదు. ఈ అంచనాల్ని తిరిగి సమీక్షించాలి.

2) ఈ మధ్య సంవత్సరాలలో గణనీయంగా పెరిగి, 2014 డిసెంబర్ నాటికి 5.6 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తుల స్థాయి ఇంకా పెరుగుతుందని అంచనా వేయబడింది. దీని పర్యవసానంగా కూడా అదనపు మూలధన పరిమాణ అంచనాను పెంచారు. మొండి బాకీలలో అత్యధిక శాతం సంపన్న వర్గాలు, రాజకీయ నాయకులవి. పారుబాకీల చిట్టాను బహిర్గతం చేసి, కఠిన చర్యలతో, చట్టాలతో బాకీల వసూళ్ళకు పూనుకోవడంలో పాలక వర్గాలు తగు రీతిలో స్పందించలేదు. డిసెంబర్ 2014 నాటికి జాతీయ బ్యాంకులలో నిరర్థక ఆస్తుల కింద 2,73,000 కోట్ల రూపాయలు, పునర్నిర్మాణం చేయబడ్డ కార్పొరేట్ బకాయిలు 2,72,000 కోట్ల రూపాయలు పేరుకుపోయి జాతీయ బ్యాంకులకు గుదిబండలుగా మారాయి. నిరర్థక ఆస్థులలో బకాయి పడ్డ మొదటి 30 సంస్థల బకాయిలు మొత్తం నిరర్థక ఆస్థులలో 37 శాతంగా ఉన్నాయి. పునర్నిర్మాణం చేయబడ్డ కార్పొరేట్ల బకాయిలలో 64 శాతం మౌలిక రంగాలకు సంబంధించిన సంస్థలవే. నయా ఉదారవాద విధానాలలో భాగంగా మౌలిక రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెంచాలనే ఉబలాటంలో ప్రభుత్వాలు జాతీయ బ్యాంకులను ఒత్తిడి చేసి ప్రైవేటు సంస్థలకు, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య సంస్థలకు ఇప్పించిన అప్పులు ఇవి. వీటి రికవరీ బాధ్యతా ప్రభుత్వానిదే.

3) బేసెల్-3 ప్రమాణాలు ప్రపంచ ద్రవ్య సంక్షోభానికి కారణమైన బ్యాంకుల సమస్యలనుద్దేశించి రూపకల్పన చేయబడినవి. భారత దేశంలో జాతీయ బ్యాంకులు ద్రవ్య సంక్షోభాన్ని సమర్ధవంతంగా ఎదుర్కోవడమే కాకుండా విస్తృతమైన సామాజిక బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. అందువల్ల బేసెల్-3 ప్రమాణాలను యథాతథంగా అమలు చేసి, జాతీయ బ్యాంకులను బలిచేయటం సమంజసం కాదు.

4) బేసెల్-3 ప్రమాణాల అమలులో అత్యుత్సాహం జాతి ప్రయోజనాలకే నష్టదాయకం. బేసెల్-3 ప్రమాణాల అమలు తుది గడువు మార్చలేని శిలాశాసనం కాదు. ఇప్పటికే 31.3.2018 నుండి 31.3.2019కి మార్చారు. ఈ తుది గడువును మరో 4 సంవత్సరాలు పెంచి, జాతీయ బ్యాంకుల అదనపు మూలధన అవసరాలను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు ద్వారానే తీర్చాలి.

5) ప్రపంచ దేశాలలో బ్యాంకులు, నియంత్రణ సంస్థలు బేసెల్-3 ప్రమాణాలను నిర్ధీత గడువు లోపు పూర్తిగా అమలు చేస్తారా లేదా అనే అంశం ఇంకా తేలాల్సి ఉంది. బేసెల్ ప్రమాణాల అమలు వర్ధమాన దేశాల మనుగడకు నష్టదాయకమనే భావన సర్వత్రా వ్యాపించివుంది.

6) జాతీయ బ్యాంకుల మనుగడకు ముప్పు కలిగించే నాయక్ కమిటీ సిఫార్సులను అమలు చేయరాదు. జాతీయ బ్యాంకులలో చిన్నా పెద్దా తేడా లేకుండా, ప్రభుత్వం అన్నింటికి అవసరమైన అదనపు మూలధనం అందించిన తరువాతే వాటి పనితీరును సమీక్షించాలి. వాటి పనితీరు మెరుగు పరిచేందుకు ఉద్యోగులు, అధికారుల సంఘాలతో చర్చించాలి.

7) అవసరమైతే జాతీయ బ్యాంకుల పరి రక్షణకు దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునివ్వాలి.

**అధ్యయనం**

# వ్యవసాయేతర పనులకు మళ్లుతున్న వ్యవసాయ కార్మికులు



రచయిత సుందరయ్య విజ్ఞానకేంద్రం ప్రధాన కార్యదర్శి

**వై. సిద్దయ్య**

గత కొద్దికాలంగా గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున మార్పులు కనిపిస్తున్నాయి. ఈ మార్పులు గ్రామీణ ఉపాధి అవకాశాల విషయంలో మరింత కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. గత ఆరు దశాబ్దాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వనరుల పొందికలో గణనీయమైన మార్పులకు దారితీశాయి. మూడు దశాబ్దాలుగా అమలు జరుగుతున్న సరళీకరణ ఆర్థిక విధానాలు ఈ మార్పులను మరింత వేగవంతం చేశాయి. వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయినాయి. వ్యవసాయేతర ఉపాధులు పెరుగుతున్నాయి. గడిచిన పదేళ్లలో అటు ప్రభుత్వ విధాన ప్రకటనల్లోను, ఇటు సామాజికోద్యమాల చర్చల్లోను ఈ మార్పుల పర్యవసానాలు కేంద్రస్థానం ఆక్రమిస్తూ వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన హాజీపురం గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆదాయ వనరుల పొందికలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయడానికి ఓ ప్రాథమిక ప్రయత్నం జరిగింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆ బాధ్యత స్వీకరించింది. ఈ సందర్భంగా చూసిన కొన్ని వాస్తవాలను, కలిగిన కొన్ని అభిప్రాయాలను పాఠకుల పరిశీలనార్థం ఇక్కడ పొందుపరుస్తున్నాను. ఈ గ్రామానికి సంబంధించి సామాజిక, ఆర్థిక వివరాల కోసం 2013 డిశంబరులో తొలి దఫా సర్వే జరిగింది. అనంతరం మరింత లోతైన అధ్యయనం కోసం మలి దఫా 2015 జనవరి చివరి వారంలో సర్వే బృందం ఈ గ్రామంలో పర్యటించింది. ఈ రెండు పర్యటనల్లో వెల్లడైన వివరాల ఆధారంగా ఈ పరిశీలనలు నమోదు చేయబడ్డాయి.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయేతర ఆర్థిక కార్యకలాపాల వాటా పెరుగుతూ వస్తున్నది. గ్రామీణ ప్రాంతాల ఆదాయ వనరుల పొందికలో వచ్చిన మార్పులకు ఈ అంశం ప్రధాన కారణం. గ్రామీణ ప్రాంతాల్లో పలు వ్యవసాయేతర పనులు ప్రవేశించాయి. నిర్మాణ రంగం ఊపందుకొంది. రహదారులు, నీటివనరులు, విద్యుత్ సరఫరా మెరుగ్గా ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో పాటు వ్యవసాయేతర పరిశ్రమలూ పుట్టుకొస్తున్నాయి. సమీప పట్టణాలు పెట్టుబడి ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. ఈ మార్పులన్నీ ఆచరణ రూపం దాల్చటానికి శ్రమ జోడింపు అవసరం. అప్పటి వరకు వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించిన ఈ పునాది వర్గాలు క్రమంగా వ్యవసాయం దివాళా తీయటం, దీర్ఘకాలం పాటు వేతనాలు స్థబ్దతకు లోనుకావటం, వ్యవసాయేతర రంగంలో పనిదొరికే రోజులు తక్కువగా ఉన్నా ఆదాయాలు ఎక్కువగా ఉండటంతో క్రమంగా పనుల కోసం గ్రామాలు వదిలి పట్టణాలకు చేరుతున్నారు. ఈ రకంగా గ్రామాలు వదిలి పట్టణాలకు చేరి నిలకడ లేని ఉపాధి, ఆదాయాల కోసం వెంపర్లాడుతున్న అసంఘటిత వర్గం ఒకటి రూపుదిద్దుకుంటుంటే, మరోవైపున దీర్ఘకాల వలసల రూపంలో నిలకడైన ఆదాయాల కోసం గ్రామం విడిచి వెళ్లే శ్రామిక శక్తి గణనీయంగా పెరుగుతున్నది. ఈ మార్పులు మేము ఎంపిక చేసుకున్న గ్రామంలో ఎలా ఉన్నాయి, వీటి సామాజిక ఆర్థిక పర్యవసానాలు ఏమిటి? అన్న అంశాలను వివరించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నాము.

**గ్రామం పరిచయం :** హాజీపురం ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో కనిగిరి తాలూకా చెందిన గ్రామం. భౌగోళిక స్వభావం, వాతావరణ ప్రభావం రీత్యా ఈ గ్రామం రాయలసీమ గ్రామాలను పోలి ఉంటుంది. తక్కువ వర్షపాతం, దీర్ఘకాల కరువులు, నామమాత్రపు వ్యవసాయోత్పత్తి ఈ గ్రామ ఆర్థిక లక్షణాలుగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా రాతినేల కావటంతో నికరంగా వ్యవసాయం సాగని భూమి ఇది. రెండువేల ఎకరాలకు సాగు నీరందించే చెరువు సమీపంలో ఉన్నా 20 ఏళ్లుగా వర్షాలు సరిగా లేక ఎండిపోయింది.

**తగ్గిపోతున్న వ్యవసాయ పనులు :** బోర్లక్రింద వరి పంట 500 యకరాల నుండి 100 యకరాలకు పడిపోయింది. 500 ఎకరాల్లో వేసిన నిమ్మతోట ఎక్కువ భాగం ఎండిపోయింది. సర్వేజరిగిన 2012-13 సంవత్సరంలో 600 ఎకరాల్లో పొగాకు, వెయ్యి ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. గ్రామంలో వ్యవసాయ పనుల్లో ఉపాధి కోల్పోతున్న ఈ వ్యవసాయ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి ఎక్కడ వెతుక్కుంటున్నారు? పూర్తిగా వ్యవసాయేతర పనులకు అంకితమవుతున్నారా? లేక ఒకే కుటుంబంలో వ్యవసాయ పనులతో పాటు వ్యవసాయేతర పనులు కూడా చేస్తున్నారా లేక ఒకే వ్యవసాయ కార్మికుడు కొంత కాలం వ్యవసాయ కార్మికుడిగానూ మరికొంత కాలం వ్యవసాయేతర కార్మికుడుగా వ్యవహరిస్తున్నాడా అన్నది ఆసక్తికరమైన ప్రశ్న. ఈ మార్పులు, వాటి పొందిక గమనించటానికి గాను ఎంపిక చేసిన కుటుంబాలను కలిసి మళ్లీ అధ్యయనం చేయటం జరిగింది. అయితే ఈ ఒక్క గ్రామం అందులోనూ పరిమితమైన నమూనా ఆధారంగా సార్వత్రిక నిర్ధారణలకు వచ్చే ప్రయత్నం చేయరాదన్న హెచ్చరికను గమనంలో

> **" గత కొద్దికాలంలో పొగాకు తప్ప మిగిలిన పంటల విస్తీర్ణం తగ్గిపోయింది. వ్యవసాయ కార్మికుల అవసరాన్ని బాగా తగ్గించే పంటలు ఈ కాలంలో మొదలైన మరో పద్ధతి కాంట్రాక్టు ప్రాతిపదికన క్యూబుల్లో జామాయిల్ మొక్కలు పెంచటం ఇవన్నీ కలుపుకున్నా గ్రామంలోని వ్యవసాయ కార్మికులందరికీ కుటుంబం గడుపుకోవటానికి సరిపోయినంత ఆదాయం ఇచ్చే పనులు దొరకని పరిస్థితి ఉంది. "**

ఉంచుకుని ఈ నిర్ధారణలు పరిశీలించాలి.

గ్రామంలో ప్రధాన పంట వర్జీనియా పొగాకు. ఇందులో ఆకుకొట్టడం, కాల్చటం, బ్యార్నీల నిర్వహణ వంటి పనుల్లో గ్రామంలోని వ్యవసాయకార్మికులకు ఉపాధి అవకాశాలు లేవు. మినుము, ఇతర ముతక ధాన్యాల్లో ఇన్ని రకాల పనులకు అవకాశం ఉండదు. ఇవన్నీ ప్రధానంగా కుటుంబ శ్రమ ఆధారంగా జరిగే పనులు. మరిన్ని రోజులు ఉపాధి కల్పించే పంట వరి. నాట్లు వేయటం మొదలు, నీరు పెట్టడం, కలుపు, కోత, నూర్పిడి, ధాన్యం ఇంటికి చేరవేయటం వంటి పనులు ఉంటాయి. కానీ గత కొద్దికాలంలో పొగాకు తప్ప మిగిలిన పంటల విస్తీర్ణం తగ్గిపోయింది. వ్యవసాయ కార్మికుల అవసరాన్ని బాగా తగ్గించే పంటలు ఈ కాలంలో మొదలైన మరో పద్ధతి కాంట్రాక్టు ప్రాతిపదికన క్యూబుల్లో జామాయిల్ మొక్కలు పెంచటం ఇవన్నీ కలుపుకున్నా గ్రామంలోని వ్యవసాయ కార్మికులందరికీ కుటుంబం గడుపుకోవటానికి సరిపోయినంత ఆదాయం ఇచ్చే పనులు దొరకని పరిస్థితి ఉంది.

**బయటి గ్రామాల కూలీలతో వ్యవసాయపు పనులు :** పైన చెప్పుకున్నట్లుగా ఈ గ్రామంలో ప్రధాన వాణిజ్య పంట వర్జీనియా పొగాకు. దిన కూలీ పద్ధతిలో చేస్తే ఎక్కువమందికి ఉపాధి కల్పించే పంట కూడా ఇదే అవుతుంది. కానీ పొగాకు పంట పడించే పద్ధతిలో వచ్చిన మార్పుల కారణంగా గ్రామంలోని వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి చూపించే పంటగా ఇది ఉండటం లేదు. గ్రామంలో పొగాకు కాల్చే బార్నీలు 50 ఉన్నాయి. ఒక్కో బార్నీ కింద 15-20 ఎకరాల్లో పొగాకు క్యూరింగ్ జరుగుతుంది. ఈ విధంగా మొత్తం వెయ్యి ఎకరాల్లో సర్వే కాలంలో పొగాకు పంట వేశారు. పొగాకు నాటటం, కలుపు తీయటం, ఆకు కోత, కర్రకు అల్లటం, బ్యారన్లోకి కర్ర ఎక్కించటం, ఆకు కాలాక కర్ర దించటం, బేళ్లు కట్టడం ప్రధానంగా ఉండే పనులు. ఈ పనులన్నీ దినకూలీల పద్ధతిలో జరిగిన రోజుల్లో ఊళ్లోవారందరికీ పని దొరికేది. కానీ ఈ మధ్య కాలంలో ఏడు బ్యారన్లకు 21 మంది చొప్పున ఇతర గ్రామాల నుండి కూలీల ముఠాలను తెస్తున్నారు. జతకు 50 వేల రూపాయలు తీసుకుని మూడ్నెల్లపాటు ఊళ్లో ఉండి పని చేయటం ప్రాతిపదికన బయటి గ్రామస్తులను తీసుకొస్తారు. అంటే వీరికి దినసరికూలీ 277 రూపాయలు మాత్రమే వస్తుంది. ఈ పనులకు ప్రభుత్వం నిర్ణయించిన కూలీరేట్ల కంటే దాదాపు 100 -150 రూపాయలు తక్కువ. మొత్తం 50 బారన్లలో పని నడవటానికి 7 ముఠాల కూలీలు (147మంది) బయటి నుండి - ప్రధానంగా చీరాల, కారంచేడు, వేటపాలెం, తెనాలి ప్రాంతాల నుండి - వీరు కాక ప్రతి మూడు బ్యారన్లకు ముగ్గురు చొప్పున టోకర్లు ( క్యూరింగ్ చేసేవాళ్లు) ఉంటారు వీరు కూడా ఇతర గ్రామాల నుండి వచ్చే వారే. సూత్రీకరణగా చెప్పుకోవాలంటే పంటల ప్రాధాన్యతలు, సేద్యం పద్ధతులు, యంత్రాల వినియోగం, కాంట్రాక్టు పద్ధతి ఉనికిలోకి రావటం, వలస కూలీల పట్ల రైతాంగం ఆసక్తితో వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని నిర్ధారించవచ్చు. దాంతో అనివార్యంగా వీరు కుటుంబ పోషణ కోసం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించాల్సి వస్తోంది.

**మహిళా వ్యవసాయ కార్మికులు :** మొత్తం ఎంపిక చేసిన కుటుంబాల్లో 95 మంది వ్యవసాయ కార్మికులు ఉంటే అందులో 56 మంది మహిళలు ఉండటం గుర్తించాల్సిన విషయం. కూలీ డబ్బుల కోసం రైతాంగం దగ్గరకు వెళ్లినపుడు ఈసడింపుగా వ్యవహరించటం వీరి జీవితాల్లో అంతర్భాగంగా ఉంటోంది. సాధారణంగా పొగాకు పంట అయ్యాక కర్రకు కట్టిన పొగాకు పోగా మిగిలిన గుల్ల పొగాకు ఏరుకొని అమ్ముకోవటం వ్యవసాయ కార్మిక కుటుంబాలకు అదనపు ఆదాయంగా ఉండేది. ఈ మధ్య కాలంలో రైతాంగం ఈ సాంప్రదాయానికి స్వస్తి పలకటంతో నాలుగు రూపాయల కోసం గుల్లపొగాకు ఏరుకునే వ్యవసాయకార్మికులు రైతాంగం చేతుల్లో అవమానాల పాలవుతున్నారు.

**వ్యవసాయేతర పనులు :** ఈ నేపథ్యంలో గ్రామంలో ఉన్న వ్యవసాయేతర ఉపాధి అవకాశాల పరిశీలనకు ప్రత్యేక ప్రయత్నం జరిగింది. గ్రామస్తుల జనాభా లెక్కలు, నమూనా సర్వేలో వెల్లడైన వివరాల మేరకు గ్రామ జనాభాలో ప్రభుత్వోద్యోగులు తొమ్మిదిమంది, ప్రైవేటు ఉద్యోగులు 36 మంది నెలసరి వేతనాలు పొందుతున్నారు. రియల్ ఎస్టేట్, చిల్లర దుకాణాలు నడుపుతున్న వారు, సాంప్రదాయక వృత్తులు, భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్నవారు, పొగాకు కూరింగ్ కోసం కట్టెలు కొటడం, గుల్లపొగాకు ఏరటం, అమ్ముకోవటం, ఎలక్ట్రీషియన్ ఆర్ఎంపీగాను, టైలర్లుగాను, పశువుల కాపరులుగా పనులు చేస్తున్నవారు 81 మంది ఉన్నారు. మరో 45 మంది దీర్ఘకాల వలసలు వెళారు. ఇందులో ప్రభుత్వోద్యోగులు తప్ప మిగిలిన వారంతా నిలకడలేని ఆదాయాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడుతున్న వారే ఉండటం గమనార్హం. ఆర్గురు ట్రాక్టరు డ్రైవర్లు, నల్గురు ఉపాధ్యాయులు, ముగ్గురు నర్సులు, ఇద్దరు పాస్టర్లు, ఒకరు బేకరీలో పని చేసే కార్మికుడు ఉన్నారు. ఒకరు హొటల్లోనూ, మరో ఇద్దరు రైస్ మిల్లులోనూ పని చేస్తుంటే మరో నల్గురు షాపుల్లో గుమస్తాలుగా పని చేస్తున్నారు. వీరిలో ఉపాధ్యాయులు, ట్రాక్టరు డ్రైవర్లు మినహా మిగిలిన వారి వేతనాలు వారు చేసే శ్రమకు తగిన రీతిలో లేవు.

### దళితవాడలలో శ్రామికులు వారు చేస్తున్న పనులు

**దళిత కుటుంబాల్లో శ్రామికుల పరిస్థితి :** మొత్తం 121 దళిత కుటుంబాల్లో 251మంది శ్రామికులు ఉన్నారు. 120 మంది శ్రామిక మహిళాలు, 131 మంది పురుషులున్నారు. వీరిలో వ్యవసాయ పనులతో పాటు వ్యవసాయేతర పనులు కూడా చేసే వారు 75 మంది ( 61 మంది మాల, 14 మంది మాదిగ కులస్తులు). వ్యవసాయ కూలీపనే ప్రధాన ఆదాయంగా ఉన్న వాళ్లు 19 మంది ( 5 మంది మాలకులస్తులు, 14 మంది మాదిగ కులస్తులు). వ్యవసాయేతర పనులే ప్రధాన ఆదాయంగా ఉన్న వారు 58 మంది ( 47

మంది మాల కులస్తులు, 11 మంది మాదిగ కులస్తులు) దీర్ఘకాలం వలసల్లో వ్యవసాయేతర పనులు ప్రధానంగా ఉన్న వారు మొత్తం 45 మంది. గ్రామంలో కాపురముంటూ కనిగిరి పట్టణం పరిసర మండల కేంద్రాలలో భవన నిర్మాణం ఇతర వ్యవసాయేతర పనులకు వెళ్ళేవారు 92 ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధుల్లో నెలవారి వేతన సిబ్బంది 37 మంది మొత్తం 251 మంది ఉపాధుల పరిస్థితి ఇది. మొత్తం 251 మంది శ్రామికుల్లో 174 మంది వ్యవసాయేతర పనులు ప్రధానంగా చేస్తున్నారు.

**వలసలు :** ఈ గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య వారసత్వ సమస్యగా ఉంది. ఫ్లోరైడ్ బారిన పడి అనారోగ్యం పాలై, అనారోగ్యం నుండి బయటపడటానికి అప్పుల పాలవుతున్న వ్యవసాయ కార్మికులు అప్పుల భారం నుండి బయట పడటానికి వలస కార్మికులవుతున్నారు. అంతేకాక పైన చెప్పుకున్న కారణాల వల్ల గ్రామంలో జీవనోపాధి అవకాశాలు తగ్గిపోవటంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవటానికి వలసలు తప్ప వేరే మార్గం లేని వ్యవసాయ కార్మిక కుటుంబాలు పెరుగుతున్నాయి. సర్వే కాలంలో 19 మంది చెన్నయ్‌కు, 14 మంది హైదరాబాద్‌కు, ఏడుగురు బెంగుళూరుకు, బళ్లారికి ముగ్గురు, భిలాయ్‌కు ఏడుగురు, కరీంనగర్‌కు తొమ్మిది మంది, నిర్మల్ ఇద్దరు, దొనకొండ ఇద్దరు, నెల్లూరు, విజయవాడ, ముంబయికి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 66 మంది వలస వెళ్లారు. 250-330 రోజుల పాటు వలస వెళ్లిన వారు ఏడుగురు ఉంటే, 180-200 రోజుల పాటు వలస వెళ్లినవారు 14 మంది ఉండగా, 90 రోజుల పాటు వలస వెళ్లిన వారు 16 మంది, 30-60 రోజుల మధ్యలో వలస వెళ్తున్నవారు ఇద్దరు ఉన్నారు. 20 కుటుంబాలు దాదాపుగా గ్రామం వదిలి ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. పండుగలు, శుభకార్యాల సమయంలో మాత్రమే గ్రామానికి వస్తున్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం సమయంలో ఈ గ్రామం నుండి కొంతమంది వెళ్లి అక్కడ స్థిరపడ్డారు ఆ పరిచయాలతో ఇప్పటికీ కొంతమంది ఉపాధి వెతుక్కుంటూ భిలాయ్ వెళ్తున్నారు. అదేవిధంగా చెన్నై మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులుగా ఈ గ్రామానికి చెందిన కొందరు పని చేశారు. దాంతో భిలాయ్ లాగానే చెన్నైయ్‌కు కూడా కొందరు ఉపాధి వెతుక్కుంటూవెళ్తున్నారు.

**వ్యవసాయ కూలీల వేతనాలు :** గ్రామంలో వ్యవసాయ కార్మిక వేతనాలు పురుషులకు

> **❝ మొత్తం గ్రామస్తులకు 1572 యకరాల భూమి ఉన్నట్లు సర్వేలో తెలిపారు. అందులో 1386.38 యకరాలు అగ్రకులాలకు చెందిన వారి చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. అంటే గ్రామంలో 34.97 శాతంగా ఉన్న జనాభా చేతుల్లో 88 శాతం భూమి కేంద్రీకృతమై ఉంది. 42.8 శాతంగా ఉన్న దళితుల చేతుల్లో 7.42 శాతం భూమి మాత్రమే (116.71 యకరాలు) ఉంది. ❞**

## 2013 సర్వే సమాచారం మేరకు

**జనాభా పొందిక :** 2013లో జరిగిన సెన్సెస్ సర్వే ఆధారంగా మొత్తం గ్రామంలో 284 కుటుంబాలు ఉన్నాయి. అందులో 42.8 శాతం ( 121 కుటుంబాలు) దళిత కుటుంబాలు. మొత్తం జనాభా 1278. స్త్రీలు 623 మంది. పురుషులు 655 మంది. మొత్తం జనాభాలో దళితులు 578 మంది, వెనకబడిన కులాలకు చెందిన వారు 247 మంది, ఇతరులు 447 మంది.

**భూకేంద్రీకరణ :** మొత్తం గ్రామస్తులకు 1572 యకరాల భూమి ఉన్నట్లు సర్వేలో తెలిపారు. అందులో 1386.38 యకరాలు అగ్రకులాలకు చెందిన వారి చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. అంటే గ్రామంలో 34.97 శాతంగా ఉన్న జనాభా చేతుల్లో 88 శాతం భూమి కేంద్రీకృతమై ఉంది. 42.8 శాతంగా ఉన్న దళితుల చేతుల్లో 7.42 శాతం భూమి మాత్రమే (116.71 యకరాలు) ఉంది. ఇదికాక గ్రామ పంచాయతీ పరిధిలో 950 ఎకరాలు బంజరు భూములను బినామిల పేర పట్టాలు పొందారు. అలాంటి బినామి భూములు అగ్రకులాలకు చెందిన వారిలో సైతం కేవలం రెండు కుటుంబాల్లో 400 యకరాల బినామి భూమి ఉంటే మరో 4 కుటుంబాల చేతుల్లో 100 యకరాల చొప్పున బినామి భూములున్నాయి. గ్రామాల్లో రాజకీయ పెత్తనం ఈ రెండు కుటుంబాల చుట్టూనే తిరుగుతుందని కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. ఉన్నత కులాలకు చెందిన వారిలో 16 మందికి కనిగిరి మున్సిపాలిటీలోనూ, ఒకరికి గుంటూరు, మరొకరికి ఒంగోలులో విశాలమైన, ఖరీదైన భవనసముదాయాలు ఉన్నాయి. ఈ కుటుంబాలు తమ వ్యవసాయక లాభాలను వ్యవసాయేతర వనరుల్లో పెట్టుబడులుగా మార్చుకుంటున్న వైనం ఇక్కడ మనకు కనిపిస్తుంది.

**విద్యారంగంలో సామాజిక తరగతులు :** మొత్తం జనాభాలో 276 మంది నిరక్షరాస్యులు. ఇందులో దళితులు 191 మంది. మొత్తం నిరక్షరాస్యుల్లో దళితులు 69.2 శాతం ఉంటే దళిత జనాభాలో నిరక్షరాస్యులు 33 శాతం ఉన్నారు, అగ్రకులాలకు చెందిన జనాభాలో నిరక్షరాస్యులు 48 మంది ఉండగా వెనకబడిన తరగతులకు చెందిన కుటుంబాల్లో 35 మంది ఉన్నారు. పదో తరగతి వరకు చదివిన వారి సంఖ్య 356. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ముగ్గురు ఒసిలు ఉండగా దక్షిణాఫ్రికాలో మరో ఒసి కుటుంబానికి చెందిన వ్యక్తి ఉద్యోగం చేస్తున్నారు.

**గ్రామంలో ఉపాధి అవకాశాలు :** మొత్తం పని చేయగలిగే వయసులో ఉన్న వారిలో ఒసిలు 447. బిసిలు 247 మంది, దళితులు 578 మంది. వ్యవసాయ కార్మికుల్లో దళితులు 113 (47.47 శాతం) 81 మంది వెనకబడిన కులాలకు చెందినవారు ఉన్నారు. వ్యవసాయం చేస్తున్న 171 మందిలో 149 మంది (87.14శాతం) మంది ఒసిలు, బిసిలు 11 మంది ఎస్సీలు 10 మంది మాత్రమే ఉన్నారు. వ్యవసాయేతర పనులు చేసే 291 మందిలో దళితులు 201 మంది (69.41శాతం) ఉంటే బిసిలు 10.3 శాతం ఉన్నారు. ఒసీలు 17.5 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు. ఇక్కడ స్వంత భూములు లేనివారు ఎక్కువమంది వ్యవసాయేతర పనులను ఎంచుకుంటున్నారన్న విషయం స్పష్టంగా కనిపిస్తుంది.

> **" గ్రామంలో వ్యవసాయ కార్మిక వేతనాలు పురుషులకు రు.200 నుండి - రు.250 మధ్య ఉంటే స్త్రీలకు రు.100 నుండి 150 రూపాయల మధ్య ఉన్నాయి. 2013 రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడో జోన్‌లో ఉన్న హాజీపురంలో వ్యవసాయ కార్మిక వేతనాలు రు.234 మొదలు రు.310కి తగ్గకుండా ఉండాలి. కానీ గ్రామంలో ఎక్కడా ఈ స్థాయిలో వేతనాలు అమలు జరగటం లేదు. "**

రు.200 నుండి – రు.250 మధ్య ఉంటే స్త్రీలకు రు.100 నుండి 150 రూపాయల మధ్య ఉన్నాయి. 2013 రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడో జోన్‌లో ఉన్న హాజీపురంలో వ్యవసాయ కార్మిక వేతనాలు రు.234 మొదలు రు.310కి తగ్గకుండా ఉండాలి. కానీ గ్రామంలో ఎక్కడా ఈ స్థాయిలో వేతనాలు అమలు జరగటం లేదు. దాంతో మెరుగైన వేతనాల కోసం సమీపంలోని కనిగిరి పట్టణానికి భవన నిర్మాణ కార్మికులుగా వెళ్తున్నారు భవన నిర్మాణ కూలీలకు పురుషులకు 250 రూపాయలు, స్త్రీలకు 200 రూపాయలు ఇస్తున్నారు. మేస్త్రీ కూలీకి రు.400 వస్తుంది. వ్యవసాయ కార్మికులుగానూ, వ్యవసాయేతర కార్మికులుగానూ పని చేస్తున్న వారిని ఒకరిద్దరిని పరామర్శించగా వెల్లడైన వివరాలు ఇలా ఉన్నాయి.

**రెట్టింపు శ్రమ ఫలితం**


లక్ష్మయ్య 80 రోజుల పాటు వ్యవసాయ కార్మికుడిగానూ 60 రోజుల పాటు వ్యవసాయేతర కార్మికుడిగానూ పని చేసి మొత్తం రు.30000 వేతనాల రూపంలో సంపాదించాడు. అందులో 60 శాతం వ్యవసాయేతర పనుల ద్వారా సంపాదించినదే. మరో వ్యవసాయ కార్మికుడు చెన్నయ్య 90 రోజుల పాటు వ్యవసాయ కూలీగా పని చేయటంతో పాటు మరో 50 రోజుల పాటు భవన నిర్మాణ కార్మికుడిగా గ్రామం బయట పని చేశాడు. మొత్తం 47 వేల రూపాయలు సంపాదించాడు. ఇతని ఆదాయంలో 52 శాతం వ్యవసాయేతర పనుల ద్వారా వచ్చింది. నరోజనమ్మ, విజయరాణిలు వ్యవసాయ కూలీలుగా 100 రోజులు భవన నిర్మాణ కూలీలుగా 50 రోజులు పని చేశారు. వీరి ఆదాయంలో రెండు రకాల పనుల ద్వారా వచ్చిన ఆదాయాలు 50 శాతం చొప్పున ఉన్నాయి. స్వరూపరాణి పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. వ్యవసాయ పనులు, వ్యవసాయేతర పనుల్లో సమానమైన రోజులు పని చేసినప్పటికీ వ్యవసాయ కూలీగా ఆమె రు.7500 మాత్రమే సంపాదించగా వ్యవసాయేతర పనుల్లో రు. 15000 సంపాదించింది. దానయ్య వ్యవసాయ కూలీగా 180 రోజులు పని చేసి రు.45000 సంపాదిస్తే వ్యవసాయేతర కూలీగా పని చేసిన 70 రోజులకు రు.35000 సంపాదించారు. వ్యవసాయ కూలీ పనులు, వ్యవసాయేతర కూలీ పనుల్లో ఒకేమోతాదు శ్రమకు రెట్టింపు సంపాదన అన్నది గ్రామీణ పేదల్లో జీవితాల్లో దైనందిన సత్యం.

**అస్థిత్వంకై పోరాటం :** హాజీపురం గ్రామంలో వ్యవసాయ కార్మికులు ముఖ్యంగా దళితులు, వెనకబడిన కులాలకు చెందిన వారు న్యాయమైన వేతనాల కోసమే కాదు, తమదంటూ గౌరవప్రదమైన అస్థిత్వం కోసం కూడా నిరంతర పోరాటం సాగిస్తున్నారు. వ్యవసాయేతర పనుల ద్వారా మెరుగైన ఆదాయాలు సంపాదిస్తున్న ప్రభుత్వం ఇచ్చిన సహాయానికి కొంత శ్రమ ఫలితాన్ని జోడించి స్వంత ఇల్లు కట్టుకున్నారు. కొద్ది మంది యువకులు మోటార్‌సైకిళ్లు కొనుక్కున్నారు. వీటిద్వారా దూర ప్రాంతాలకు సైతం వెళ్లి మెరుగైన ఉపాధి సంపాదించుకో గలుగుతున్నారు. మెరుగైన ఆదాయాలు తెచ్చుకుంటున్నారు. మరికొద్దిమంది భావితరా లకు కూడా కాస్తంత గుర్తింపు తెచ్చి పెట్టే చిన్న చిన్న కమతాలు కొనుగోలు చేసుకున్నారు. ఈ వెసులుబాటు ఉండబట్టే గ్రామంలో సగానికి పైగా వ్యవసాయ కార్మికులు సంవత్సరంలో కొంత కాలం వ్యవసాయేతర కార్మికులుగా పని చేయటానికి సిద్ధపడుతున్నారు

గ్రామీణ ప్రజలను తమ సంకెళ్లలో ఇంకా బంధించి ఉంచుతున్న అర్ధభూస్వామ్య అవశేషాలు గ్రామీణ పేదలను మరింత అణిచిపెట్టి ఉంచుతున్నాయి. ఈ గ్రామం వెంకటగిరి జమీందారీలో భాగం. నాటి నుండీ ఈ గ్రామం భూస్వామ్య పీడన పదఘట్టనల నడుమ నలుగుతూనే ఉంది. ఈ భూస్వామ్య అవశేషాల్లో మనిషిని మనిషిగా గుర్తించే మానవత్వం లేదు. ఇక సమానత్వం గురించిన ఊసే లేదు. తన జ్ఞాపకాల పొరల్లో తొలగించి నాటి పరిస్థితులను నేటి పరిస్థితులను పోల్చి చూస్తున్న మాదిగపల్లెకు చెందిన దంతెజాన్ (72) ఇలా చెప్తున్నారు. " మా పూర్వీకులు వృత్తి రీత్యా చర్మకారులు. పని చేసే ఓపికున్న వాళ్లందరూ ఆసాముల పొలాల్లో పనులకు వెళ్లాల్సిందే. వారిని కాదని ఇతరులకు పనికి వెళ్తే బూతులు తిట్టేవాళ్లు. కాపుల (రెడ్డిగార్ల) ఇళ్లల్లో పిల్లలు కూడా మా వయసుకు గౌరవం ఇచ్చే వాళ్లు కాదు. ఒరేయ్, ఒసేయ్ అనే పిలుపులే మాకు బిరుదులు. మేము ఊళ్లోకి వెళ్తే రైతులు అరుగుల మీద కూచ్చుంటే మేము నేల మీద కూచ్చుని చేతులు కట్టుకుని మాట్లాడి రావాలి. వాళ్లు మా పల్లెకు వస్తే పసికందును ఎత్తుకున్న బాలింత అయినా, నిండు గర్భిణి అయినా, అన్నం తింటున్న మనిషి అయినా వాళ్లు వెళ్లేదాకా లేచి నిలబడాల్సిందే. పల్లెల్లో ఏ గొడవలు జరిగినా రచ్చబండ వద్ద పంచాయితీ పెట్టి మోయలేని జరిమానాలు విధించేవారు. చివరకు ఆ పంచాయితీలకు వెళ్లటం మానేశాం. ఇప్పుడు పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. పల్లె ఊరుకు దూరంగా జరిగింది. పల్లెలో పిల్లలు చదువుకుంటున్నారు. నాలుగు విషయాలు తెలుసుకుంటున్నారు. 75 కుటుంబాలున్న మాదిగపల్లెలో మాదిగ దండోరా ప్రభావం గణనీయంగానే ఉంది. ఇటీవలే కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం పట్ల యువత ఆకర్షితులవుతున్నారు. కానీ రాజకీ యంగా మాత్రం వైఎస్ఆర్‌సిపి, తెలుగుదేశం పెత్తనం కింద ఉన్నారు. వ్యవసాయ కూలీలుగా ఊళ్లోనే ఉంటూ కాపుల పెత్తనానికి తలొంచటం మా పిల్లలకు ఇష్టం లేదు. అందుకే ఊరి పెత్తందార్ల నీడ లేని వ్యవసాయేతర పనులకు ఆసక్తి చూపుతున్నారు."

వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు అస్థిత్వం కోసం పడుతున్న ఆరాటం, ఆర్థిక వెసులుబాటు కోసం జరుపుతున్న పోరాటం రానున్న కాలంలో గ్రామీణ రాజకీయాల్లో నూతన సమీకరణలకు పునాదులు వేయనున్న దన్న ఆశాభావాన్ని కలిగిస్తున్నాయి.

# చైనాపై యుద్ధానికి అమెరికా వ్యూహం



రచయిత అంతర్జాతీయ పరిణామాల విశ్లేషకులు

**నిక్ బీమ్స్**

చైనాతో సంబంధాలలో గతంలో ఏనాడూ లేనంత ఎక్కువ దురాక్రమణ పూరిత విధానాలను అనుసరించాలని అమెరికా విదేశీ సంబంధాలశాఖలోని పలుకుబడి కలిగిన కౌన్సిల్ రూపొందించిన రిపోర్టులో వెల్లడైంది. అమెరికా విదేశీ వ్యవహారాలశాఖ లాబీలలో ఈ అంశంపై తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి.

“ చైనా పట్ల అమెరికా అనుసరిస్తున్న గొప్ప వ్యూహాన్ని పున:పరిశీలన చేయటం” గా పేరు పెట్టబడిన ఈ రిపోర్టు యుద్ధానికి ఎజెండా మినహా మరేమీకాదు. అమెరికా విదేశీ సంబంధాల శాఖతోనూ, విదేశాంగ విధానానికి సంబంధించిన వివిధ తరహాల మేధావుల తోనూ సన్నిహిత సంబంధాలు కలిగిన రాబర్ట్ డి బ్లాక్‌విల్, అష్లీ జె టెల్లిస్‌లు ఈ రిపోర్టును రూపొందించారు.

ఈ నివేదికలో రెండవ ప్రపంచయుద్ధం సందర్భంగా రూపొందించిన “గొప్ప వ్యూహం” అన్న నివేదికలోని భాగాలను పేర్కొన్నారు.“ ఒక దేశం యొక్క ఆయుధాలను, విధానాలను యుద్ధం అవసరంలేని విధంగా, లేదా యుద్ధంలో విజయం సాధించటానికి గరిష్టంగా అవకాశాలుండే విధంగా సమన్వయం చేయాలి” అని నివేదికలో చెప్పారు. ఇది యుద్ధాన్ని గురించిన భావన మాత్రమే కాక “ దేశంయొక్క రాజకీయ వ్యవహారాల నిర్వహణలో అన్ని సమయాలలో అనుసరించవలసిన అంశం” అని చెప్పారు.

చైనా అభివృద్ధి చెందటంతో అమెరికా ప్రపంచాధిపత్యానికి ప్రమాదం ఏర్పడిందని, ఆర్థిక, దౌత్య, సైనిక రంగాల ద్వారా దీనిని సరిదిద్దాలనేది నివేదికలో కీలకాంశంగా చెప్పారు.

రచయితలు నివేదిక ప్రారంభంలో 1992లో పెంటగాన్ రూపొందించిన డిఫెన్స్ ప్లానింగ్ గైడెన్స్ రిపోర్టును ఉదహరించటం ప్రాధాన్యత కలిగిన అంశం. సోవియట్ యూనియన్ కుప్పకూలిన సందర్భంగా రూపొందించిన ఆ నివేదికలో “ అమెరికా ఆధిపత్యానికి భవిష్యత్‌లో ఎటువంటి ప్రపంచ పోటీదారుడు అభివృద్ధి కాకుండా నిరోధించే విధంగా” అమెరికా వ్యూహం ఉండాలని నొక్కిచెప్పారు.

మొదట ప్రాంతీయ ఆధిపత్యానికి, తర్వాత ప్రపంచాధిపత్యానికి చైనా “గొప్ప వ్యూహం” రూపొందించిందని, ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధి క్రమంలో చైనా అభివృద్ధి సాధించటమే అమెరికా ఆధిపత్యానికి ప్రమాదాన్ని కలిగించిందని రచయితలు పేర్కొన్నారు.

జర్మనీ అభివృద్ధి బ్రిటన్‌పై చూయించే ప్రభావాన్ని గురించి 1907 ప్రారంభంలో బ్రిటిష్ విదేశాంగశాఖ అధికారి ఐరే క్రోవే రూపొందించిన నివేదికలోని అంశాలను ఈ నివేదికలో ఉటంకించారు. నాయకుల అభిప్రాయాలేవైనప్పటికీ అంతర్గతంగా, అంతర్జాతీయంగా జర్మనీ ఆర్థిక విస్తరణ బ్రిటిష్ సామ్రాజ్యానికి ప్రమాదంగా పరిణమిస్తుందని క్రోవే తన నివేదిక ముగింపులో చెప్పాడు. ఏడు సంవత్సరాల తర్వాత రెండు దేశాలు యుద్ధంలోకి దిగాయి.

చైనా జర్మనీలాగా సామ్రాజ్యవాదశక్తి కాదు. కాని దానియొక్క ఆర్థికాభివృద్ధి అమెరికా స్థితిని దిగజారుస్తున్నది.

“ చైనాను అంతర్జాతీయ ఉదారవాద అభివృద్ధి క్రమంలో భాగంగా చేయాలన్న అమెరికా ప్రయత్నం ఇపుడు ఆసియాలో అమెరికా ఆధిపత్యానికి ప్రమాదంగా పరిణమించింది. చివరకు అమెరికా ప్రపంచాధిపత్యానికి కూడా ప్రమాదంగా మారుతుంది. చైనా అభివృద్ధికి తోడ్పడటం కాకుండా, చైనా శక్తిని పరిమితుల్లో ఉంచే పటిష్టమైన వ్యూహాన్ని అమెరికా అనుసరించాలి” అని నివేదికలో చెప్పారు.

ఆర్థిక ప్రపంచీకరణ ఆధారంగా, అంతర్జాతీయ మార్కెట్లతో సమ్మిళితమై చైనా ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నది. కాబట్టి ఆర్థిక స్వయంసమృద్ధిపై ఆధారపడిన సోవియట్ యూనియన్‌ను నిరోధించటానికి ప్రయోగించిన ప్రచ్ఛన్నయుద్ధ వ్యూహం కూడా చైనాను నిరోధించటానికి ఉపయోగపడదు.

ఈ అంశం యుద్ధానికి మూలాలు పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత అభివృద్ధి క్రమంలోనే ఉన్నాయనే మార్క్సిస్టు విశ్లేషణను రూఢి చేస్తున్నది. చైనా ప్రపంచ మార్కెట్లచట్రం పరిధిలోనే పనిచేస్తూ, అమెరికా వలెనే బలపడింది. ఈ విధంగా ప్రపంచ మార్కెట్లతో సమ్మిళితమైన చైనా అభివృద్ధి అమెరికా ఆధిపత్యాన్ని బలహీనపర్చింది.

“ ప్రపంచ వాణిజ్య వ్యవస్థలోకి చైనా ప్రవేశంతో చైనా ఆర్థికాభివృద్ధి వేగిరం కావటానికి తోడ్పాటు నందించవలసిన ఇబ్బందికరమైన పరిస్థితిలోకి అమెరికా నెట్టబడింది.ఆ విధంగా అభివృద్ధి కావటం ద్వారా చైనా ప్రాంతీయ రాజకీయ ప్రత్యర్థిగా ఎదిగింది” అని నివేదికలో పేర్కొన్నారు.

అమెరికా యొక్క “ గొప్ప వ్యూహం” లోని

> **❝ అమెరికా యుద్ధానికి కారణం కాదని, అమెరికా శత్రువే అందుకు కారణమని, ఈ సందర్భంలో తన హక్కుల గురించి గట్టిగా పట్టుపడుతున్న, దురాక్రమణదారీ విధానం అనుసరిస్తున్న చైనాయే అందుకు కారణమనే అబద్ధపు ప్రచారాన్ని రూపొందించటానికి ఉన్నతస్థాయి దౌత్యకృషి, కొన్ని రంగాలలో చైనాతో కలిసి జాయింటు వెంచర్లు ఏర్పాటు చేయటం తదితరాలు ఉద్దేశించబడ్డాయి. ❞**

కీలకాంశాల గురించి చెబుతూ రచయితలు ఆర్థికాంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్థికవ్యవస్థను శక్తివంతం చేసే ప్రణాళికలో భాగంగా చైనాను మినహాయిస్తూ ఆసియాలో కొత్త వాణిజ్య సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని, అమెరికా మిత్రులతోనూ, అమెరికాలాగే ఆలోచిస్తున్న ఇతరులతో కలిసి ఆసియాలోనూ, ఇతర ప్రాంతాలలోనూ చైనాయొక్క ఆర్థికశక్తిని ఎదుర్కొనే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞాన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు.

చైనాను మినహాయిస్తూ ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్ పసిఫిక్ పార్టనర్‌షిప్ (టిపిపి)ను అతిముఖ్యమైనదిగా చూస్తున్న ఒబామా దీని అమలు కోసం అమెరికా కాంగ్రెస్ అనుమతిని అత్యవసరంగా కోరుతున్నాడు. దీనిని అమలు చేయటంలో విఫలమైతే అమెరికా పటిష్టవ్యూహం తీవ్రంగా బలహీనపడుతుందని చెబుతున్నారు.

ఈ రిపోర్టులో ఆర్థిక అంశాలకు ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ సైనికపరమైన అంశాలకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇందుకు భిన్నంగా అమెరికా తీసుకోవాల్సిన విధానపరమైన చర్యల గురించి, ఈ ప్రాంతంలోని తన మిత్రుల నుండి పొందవలసిన సహకారానికి సంబంధించి వివరంగా చర్చించారు.

జపాన్‌తో సంబంధాలు మొదటి స్థానాన్ని ఆక్రమించాయి. అమెరికా జపాన్ రక్షణ సంబంధాలు మొత్తం ఆసియా అంతటికి విస్తరింపచేయాలని, జపాన్ సైన్యాన్ని ఆధునీకరించేలా, చైనా ప్రధాన భూభాగంలోని సైనిక కేంద్రాలపై వైమానిక, నౌకాదాడులు జరిపే భావనలలో జపాన్‌ను భాగస్వామిని చేయటం, క్షిపణి రక్షణవ్యవస్థలో జపాన్ సహకారాన్ని తీసుకోవటం తదితరాల గురించి నివేదికలో పేర్కొన్నారు. మొదట దెబ్బతీసి, శత్రువు ప్రతిఘటనాశక్తిని నిర్వీర్యం చేసే వ్యూహంలో మిసిలీ వ్యతిరేక వ్యవస్థలను కీలకమైనవిగా చూస్తున్నారు. దక్షిణకొరియాకు సంబంధించి జపాన్‌తో కలిసి సమగ్రమైన వ్యూహం రూపొందించాలని, మిసిలీ రక్షణవ్యవస్థను బలపరచాలని, ఉత్తరకొరియాలో ప్రభుత్వాన్ని మార్చాలని నివేదికలో చెప్పారు.

పసిఫిక్‌లో అమెరికా సంబంధాల విస్తరణలో ఆస్ట్రేలియాను " దక్షిణ కేంద్రం"గా నివేదికలో వర్ణించారు. ఈ ప్రాంతంలో ఆమెరికా నౌకాశక్తి నిర్మాణాన్ని బలపరచుకోవటానికి పశ్చిమ ఆస్ట్రేలియాలోని స్టిర్లింగ్ నౌకాస్థావరాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. "అమెరికా, ఆస్ట్రేలియాలు సమాచారం సేకరించే, మానవరహిత విమానాలను హిందూమహాసముద్రంలోని కూకూస్ దీవిలో కేంద్రీకరించాలని, మిసిలీ రక్షణవ్యవస్థకు ఆస్ట్రేలియా సహకారాన్ని త్వరితం చేసేవిధంగా రెండుదేశాలు కలిసి పనిచేయాలని చెప్పారు.

ఈ జాబితా పెరిగిపోతున్నది. భారతదేశం, అమెరికాల మధ్య సైనిక సహకారం పెరగాలని, ప్రస్తుత బలాబలాల సమతూకంలో భారతదేశం యొక్క అణ్వస్త్రాలు గొప్ప సంపదగా చూడాలని చెప్పారు. ఉమ్మడి సైనిక విన్యాసాలలో ఇండోనేషియా పాత్రను పెంచాలని, వియత్నాంతో నౌకా విన్యాసాలను విస్తరించాలని, ఫిలిప్పీన్స్ రక్షణ శక్తిసామర్థ్యాలను తప్పనిసరిగా పెంచాలని చెప్పారు.

రాజకీయరంగంలో హిందూ మహా సముద్రం, పసిఫిక్ ప్రాంతంలో నమ్మకమైన వ్యూహాత్మక సంబంధాలను, భాగస్వామ్య సంబంధాలను సాంప్రదాయక అమెరికా మిత్రులతో మాత్రమేకాక, ఆ పరిధిని దాటి విస్తరించాలని చెప్పారు. ప్రతి సందర్భంలోనూ అమెరికా ప్రత్యక్ష భాగస్వామ్యం లేకుండా, నిరంతరం అమెరికా మద్దత్తును పొందుతూ చైనాను స్వతంత్రంగా ఎదుర్కోవటం కోసం ఆసియా దేశాలను బలపరచాలని, చైనాకు వ్యతిరేకంగా ఆసియా దేశాల మధ్య సహకారాన్ని పెంచాలని చెప్పారు.

ఆర్థిక, రాజకీయ, సైనికరంగాలలో చైనా వ్యతిరేక చర్యలను గురించి చెప్పిన తర్వాత చైనాతో సహజంగా ఉన్న ఉద్రిక్తతలను తగ్గించటం కోసం అత్యున్నతస్థాయిలో దౌత్య ప్రయత్నం చేయాలని, చైనాతో ఘర్షణను నివారించటమే అమెరికా లక్ష్యమని ఆసియాలోనూ, ఇతర ప్రాంతాలలోని అమెరికా స్నేహితులకు హామీని ఇవ్వాల్సివుందని చెప్పారు.

దీనిలో స్పష్టంగా కనిపిస్తున్న వైరుధ్యాలు అమెరికా యుద్ధప్రయత్నాలలో ముఖ్యమైనవి. ఒకవైపు యుద్ధానికి ప్రయత్నం చేస్తూ, మరోవైపు సైద్ధాంతికంగా దాడి చేస్తున్నది. అమెరికా యుద్ధానికి కారణం కాదని, అమెరికా శత్రువే అందుకు కారణమని, ఈ సందర్భంలో తన హక్కుల గురించి గట్టిగా పట్టుపడుతున్న, దురాక్రమణదారీ విధానం అనుసరిస్తున్న చైనాయే అందుకు కారణమనే అబద్ధపు ప్రచారాన్ని రూపొందించటానికి ఉన్నతస్థాయి దౌత్యకృషి, కొన్ని రంగాలలో చైనాతో కలిసి జాయింటు వెంచర్లు ఏర్పాటు చేయటం తదితరాలు ఉద్దేశించబడ్డాయి. 19వ శతాబ్దం చివరిలో అమెరికా సామ్రాజ్యవాదశక్తిగా మారినప్పటి నుండి తన సైనిక కార్యకలాపాలు ప్రారంభించటానికి ఈ అబద్ధాలనే కేంద్రంగా చేసుకుంటున్నది.

వాస్తవంగా చైనాతో ఎటువంటి సహకారం సాధ్యం కాదని ఈ నివేదికలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. " మౌలికమైన విశ్వాసంగాని, శాంతియుత సహజీవనానికికాని, పరస్పర అవగాహనకుగాని, వ్యూహాత్మక భాగస్వామ్యానికిగాని, పెద్దదేశాల మధ్య ఉండే సంబంధాలుగాని చైనా, అమెరికాల మధ్య ఉండేందుకు ఎటువంటి వాస్తవ అవకాశాలు లేవని నివేదిక ముగింపులో రచయితలు పేర్కొన్నారు.

ఈ నివేదికను విడుదల చేయటం, అందులో అమెరికా యుద్ధప్రయత్నాలను గురించి వివరించటం అంతర్జాతీయ కార్మికవర్గం యుద్ధానికి వ్యతిరేకంగా సోషలిస్టు వ్యూహాన్ని అనుసరించవలసిన అవసరాన్ని తెలియజేస్తున్నది. నాలుగవ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ కమిటి పిలుపునిచ్చిన రేపటి ఆన్‌లైన్ మేడే ర్యాలిలో ఇది కీలకాంశంగా ఉండాలి.

**(అనువాదం : ఎ. కోటిరెడ్డి)**

# దశరథ్ దేవ్

(2వ పేజీతరువాయి)

రాష్ట్రకార్యదర్శిగా ఎన్నికయ్యాడు. 1952లో పార్టీ కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయాడు. 1964లో పార్టీలోని రివిజనిజానికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టుపార్టీలోని ఒక భాగం భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) ను ఏర్పాటు చేసినపుడు ఆయన సిపిఐ(యం)లో చేరి, కేంద్రకమిటీకి ఎన్నికైనాడు. అనారోగ్య కారణాల వలన 1998లో రిలీవ్ అయ్యేవరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు.

పస్తులుంటున్న ప్రజలకు ఆహారాన్ని అందించాలని, గత పాకిస్థాన్, (ప్రస్తుత బంగ్లాదేశ్) నుండి వలస వస్తున్న లక్షలాది మందికి తగిన పునరావాసం కల్పించాలని పోరాడారు. దశరథ్‌దేవ్, నృపేన్ చక్రవర్తి, బిరేన్‌దత్తాల నాయకత్వాన గిరిజనుల నాలుగు ముఖ్యమైన డిమాండ్లపై జరిగిన పోరాటం ఫలితంగా 1978లో విస్తృత ప్రజామద్దత్తుతో వామపక్ష సంఘటన ప్రభుత్వం ఏర్పడింది.

అధికారంలో కొచ్చిన తర్వాత వామపక్షసంఘటన ప్రభుత్వం కొన్ని చరిత్ర సృష్టించే ప్రజానుకూల విధానాలను అమలుపరిచింది. వాటిలో గిరిజనుల భాష అయిన కోక్‌బోరక్‌ను రాష్ట్రంలో రెండవభాషగా గుర్తించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా గిరిజనులకు విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేసింది. గ్రామీణపేదలకు పనికి ఆహారం పథకాన్ని అమలుచేసింది. మూడెకరాల లోపు భూమివున్న రైతులకు భూమిశిస్తును రద్దుచేసింది. అమలులో ఉన్న చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు బదిలీచేసిన గిరిజనుల భూములను తిరిగి వారికి అప్పగించింది. గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాలలో గిరిజన స్వయంప్రతిపత్తి మండలిని ఏర్పాటుచేస్తూ చట్టం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానాలను అమలుచేస్తున్న వామపక్ష ప్రభుత్వాన్ని లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్రంలో అస్థిరపరిస్థితులను సృష్టించటానికి, హింసాకాండను రెచ్చగొట్టటానికి స్వార్ధపరశక్తులు ప్రయత్నం చేశాయి. 1980 జూన్‌లో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య హింసాకాండను రెచ్చగొట్టారు. అప్పటినుండి గిరిజన వేర్పాటువాదులకు, బెంగాలీ దురహంకారులకు ఆయన లక్ష్యంగా మారాడు. ఆయనపై జరిగిన అనేక హత్యాప్రయత్నాల నుండి వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు. 1978 నుండి 1988 వరకు రాష్ట్రాన్ని పాలించిన నృపేన్ చక్రవర్తి నాయకత్వంలోని వామపక్షసంఘటన ప్రభుత్వంలో విద్యా, గిరిజన సంక్షేమశాఖల మంత్రిగా పనిచేశాడు. 1983 నుండి 1988 వరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పనిచేశాడు. 1988 నుండి 1993 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, టియుజెయస్‌ల సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంలో అర్థఫాసిస్టు నిర్బంధాన్ని కొనసాగించిన కాలంలో ప్రతిపక్ష నాయకునిగా ఆయన కీలకపాత్ర పోషించాడు.

1993లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఆనాడు త్రిపురలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, టియుజెయస్‌లు హింసాకాండను రెచ్చగొట్టి, రిగ్గింగ్ ద్వారా అధికారంలోకి రావాలని ప్రయత్నించాయి. కాని సిపిఐ(యం) నాయకత్వంలో జరిగిన ప్రజాపోరాటాల వలన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలను ఫిబ్రవరి నుండి ఏప్రిల్‌కు వాయిదా వేయాల్సివచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసి, త్రిపురలో కేంద్రపాలన విధించారు. ఆ ఎన్నికల పోరాటంలో సిపిఐ(యం) ఘన విజయం సాధించింది. 60 స్థానాలకుగానూ 44 స్థానాలు సాధించి అధికారంలోకి వచ్చింది. 1993 ఏప్రిల్ 10న దశరథ్‌దేవ్ రాష్ట్రముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 1998 మార్చి11 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగాడు. అధికారానికి వచ్చిన వెంటనే త్రిపురలోని వివిధ తిరుగుబాటు గ్రూపుల సభ్యులకు ప్రభుత్వం క్షమాభిక్షను ప్రకటించింది. త్రిపుర రాష్ట్రానికి మొదటి గిరిజన ముఖ్య మంత్రిగా ఆయన గిరిజనుల, పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. అనారోగ్యకారణాల వలన 1998 ఎన్నికల్లో ఆయన పోటి చేయలేదు.

ఈ విధమైన కార్యకలాపాలను కొనసాగిస్తూ రాష్ట్రంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య స్నేహ, సామరస్యాల్ని నెలకొల్పటంలో దశరథ్‌దేవ్ ముఖ్యపాత్ర పోషించాడు. 1964లో ఉపజాతి గణముక్తి పరిషత్ పేరుతో ఏర్పడిన గిరిజనుల హక్కుల పరిరక్షణా సంస్థకు చనిపోయేవరకు అధ్యక్షునిగా కొనసాగాడు. ఆయన మంచి ఉపన్యాసకుడేకాక గొప్పపార్లమెంటేరియన్‌గానూ పేరుతెచ్చుకున్నాడు. పరిపాలనాదక్షునిగా, ప్రముఖ రచయితగా, భాషాధ్యయనంలో నిపుణునిగా ఖ్యాతి గడించారు. ఆయనకు అనేక భారతీయ భాషలతో పరిచయం ఉంది. సంస్కృతం, బెంగాలీ, హింది తదితర భాషలలో పాండిత్యం ఉంది. కోక్‌బోరక్ భాషపై ఆధిపత్యం సాధించాడు. ఆయన ప్రత్యేకంగా చేసినకృషి ఫలితంగానే కోక్‌బోరక్ భాష ఉచ్చారణ కనుగుణంగా లిపిని రూపొందించారు.

ఆయన రచించిన ''నాస్మృతిపథంలో ప్రజా వుద్యమాల చరిత్ర, జ్ఞాపకాలు'', ''గణముక్తి పరిషత్ చరిత్ర'' పుస్తకాలు రాష్ట్ర ప్రజావుద్యమాల చరిత్రకు సంబంధించి వెలకట్టలేని సంపదగా ఉన్నాయి. ఆయన రష్యా, చైనా, బ్రిటన్ తదితర దేశాలలో పర్యటించారు. 82 సంవత్సరాల వయసులో 1998 అక్టోబరు 14వ తేదీన మరణించారు.


PSBH

తప్పక చదవండి




ఈ పుస్తకంలో సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఛార్లెస్ డార్విన్ జీవిత వివరాలు, ఆయన గావించిన విజ్ఞాన పరిశోధనలు, రూపొందించిన 'పరిణామ సిద్ధాంతం' వివరాలు.. అన్నీ మనం తెలుసుకోవచ్చు. ఆయన ప్రతిపాదించిన 'జీవ పరిణామాభివృద్ధి' (జీవ పరిణామ సిద్ధాంతం)తో పాటు శాస్త్రవిజ్ఞాన గ్రంథాలకు సంబంధించిన సమాచారం కూడా ఈ పుస్తకం మనకు అందిస్తుంది. ఆయన నిర్ధారణలు ప్రపంచ విజ్ఞానరంగంలో సాటిలేని విప్లవం సాధించాయి. అయినా ఈనాటికీ అమెరికా పాలకులు దానిని అంగీకరించక తమ విద్యాలయాల్లో దానిని బహిష్కరించి, ఆ సిద్ధాంత సమర్థకులను కోర్టులకీడ్చి చేస్తున్న హంగామా గురించి కూడా ఈ 'ఛార్లెస్ డార్విన్' పుస్తకం వివరిస్తుంది. డార్విన్ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా చూరగొన్న అపార విజయాలు అమెరికన్ పాలకులకు చెంపపెట్టు లాగా పరిణమించాయి.


**ఛార్లెస్ డార్విన్** - ఆర్. పెరియస్వామి - వెల : రూ. 60/- పేజీలు : 96

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20, ఫోన్ : 27608107, 9490099202

బ్రాంచీలు :
హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, నల్గొండ, ఖమ్మం, ఒంగోలు, కరీంనగర్

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-06-2015 Postal Regd. No L1/SD/407/13-15



# న్యాయమైన రోజు పనికి న్యాయమైన రోజు కూలి

న్యాయమైన రోజు పనికి న్యాయమైన రోజు కూలా? మరి, న్యాయమైన రోజు పని ఏది? న్యాయమైన రోజు కూలి ఏది? ఏ నియమాలతో ఆధునిక సమాజం మనుతూ, తన్ను తాను అభివృద్ధి చేసుకుంటున్నదో, ఆ నియమాలచేత ఇవి ఎలా నిర్ణయింపబడతాయి? దీనికి జవాబు కొరకు మనం నీతిశాస్త్రానికి గానీ, న్యాయశాస్త్రానికి గానీ, మానవతా భావానికి గానీ, న్యాయ దృష్టికి గానీ, చివరకు ధర్మబుద్ధికి గానీ విజ్ఞప్తి చేయకూడదు. నైతికంగా న్యాయమైనది, న్యాయశాస్త్ర దృష్ట్యా న్యాయమైనది కూడా, సాంఘికంగా న్యాయం కాకుండా ఉండవచ్చు. సాంఘిక న్యాయం, లేదా సాంఘిక అన్యాయం ఒకే ఒక శాస్త్రం చేత మాత్రమే నిర్ణయింపబడుతుంది. ఉత్పత్తి, మారకాలకు సంబంధించిన శాస్త్రం, అనగా అర్థశాస్త్రం చేత నిర్ణయించబడుతుంది.

మరి, అర్థశాస్త్రం దేనిని న్యాయమైన రోజు కూలి అనీ, న్యాయమైన రోజు పని అనీ అంటుంది? బహిరంగ మార్కెట్‌లో యజమానికీ, కూలివానికీ మధ్య ఉన్న పోటీచేత నిర్ణయింపబడిన కూలి రేటూ, రోజు పనియొక్క దైర్ఘ్యమూ, తీవ్రతా మాత్రమే. మరి, అలా నిర్ణయింపబడినప్పుడు, అవి ఏమిటి?

మామూలు పరిస్థితులలో న్యాయమైన రోజు కూలి అంటే, శ్రామికుని స్థాయియొక్క దేశంయొక్క జీవన ప్రమాణాలను అనుసరించి, తన్ను తాను పనిచేసే స్థితిలో ఉంచుకోవడానికి, వంశవృద్ధికి అవసరమైన తిండి తీర్థాలను అతనికి ఇవ్వగల మొత్తం. వర్తకపు ఎగుడుదిగుడుల మూలంగా, వాస్తవంలో ఉండే కూలి రేటు ఈ రేటుకంటే ఒక్కోసారి ఎక్కువగానూ, ఒక్కోసారి తక్కువగానూ ఉండవచ్చు. కానీ, న్యాయమైన పరిస్థితులలో ఆ రేటు సకల ఎగుడుదిగుడుల సరాసరిగా ఉండాలి.

న్యాయమైన రోజు పని అంటే, కార్మికుని ఒక రోజుయొక్క పూర్తి శ్రమ శక్తిని ఖర్చు చేసేటంత దీర్ఘమైన పనిదినమై, అంత తీవ్రత గల వాస్తవమైన పనీ–మరుసటి రోజూ, ఆ తరువాతి రోజులూ అదే మొత్తం పని చేయటానికి అతనికి గల సామర్థ్యాన్ని దెబ్బతీయకుండా ఉండేది. కనుక ఈ బేరాన్ని యీ విధంగా వర్ణించవచ్చు – కార్మికుడు పెట్టుబడిదారునికి తన పూర్తి రోజుయొక్క శ్రమ శక్తిని ఇస్తాడు. అనగా, ఈ బేరం యొక్క నిరంతరాయ పునశ్చరణను అసాధ్యం చేయకుండా అతను ఎంత ఇవ్వగలడో అంత. దీనికి బదులుగా అతను పొందేది ఏమిటంటే, ప్రతిరోజూ ఇదే బేరంయొక్క పునశ్చరణను సాగించడానికి అవసరమైనంత, అంతకంటే ఏ మాత్రమూ ఎక్కువకాని, జీవితావసర వస్తువులు. బేరంయొక్క స్వభావం ఎంత ఎక్కువగా అనుమతిస్తుందో అంత కార్మికుడూ, ఎంత తక్కువ అనుమతిస్తుందో అంత పెట్టుబడిదారుడూ ఇస్తారు. ఇది చాలా చిత్రమైన న్యాయం.

కానీ, ఈ విషయంలోకి మరింత లోతుగా చూద్దాం. అర్థశాస్త్రజ్ఞుల ప్రకారం వేతనాలూ, పనిదినాలూ పోటీచేత నిర్ణయింపబడతాయి గనుక, ప్రారంభంలో ఇరుపక్షాలకూ సమాన షరతులు ఉండడం న్యాయంగా కనబడుతుంది. కానీ అలా ఉండడం లేదు. పెట్టుబడిదారుడు, కార్మికునితో అంగీకారానికి రాలేకపోతే, ఆగి, తన పెట్టుబడి మీద బతకగలడు. కార్మికుడు అలా చేయలేడు. అతనికి బతకడానికి కూలి మాత్రమే ఉంది. కనుక అతను ఎప్పుడు, ఎక్కడ, ఏ షరతులమీద పని సంపాదించుకోగలిగితే అప్పుడు, అక్కడ, ఆ షరతులమీద పనిని తీసుకోవాలి. ప్రారంభంలోనే కార్మికుడు ప్రతికూల పరిస్థితిలో ఉన్నాడు. అతనికి ఆకలి అనే భయంకరమైన అసౌకర్యం ఉంది. కానీ, పెట్టుబడిదారీ వర్గ అర్థశాస్త్ర ప్రకారం, అది న్యాయానికి పరాకాష్ఠ.

యాంత్రిక శక్తినీ, యంత్రాలనూ నూతన వృత్తులకు ప్రయోగించడమూ, అప్పటికే వాటికి గురైన వృత్తులలో యంత్రాల విస్తరణా, మెరుగుదలలూ అంతకంతకూ ఎక్కువ 'చేతుల'ను నిరుద్యోగులుగా చేస్తూ ఉంటాయి. ఈ తొలగింపబడిన 'చేతులు' పెట్టుబడి ఉపయోగార్థం నిజమైన రిజర్వు పారిశ్రామిక సైన్యంగా ఏర్పడతాయి. ఈ రిజర్వు సైన్యంలోని చివరి పురుషునికీ, స్త్రీకి, లేదా బాలబాలికలకూ పని దొరికిందాకా ఈ సైన్యపు పోటీ వేతనాలను తగ్గించి ఉంచుతుంది.

ఫ్రెడరిక్ ఎంగెల్స్ రాసిన 'వేతన వ్యవస్థ' అనే గ్రంథం నుండి ఈ భాగం గ్రహించబడింది.

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.1. Published on June 1, 2015